ఈనాడు
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం 21 ఆగస్టు 2017 | 16 పేజీలు

జిల్లాకు కొత్త పరిశ్రమలు

టీఎస్-ఐపాస్‌తో రెట్టింపైన పెట్టుబడులు

యువతకు పెరుగుతున్న ఉపాధి అవకాశాలు



కొత్తగూడెం

పారిశ్రామికంగా రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తోంది. ఈ రంగంలో అవినీతిని రూపుమాపేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, టీఎస్ ఐపాస్ విధానం యువ పారిశ్రామికవేత్తలకు వరంగా మారింది. ఎన్నో కొత్త పరిశ్రమలను నెలకొల్పేందుకు అవకాశం ఏర్పడింది. 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనమిక్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్)' సంస్థ నిర్వహించిన 'స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ పొటెన్షియల్ ఇండెక్స్' సర్వేలో గత ఏడాదిలో వచ్చిన మార్పులు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో పారిశ్రామిక ప్రగతిని ఓ సారి పరిశీలిస్తే... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో గత 50 ఏళ్లలో రూ.3 వేల కోట్లతో 1,000 పరిశ్రమలు ఏర్పాటు అయితే, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రూ.9 వేల కోట్లతో 74 కొత్త పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఉపాధి అవకాశాలు కూడా మెరుగయ్యాయి.

కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు పరిశ్రమల కేంద్రం కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. టీఎస్-ఐపాస్ కింద ఆన్‌లైన్‌లోనే



దరఖాస్తు చేసుకోవచ్చు. ఇది ఒక సంపూర్ణమైన ఇంటరాక్టివ్ ఆన్‌లైన్ వ్యవస్థ. మెగా ప్రాజెక్టు(రూ.200 కోట్లు ఆపైన పెట్టుబడి లేదా 1000 మందికి ఉపాధి కల్పించే పరిశ్రమ)లకు గరిష్ఠంగా 15 రోజుల్లో అనుమతులు ఇస్తారు. ఇతర పరిశ్రమలకు గరిష్ఠంగా 30 రోజుల్లో అనుమతులు ఇస్తారు. నిర్ణీత సమయంలో మిగతా 2లో

జిల్లాలో కొత్తగా ఏర్పాటైన పరిశ్రమలు, పెట్టుబడి, లభిస్తున్న ఉపాధి వివరాలు



	పెట్టుబడులు రూ. కోట్లలో	కార్మికులకు ఉపాధి ప్రత్యక్షంగా, పరోక్షంగా
భద్రాద్రి పవర్ ప్లాంట్	7,290.06	3000
ఆయిల్‌పాం	78.35	100
ఐటీసీ (బ్లీచ్‌డ్ పేపర్)	479.3	600
కేటీపీఎస్ 7వ దశ విస్తరణ	5,000	4,000
మణుగూరు సోలార్ పవర్ ప్లాంట్	95.00	300

ఈ రంగాల్లో పరిశ్రమల ఏర్పాటుకు మరిన్ని అవకాశాలు

- కేటీపీఎస్, సింగరేణి కాలరీస్, ఐటీసీ అనుబంధంగా పెద్ద, మధ్య తరహా పరిశ్రమలు
- అశ్వారావుపేట, భద్రాచలం, దమ్మపేట ప్రాంతాల్లో నర్సరీలు, ఉద్యానవనాలు
- దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతంలో ఆయిల్ పాం, జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లు
- జిల్లాలోను వ్యవసాయం విస్తీర్ణం ఎక్కువ ఉండటంతో విత్తన ప్రాసెస్ యూనిట్లు, శీతల గిడ్డంగులు
- గిరిజన సహకార సంస్థ ద్వారా చింతపండు, తేనె, విప్పపువ్వు, బీడీ ఆకులు తదితర అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్.
- పత్తి ఎక్కువగా సాగు చేస్తుండడంతో కాటన్ మిల్, రైస్ మిల్లులు, పప్పు మిల్లులు ఏర్పాట్లు
- టమాటా, మిరప ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు
- పండ్లు, జ్యూస్‌ల ఫ్రూట్ ప్రాసెసింగ్ యూనిట్లు
- మార్బుల్, గ్రానైట్, ఐరన్ ఓర్ తదితర మైనింగ్ పరిశ్రమలు
- వెదురు ఉత్పత్తుల తయారీ, విక్రయ కేంద్రాలు
- భద్రాచలం, కిన్నెరసాని, పర్ణశాల తదితర పర్యాటక ప్రాంతాల్లో అనుబంధ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, పార్కులు, పడవలు ఏర్పాటు
- కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు ప్రాంతాల్లో ఆటోమొబైల్ రంగం విస్తరిస్తోంది. ఆయా ప్రాంతాల్లో ఆటోమొబైల్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు.
- గోదావరి, కిన్నెరసాని తాలిపేరు నుంచి నీటి లభ్యత ఎక్కువ. నీటి అవసరం ఉన్న పెద్ద పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. అంతేగాక వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పవచ్చు.



దమ్మపేట: అప్పారావుపేటలోని ఆయిల్‌పాం పరిశ్రమ

మళ్లీ మహాలడ్డూల విక్రయాలకు ప్రణాళిక

ప్రసాదాల ధరల పెంపునకు సమాలోచనలు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయంలో ప్రసాదాల ధరలు మళ్లీ పెరగనున్నాయి. వీటితో పాటు కొంత బరువు కూడా పెంచనున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే అక్టోబరు 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయని భావిస్తున్నారు. ఇందుకు అభ్యంతరాలు ఉంటే పది రోజుల్లోగా తెలపాలని ఈవో ప్రభాకర శ్రీనివాస్ ఆదివారం రాత్రి ఓ ప్రకటన జారీ చేశారు. అభ్యంతరాలు లేకుంటే 01.10.2017 నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయన్నారు. గత ఈవో జ్యోతి ఉన్న సమయంలో ప్రసాదాల ధరలు పెరిగాయి. ప్రస్తుతం జీఎస్టీ భారంతో పాటు నిత్యావసర సరకుల ధరలు పెరగడంతో ప్రసాదాల ధరలను పెంచేందుకు సమాయత్తమయ్యారు. 400 గ్రాముల కల్యాణ లడ్డూలు ఇంతకు ముందు రూ.50కి విక్రయించేవారు. రెండున్నర నెలల నుంచి వీటిని విక్రయాలు పూర్తిగా ఆపారు. కల్యాణం చేయించిన వారికి మిగతా 2లో



కల్యాణ లడ్డూలు ఇంకా బరువు పెరగనున్నాయి (ఎడమ), 80 గ్రాముల లడ్డూలు 100 గ్రాములు కానున్నాయి(కుడి)

పునాదులకే పరిమితం

నత్తనడకన కిన్నెరసాని పర్యాటక అభివృద్ధి

పర్యవేక్షణాధికారుల నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యం

కిన్నెరసాని పర్యాటక అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో పనుల్లో వేగం మందగించింది. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లల్లో నిధులు విడుదల చేసినా స్థానిక అధికారుల చొరవ లేకపోవడంతో జాప్యం చేస్తున్నారు. నిధులొచ్చి ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ పర్యాటక అభివృద్ధి పనులు పునాదులు దాటడం లేదు. ఇదేమంటే డ్రాయింగ్‌లు ఆలస్యంగా వచ్చాయని గుత్తేదారులు సాకులు చూపుతున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా ఉండడంతో పనులు జరగట్లేదని పర్యాటకులు ఆరోపిస్తున్నారు.

పాల్వంచగ్రామీణం, న్యూస్‌టుడే



పిల్లర్ల దశలోనే ఉన్న ఫుడ్‌కోర్టు నిర్మాణం

కిన్నెరసానిలో పర్యాటక అభివృద్ధికి నీతి ఆయోగ్, ఎకోటూరిజం కింద రూ.10.77 కోట్లు విడుదల చేశారు. దీంట్లో అద్దాలమేడ, కాటేజీలు, ఫుడ్‌కోర్టు, రోడ్లు, గృహాలంకరణ వస్తువులు చేయాల్సి ఉంటుంది. సివిల్ పనుల్ని పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. పర్యాటక అభివృద్ధికి నిధులు విడుదలై ఏడాదిన్నర అవుతున్నప్పటికీ పనుల్లో పురోగతి సాధించలేకపోతున్నారు. అధికారులు పర్యవేక్షణ కొరవడడంతోనే గుత్తేదారులు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల టూరిజం అభివృద్ధి ఎండీ క్రిష్టినా సైతం పనులు పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ ఏ మాత్రం స్పందన లేకపోవడం గమనార్హం.

పునాదుల్లోనే కాటేజీలు.. కిన్నెరసానిలో గతంలో అద్దాలమేడ, కాటేజీలు ఉండేవి. అద్దాలమేడ అద్భుతంగా చూపరుల్ని ఆకట్టుకునేది. నక్సల్స్ దీన్ని కూల్చివేయడంతో ఎవ్వరూ పట్టించుకోలేదు. ఎమ్మెల్యే జలగం వెంకటరావు కృషితో పర్యాటకం అభివృద్ధి ఊపందుకుంది. నియోజకవర్గానికి రూ.23.13 కోట్లు మంజూరు కాగా వీటిలో ఇల్లెందు క్రాస్ రోడ్డులో బడ్జెట్ హోటల్ రూ.10 కోట్లతో నిర్మించనున్నారు. కిన్నెరసానికి మాత్రం మిగతా 2లో



స్వచ్ఛమేవ జయతే

3

జాతరమ్మో.. జాతర

వివరాలు 6లో



జిల్లాకు కొత్త పరిశ్రమలు

(మొదటి పేజీ తరువాయి) అనుమతులు ఇవ్వకుంటే అందుకు బాధ్యులైన అధికారులకు రోజుకు రూ.1000 చొప్పున జరిమానా విధిస్తారు. నిర్ణీత సమయంలో లభించని అనుమతులను డీమ్డ్‌గా పరిగణించి అనుమతులు ఇవ్వబడతాయి. ఈ పూర్తి ఆన్‌లైన్ విధానంలో ఏ ఒక్క అధికారిని కలవాల్సిన అవసరం లేకుండా పోయింది. కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్, బాయిలర్స్, కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలశాఖ అనుమతులను స్వయం ధ్రువీకరణ విధానం ద్వారా ఇచ్చే ఏర్పాటు చేశారు. క్రమం తప్పకుండా నెలకోసారి జిల్లా పాలనాధికారి అధ్యక్షతన జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ సమావేశం జరుగుతోంది. పరిశ్రమల దరఖాస్తుల పురోగతిని పరిశీలించి తక్షణ చర్యలు తీసుకుంటారు. ఆన్‌లైన్ దరఖాస్తు వివరాలను డాష్ బోర్డు అందుబాటులో ఉంచుతున్నారు. ముఖ్యమంత్రితోపాటు రాష్ట్ర స్థాయి అధికారులు ఏ సమయంలోనైనా జిల్లాల వారీగా దరఖాస్తుల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవచ్చు. ఒక వేళ ఫైల్ పెండింగ్‌లో ఉంటే అది ఏ శాఖ వద్ద ఉందో తెలుసుకోవచ్చు.

ఎన్నో సానుకూలాంశాలు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగా పరిశ్రమలు స్థాపించుకునేందుకు ఎంతో అవకాశం ఉంది. గోదావరి నీళ్లు, సింగరేణి బొగ్గు, విద్యుదుత్పత్తి, అటవీ పచ్చదనం అపారం. త్వరలో విమానాశ్రయం కూడా వచ్చే అవకాశం ఉంది. ఈ అంశాలు కొత్త పరిశ్రమలు రావడానికి దోహదపడుతున్నాయి. ఇక్కడున్న వనరులకు అనుగుణంగా అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేసుకునేందుకు రైలు, రోడ్డు, విమాన మార్గాల ద్వారా దేశ విదేశాల్లో మార్కెట్ చేసుకునేందుకు కూడా జిల్లాలో అనుకూల వాతావరణం నెలకొంటోంది. కొత్త జిల్లాగా ఆవిర్భవించిన తర్వాత 'జిల్లా పరిశ్రమల కేంద్రం' ఇందుకు విశేష కృషి చేస్తోంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 74 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చారు. ఇందుకోసం పారిశ్రామికవేత్తలు రూ.9,406 కోట్లు పెట్టుబడులు పెట్టారు. ప్రత్యక్షంగా ఏడు వేల మంది ఉపాధి పొందుతుండగా.. పరోక్షంగా వందలాది మందికి ఉపాధి అవకాశం ఏర్పడింది. 1/70 చట్టంతో గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కూడా అనేక అవకాశాలు లభించినట్లయింది.

మహిళలకు ప్రత్యేక రాయితీలు

టి-ఐడియా పథకం కింద జనరల్ కేటగిరి, బీసీ, మైనార్టీ వర్గాలకు పరిశ్రమల ఏర్పాటు కోసం రాయితీ పథకాలను అమలు చేస్తున్నారు. టి-ప్రైడ్ పథకం కింద షెడ్యూల్ కులం, షెడ్యూల్ తెగలు, దివ్యాంగులకు పారిశ్రామిక ప్రోత్సాహక రాయితీ పథకాలను అమలు చేస్తున్నారు. ప్రతి పథకంలోనూ సాధారణ రాయితీ శాతం కంటే మహిళా పారిశ్రామిక వేత్తలకు 10 శాతం చొప్పున రాయితీ ఎక్కువగా ఉంది. రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి 74 పరిశ్రమలు రాగా కేవలం నలుగురు మాత్రమే మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం కింద ఎలాంటి గడువు లేకుండా నిరంతరంగా ఉపాధి కల్పిస్తున్నారు. ఈ పథకం కింద రూ.25 లక్షల లోపు సూక్ష్మ తరహా పరిశ్రమలు స్థాపించడానికి అవకాశం ఉంది. కొత్త పరిశ్రమలు ఏర్పాటుకు కొందరు ఎస్సీ, ఎస్టీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు కలగకూడదని వారికి తక్షణ ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు రూ.లక్షల విలువైన వాహనాలు కూడా అందజేస్తున్నారు. జేసీబీలు, కార్లు, క్రేన్లు, ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్లు, వే బ్రిడ్జిలు తదితర వాటికి రుణ సాయం అందజేస్తున్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



కేసీఆర్ ప్రభుత్వం టీఎస్-ఐపాస్ ఏక గవాక్ష (సింగిల్ విండో) పద్ధతిని తీసుకొచ్చింది. పెట్టుబడిదారులకు పారిశ్రామిక అనుమతులను పొందే చట్టబద్ధమైన హక్కును కల్పించారు. జిల్లాలోని కొత్త పరిశ్రమలకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో పలు ప్రాంతాల్లో అవగాహన సదస్సుల కూడా ఏర్పాటు చేశాం. రానున్న రెండేళ్లకు కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. **అజయ్‌కుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్**

తెరపై ఈనాడు

దుర్గా: ఫిదా పరమేశ్వరీ: లై
పూర్ణ: జయ జానకి నాయక
విశ్వరూప: ఆనందోబ్రహ్మ
మహేశ్వరీ: నేనే రాజు నేనే మంత్రి

పాల్వంచలో..

వెంకటేశ్వర: జయ జానకి నాయక
వేణుగోపాల్: నేనే రాజు నేనే మంత్రి
శాంతి: లై

భద్రాద్రి రామాలయ వేళలు

ఉదయం 4.30 గంటలకు ఆలయం తలుపులు తెరచి సుప్రభాతం నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆరాధన, సేవాకాలం, నివేదన ఉంటుంది. 7 గంటల నుంచి దర్శనాలు ఉంటాయి. ఉదయం 9 గంటలకు నిత్య కల్యాణం ప్రారంభం. మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు తలుపులు మూస్తారు. రాత్రి 9 గంటల వరకు దర్శనాలు ఉంటాయని ఈవో ప్రభాకర శ్రీనివాస్ తెలిపారు.

అభిషేకాలు

ప్రతీ రోజు(ఆదివారం మినహా) భద్రుడి మండపంలో స్వామి వారి పాదాలకు అభిషేకం ఉంటుంది. ఇది ఉదయం 7 నుంచి 8.30 వరకు జరుగుతుంది. టిక్కెట్ ధర రూ.100. ప్రతి ఆదివారం మూల వరులకు అభిషేకం జరుగుతుంది. టిక్కెట్ ధర రూ.1,100. ప్రతీ శుక్రవారం లక్ష్మీతాయారు అమ్మవారి సన్నిధిలో ఉదయం 8.30 నుంచి 9 వరకు అభిషేకం ఉంటుంది. టిక్కెట్ ధర రూ.100. ప్రతీ మంగళవారం ఆంజనేయ స్వామి వారికి అభిషేకం ఉంటుంది. ప్రతీ శనివారం నరసింహ స్వామివారి ఆలయంలో ఉదయం 9 నుంచి 10 వరకు అభిషేకం ఉంటుంది. టిక్కెట్ ధర రూ.100

శాశ్వత సేవలు (పదేళ్లకు పరిమితం)

శ్రీరామ నవమి మినహా దాత కోరిన రోజు స్వామి వారి కల్యాణం చేపించవచ్చు. ఇలా ఏడాదికి ఒక రోజు అవకాశం ఉంటుంది. ఇందుకు రూ.10 వేలు చెల్లించాలి. నలుగురికి అన్నదానం చేయదలిస్తే రూ.1,116 చెల్లించాలి. శాశ్వత పట్టాభిషేకం చేయించదలిస్తే ఏడాదిలో ఒకసారి పుష్యమి నక్షత్రం రోజున ఈ అవకాశం వర్తిస్తుంది. ఇందుకు రూ.2,500 చెల్లించాలి. శాశ్వత వాహన సేవకు రూ.10 వేలు చెల్లించాలి.

- భద్రాచలం, న్యూస్‌టుడే

ఖమ్మంలో రాజీవ్‌గాంధీ జయంతి

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఖమ్మం డీసీసీ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో రాజీవ్ చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు అయితం సత్యం పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం ప్రాణాలర్పించిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో కార్యకర్తలు పార్టీ పురోభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎర్రం బాలగంగాధర్‌తిలక్, నాగండ్ల దీపక్‌చౌదరి, వడ్డెబోయిన నర్సింహారావు, నాయకులు కొత్తా సీతారాములు, తాజుద్దీన్, సోమ్లానాయక్, వెంకటేశ్వరరావు, అశోక్, బాలాజీరావునాయక్ పాల్గొన్నారు.

మళ్లీ మహాలడ్డూల విక్రయాలకు ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి) ఉచితంగా 300 గ్రాముల లడ్డూలను అందిస్తున్నారు. కొత్త ప్రణాళిక ప్రకారం మళ్లీ కల్యాణ లడ్డూలను విక్రయించాలని నిర్ణయించారు. వీటి ధరలను రూ.100 చేయడంతో పాటు బరువును 500 గ్రాములు చేశారు. 80 గ్రాముల లడ్డూ ధర ప్రస్తుతం రూ.15 ఉండగా దీన్ని 100 గ్రాములకు పెంచి రూ.20కి విక్రయించాలని నిర్ణయించారు. ఈవో 100 రోజుల పాలనలో ఇప్పటికే రెండుసార్లు ప్రసాదాల విక్రయాలలో మార్పులు తీసుకురావడం విశేషం. నష్టాలను తగ్గించేందుకు ఇలా చేస్తున్నట్లు ఆలయ వర్గాలు చెబుతున్నప్పటికీ ఇది వ్యాపార సంస్థ కాదన్నది గుర్తించాల్సి ఉంది. 400 గ్రాముల లడ్డూని రెండున్నర నెల కిందట రూ.50కి విక్రయించగా ఇప్పుడు మరో 100 గ్రాముల పెంచి అదనంగా రూ.50 ధర పెంచడం ఎంతవరకు భక్తులు ఒప్పుకుంటారో వేచి చూడాల్సి ఉంది. 100 గ్రాముల లడ్డూ ధర రూ.20 చేయనున్నందున ఆ మాత్రం పెంచుతారా? లేక అధికారులు అనుకున్నట్లే చేస్తారా? అన్నది తేలాల్సి ఉంది. త్వరలో లడ్డూ ప్రసాదాల తయారీకి సంబంధించిన టెండర్లను కూడా తెరవనున్నారు.

హరితహారానికి సహకారం

భారీ ఎత్తున మొక్కలు నాటిన డీసీసీబీ పాల్గొన్న వందలాది మంది బ్యాంకు ఉద్యోగులు

కూసుమంచి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో కూసుమంచిలో ఆదివారం మొక్కల పండగ ఘనంగా జరిగింది. డీసీసీబీ అధ్యక్షుడు మువ్వా విజయ్‌బాబు, జిల్లా అటవీశాఖ అధికారి సునీల్ హిరామత్, బ్యాంకు సీఈవో నాగచెన్నారావు, జిల్లాలోని అన్ని బ్రాంచీల అధికారులు, సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు, తెరాస నాయకులు కార్యక్రమంలో పాల్గొని వందల సంఖ్యలో మొక్కలు నాటారు. కూసుమంచిలోని నేలకొండపల్లి రహదారిలో కిలోమీటరు రహదారికి ఇరువైపులా మొక్కలు నాటి, వాటి సంరక్షణ చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈకార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. జిల్లాలోని సహకార బ్యాంకుల అధికారులు, 400 మందికి పైగా సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు, తెరాస నాయకులు కూసుమంచి బస్టాండ్ సెంటర్ నుంచి నేలకొండపల్లి రహదారిలో 2కిలోమీటర్ల దూరం ప్రదర్శన నిర్వహించారు. అక్కడి నుంచి మొక్కలు నాటడం ప్రారంభించారు. 20 అడుగులకు ఒక మొక్క చొప్పున వేప, బాదం, పూల మొక్కలు రహదారికి ఇరువైపులా మొక్కలు నాటి రక్షణకు గానూ జాలీలను ఏర్పాటు చేశారు. అక్కడే చెట్ల కింద మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో కేంద్ర సహకార బ్యాంకు జీఎం వసంతరావు, ఏజీఎంలు ఆంజనేయరెడ్డి, సర్వేశ్వరరావు, డీజీఎంలు వేణుగోపాలరావు, పద్మావతి, ఉదయశ్రీ, కూసుమంచి శాఖ మేనేజర్ జి.కవితతోపాటు జిల్లాలోని అన్ని శాఖల మేనేజర్లు, సూపర్‌వైజర్లు, క్యాషియర్లు, సిబ్బంది పాల్గొన్నారు. వీరితోపాటు అటవీశాఖ ఎఫ్‌డీవో ప్రకాశరావు, ఎఫ్‌ఆర్‌వో మంజుల, ఆర్ అండ్‌బీ డీఈఈ యుగంధర్, ఏఈ శ్రీనివాస్, కూసుమంచి, నేలకొండపల్లి మండల పరిషత్తు అధ్యక్షులు రామసహాయం వెంకటరెడ్డి, నందిగామ కవితారాణి, జిల్లా పరిషత్తు సభ్యుడు వడ్డియా రాంచంద్రు నాయక్, ఆత్మాకమిటీ అధ్యక్షుడు మద్ది మల్లారెడ్డి, సీడీసీ అధ్యక్షుడు జూకూరి గోపాలరావుపార్టీ జిల్లా నాయకులు నల్లమల వెంకటేశ్వర్లు, వీరవెల్లి నాగేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి, ఆసిఫ్‌పాషా, బెల్లం వేణు, రవికుమార్, సీతారాములు, నెల్లూరి భద్రయ్య, రామ్మూర్తి నాయక్, సైదిరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.



రహదారి పక్కన మొక్కలు నాటి రక్షణ ఏర్పాట్లు చేస్తూ..



కూసుమంచిలో మొక్క నాటుతున్న డీసీసీబీ అధ్యక్షుడు మువ్వా విజయ్‌బాబు, అధికారులు, బ్యాంకు సిబ్బంది

సంరక్షణ బాధ్యత తీసుకుంటున్నాం

మువ్వా విజయ్‌బాబు

మొక్కలు నాటి వదిలేయకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా డీసీసీబీ తీసుకుంటుందని అధ్యక్షుడు మువ్వా విజయ్‌బాబు అన్నారు. అడవులు అంతరించి వాతావరణ సమతుల్యత దెబ్బతినడం, మానవ మనుగడ ప్రమాదకర పరిస్థితుల్లోకి చేరుతున్న నేపథ్యంలో ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. ఈక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనల మేరకు కూసుమంచి నుంచి మూడు కిలోమీటర్ల మేరకు డీసీసీబీ దత్తత తీసుకొని మొక్కలు నాటాలని సంకల్పించిందన్నారు.

పునాదులకే పరిమితం

(మొదటి పేజీ తరువాయి) కేంద్రం నుంచి నీతి ఆయోగ్ కింద రూ.3.24 కోట్లు, ఎకో టూరిజం కింద రాష్ట్రం తరపున రూ.7.53 కోట్లు మంజూరు చేశారు. అద్దాలమేడ పునరుద్ధరణకు రూ.89.30 లక్షలు, తొమ్మిది కాటేజీలకు రూ.2.17 కోట్లు, ఫుడ్ కోర్టు నిర్మాణానికి రూ.60 లక్షలు వెచ్చించారు. ఈ పనుల్ని దక్కించుకున్న గుత్తేదారు పనులు వేగిరం చేయట్లేదు. టీఎస్‌టీడీసీ ఎండీ టెర్మినేట్ చేస్తామని హెచ్చరించినప్పటికీ భారీగా కూలీల్ని తెప్పించి పనుల్ని చేయించట్లేదు. తొమ్మిది కాటేజీలు పనులు పునాదుల్లోనే ఉన్నాయి. ఫుడ్ కోర్టు మాత్రం పునాదుల్ని దాటి ప్లింత్ బీమ్ వరకు వచ్చాయి. అద్దాలమేడ పుట్టింగ్స్ కడుతున్నారు. పాత నిర్మాణాల్ని కూల్చివేయడానికే సుమారు నెలన్నర సమయం తీసుకోవడం గమనార్హం. గుత్తేదారులు పనుల్ని తాత్సారం చేస్తున్నప్పటికీ ఏదో సాకులు చూపి తప్పించుకుంటున్నారు. డ్రాయింగ్‌లు ఆలస్యం జరిగిందని టీఎస్‌టీడీసీ ఎండీ క్రిష్టినా దగ్గర తప్పించుకున్నారు. ఇటీవల జిల్లా పాలనాధికారి రాజీవ్‌గాంధీ అక్కడికి వెళ్తే.. వర్షాలొస్తున్నాయని, కూలీలు దొరకడంలేదని సాకులు చూపిస్తున్నారు. కిన్నెరసాని అభివృద్ధికి నిధులొచ్చినప్పటి నుంచే పర్యాటకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పర్యవేక్షణాధికారులు స్పందించి త్వరితగతిన పనుల్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.




గుంతలకే పరిమితమైన కాటేజీ పనులు

ఈఈసీ కేంద్రమే దిక్కు..

ఇక్కడికి వచ్చిన వీవీఐపీలు, వీవీఐపీలకు చూడడానికి అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈఈసీ(పర్యావరణ విద్యా కేంద్రం) దిక్కవుతుంది. ఎవరొచ్చినా అందులో ఉన్న జంతువుల విగ్రహాల్ని చూసి తన్మయత్వం చెందుతున్నారు. వీటితోపాటు అద్దాలమేడ, కాటేజీలు త్వరితగతిన నిర్మిస్తే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగి ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఇప్పటికే బోటులతో భారీగా ఆదాయం వస్తుంది. పాంటన్ బోట్, స్పీడ్ బోట్‌లతో ఇప్పటికే సుమారు రూ.30 లక్షలు ఆదాయం వచ్చాయి. దీనికితోడు జెట్టి పాయింట్(పార్టీల బోట్) ఏర్పాటు చేస్తున్నారు. మున్ముందు భారీగా ఆదాయం సమకూరనుంది. అటవీశాఖాధికారులు సైతం భారీగా నిధులు ఖర్చు చేస్తున్నారు. నెమళ్ల క్రేజ్, లాన్ ఏర్పాటు చేశారు. పిల్లల కోసం మినీ పార్కును ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి అభివృద్ధి పనులు త్వరితగతిన చేయించాలని పర్యాటకులు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



వెన్‌కాబ్ (కిలో 1కి రూ.ల్లో)

బ్రాయిలర్ ఫారం ధర	88
రిటైల్ ధర	103
చికెన్ విత్ స్కిన్	144
చికెన్ స్కిన్‌లెస్	170

సమస్యలతో కునారిల్లేదే సర్కారు బడి.. అనే నానుడిని పటా పంచలు చేస్తూ.. ఏకంగా ఈ ఏడాది జతీయ స్థాయిలో 'స్వచ్ఛ భారత్ స్వచ్ఛ విద్యాలయ్' పురస్కారాలను దక్కించుకున్నాయి జిల్లాకు చెందిన 4 పాఠశాలలు. అవన్నీ మారుమూల ప్రాంతాల్లో పేద పిల్లలకు చదువుతో పాటు.. పరిశుభ్రత పాఠాలను బోధిస్తున్నవే. అవే గండగలపాడు ప్రాథమికోన్నత పాఠశాల, కారేపల్లిలోని ఆదర్శ పాఠశాల, మల్లవరంలోని ప్రభుత్వ పాఠశాల, సింగరాయ పాలెంలోని సాంఘిక సంక్షేమ పాఠశాల. నిర్వహణలో, పరిశుభ్రలో మేటి అనిపించుకుని నేటి ప్రభుత్వ పాఠశాలలకు స్ఫూర్తిగా నిలిచాయి.

స్వచ్ఛమేవ జయతే..

'స్వచ్ఛ భారత్-స్వచ్ఛ విద్యాలయ్' పురస్కారాలకు నాలుగు పాఠశాలల ఎంపిక

ఉపాధ్యాయులు, విద్యార్థుల సమష్టి కృషితో జిల్లాకు ఖ్యాతి

కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ 'స్వచ్ఛ భారత్ స్వచ్ఛ విద్యాలయ్' పురస్కారాలను ఏటా ప్రదానం చేస్తుంది. రూ.50 వేల నగదు ప్రోత్సాహాన్ని, ప్రశంసా పత్రాన్ని అందజేస్తుంది. 2016 సంవత్సరానికి గాను రాష్ట్రం మొత్తమ్మీద 14 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికవగా, వీటిలో నాలుగు ఖమ్మం జిల్లావే కావడం విశేషం. పురస్కారాలను దిల్లీలో జరిగే కార్యక్రమంలో సెప్టెంబరు 1న ప్రదానం చేయనున్నారు.

వైరా, కారేపల్లి, తల్లాడ, నేలకొండపల్లి గ్రామీణం - న్యూస్‌టుడే

చిన్న గ్రామంలో.. ఆహ్లాద విద్యాలయం

గండగలపాడు ఉపాధ్యాయుల కృషి



అవగాహనతో చేతులు, పళ్లేలు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు


గండగలపాడు చిన్న గ్రామం. ఇక్కడి ప్రాథమికోన్నత పాఠశాలలో 52 మంది విద్యార్థులున్నారు. ప్రతి అంశం లోనూ వినూత్నత కొనసాగించేందుకు ఇక్కడి ఉపాధ్యాయులు ప్రయత్నిస్తుంటారు. కలిసికట్టుగా పాఠశాలను నడిపించి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారు. హెచ్ఎం వీరకుమారి, ఉపాధ్యాయులు ముదిగొండ హరి, కృష్ణవేణి, రాజ్యలక్ష్మి, రవికుమార్ కృషి ఈ కీర్తి వెనుక దాగి ఉంది.

ఇవీ ప్రత్యేకతలు.. విద్యార్థులకు శుద్ధి నీటి సౌకర్యం ఉంది. సుజలస్రవంతి పథకం నుంచి వచ్చే తాగునీటి కోసం ప్రత్యేకంగా ట్యాంకు ఏర్పాటుచేయించారు. వీటి కోసం ప్రత్యేకంగా పంపు(ట్యాప్) ఏర్పాటు చేశారు.

ఆవరణలో ప్రత్యేకంగా బోరు ఉంది. వీటిద్వారా మరుగుదొడ్లు, ఇతర అవసరాలకు ఉపయోగపడేలా మరో ట్యాంకు ఏర్పాటు చేయించారు. ఈ ట్యాంకునుంచి నీరు వాడే విధంగా పంపులు ఏర్పాటు చేయించారు. తాగు నీరు, వాడుక నీరు కోసం మొత్తం 12 ట్యాపులున్నాయి. మరుగుదొడ్ల నిర్వహణ బాగుంటుంది.

చేతులు కడిగేందుకు సబ్బు వాడటంపై విద్యార్థులకు ఉపాధ్యాయులు చక్కని శిక్షణ ఇచ్చారు. పంపుల వద్ద ఎల్లప్పుడూ సబ్బులుంటాయి. వ్యక్తిగత శుభ్రత ఇక్కడ నిత్యపాఠంగా మారింది.

పాఠశాల ఆవరణ పరిశుభ్రతకు దర్పణంగా నిలుస్తుంది. మొక్కలు పెంచుతూ పచ్చదనంతో వెల్లివిరిసేలా చేశారు. వీటికి నీటి సంరక్షణ చర్యలూ చేపట్టారు. ఇంటి ఆవరణ మాదిరిగా పాఠశాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎన్నదగినది.



విజ్ఞాన వేదికలుగా పాఠశాల గోడలు

పరిశుభ్రతకు ప్రత్యేక బృందాలు

స్వచ్ఛతలో సాటిలేని 'కారేపల్లి ఆదర్శ పాఠశాల'



కారేపల్లిలోని ఆదర్శ పాఠశాలను 2013 సంవత్సరం నుంచి మండల కేంద్రంలో ప్రారంభించారు. 6 తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. 'పాఠశాల బాగుంటే.. విద్యార్థులూ బాగుంటారనే' నినాదంతో పాఠశాలను ముందుకు నడిపించారు. నేడు ఈ పాఠశాల జాతీయ స్థాయిలో 2016 సంవత్సరానికి 'స్వచ్ఛ పురస్కారానికి' ఎంపిక కావడం విశేషం.

ఇక్కడి విద్యార్థుల సంఖ్య 750 మంది. 25 మంది ఉపాధ్యాయులు, ఐదుగురు బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. పాఠశాల ప్రారంభం గంట ముందు నుంచే ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టిసారిస్తారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక కమిటీని నియమించారు. శుభ్రత, తాగునీరు, మధ్యాహ్న భోజనం పనులకు సంబంధించి రోజుకు ముగ్గురు ఉపాధ్యాయుల చొప్పున కమిటీ తరపున బాధ్యతలు నిర్వహిస్తారు. వారికి విద్యార్థులు కొందరు పర్యవేక్షణకు సహకరిస్తారు. పది ఫలితాలలో 10 గ్రేడు పాయింట్లు సాధించిన ఘనత ఉండగా.. ఇప్పటివరకు ఐదుగురు విద్యార్థులు ఐఐటీ బాసరలో సీట్లు సాధించి విద్యనభ్యసిస్తున్నారు.

"విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషితో అవార్డుల ఘనతను సాధించాం. జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయస్థాయి పురస్కారాలు అందుకోవటం సంతోషించ దగ్గ విషయం. రానున్న రోజులలో పాఠశాలను చదువుతో పాటుగా స్వచ్ఛతను అభివృద్ధి చేయటంలో అవార్డులు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చాయి."

- ఎండీ.అక్తర్, ప్రధానోపాధ్యాయుడు



'ఈనాడు,ఈటీవీ' 'వనభారతి' ఆధ్వర్యంలో మొక్కలు నాటుతూ..

ఆదర్శం

స్వచ్ఛత చిరునామా.. మల్ల'వరం'

తల్లాడ మండలం మల్లవరం ప్రభుత్వ పాఠశాల స్వచ్ఛ విద్యాలయం పురస్కారానికి ఎంపికకావడంలో సమష్టి కృషిదాగి ఉంది. ప్రధానోపాధ్యాయురాలు కోటగిరి రాధ, దత్తత స్వీకర్త దుగ్గిదేవర శ్రీరఘునందన్ సహకారం, దాసరి వీరభద్రరావు యూత్‌క్లబ్, గ్రామస్థుల కృషి ఫలితంగా ఈ పురస్కారం వరించింది. మల్లవరానికి చెందిన దాసరి వీరభద్రరావు యూత్‌క్లబ్ సభ్యులు ప్రాథమిక పాఠశాలను స్వచ్ఛ పాఠశాలగా తీర్చిదిద్దాలనే నిర్ణయానికి వచ్చారు. బాలబాలికలకు వేర్వేరుగా మూత్రశాలలు ఏర్పాటు, ఇంకుడు గుంతల నిర్మాణం, మినీకంపోస్టు డంపింగ్‌యార్డు, పరిశుభ్రమైన తాగునీటి సౌకర్యం కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ తరగతుల్లో విద్యార్థులకు సూచనలు చేశారు. ప్రతీ గదికి చెత్తకుండీలు ఏర్పాటు చేశారు. హెచ్ఎం కోటగిరి రాధ స్వచ్ఛత కోసం సహచర ఉపాధ్యాయులతో కలిసి నిరంతరం శ్రమిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచేలా నిత్యం విద్యార్థులతో కలిసి పర్యవేక్షిస్తున్నారు. పాఠశాల దత్తత స్వీకర్త దుగ్గిదేవర శ్రీరఘునందన్ పాఠశాలలో మూత్రశాలలు పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన ఫినాయిల్, చేతులు శుభ్రంగా ఉంచేందుకు అవసరమైన సబ్బులు, చెత్త కుండీలు, వాటర్‌ఫిల్టర్లు సమకూర్చడంతో పాటు మొక్కల సంరక్షణకు తోడ్పాటు అందించారు. సర్పంచి మేడి సీతారాములు సహకారం కూడా మరువలేనిది.





వరుసగా చేతులను శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు, పైన పాఠశాల గది

"మల్లవరం ప్రాథమిక పాఠశాల జాతీయస్థాయి స్వచ్ఛ పురస్కారానికి ఎంపికవడం సంతోషకరం. సమష్టి కృషితో ఈ పాఠశాల జాతీయస్థాయి స్వచ్ఛ పురస్కారానికి ఎంపికైనందుకు అభినందనలు. స్వచ్ఛపాఠశాల సాధనలో మిగతా పాఠశాలలు మల్లవరం పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలి."

- ఎన్.దామోదరప్రసాద్, ఎంఈవో

అద్భుత విద్యా సౌధం.. సింగరాయపాలెం 'గురుకులం'

ఆహ్లాద వాతావరణం.. అద్భుత సౌకర్యాలు.. వెరసి నేలకొండపల్లి మండలం సింగరాయపాలెంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల. ఇక్కడ 480 మంది చదువుకుంటున్నారు. ప్రధానాచార్యులు సహా 28 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు.

ఎన్నెన్నో ప్రత్యేకతలు: హరితహారంలో భాగంగా 1000 మొక్కలు నాటగా 850 మానులై ఆహ్లాదాన్ని పంచుతుండటం విశేషం. ఇటీవల ఇదే కార్యక్రమం కోసం ఇక్కడకు వచ్చిన ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాఠశాల నిర్వహణను చూసి ముచ్చటపడ్డారు. ప్రధానాచార్యురాలు పల్లె విశ్వరాణి, సిబ్బందిని, విద్యార్థినులను అభినందించారు.

ఆటలు, వేసవి సెలవుల్లో ఆంగ్ల శిక్షణ ఇక్కడి ప్రత్యేకత. ప్రతినెలా మొదటి, మూడో శనివారాలు క్యాంపస్ క్లీనింగ్ ప్రోగ్రాం (సీసీపీ) చేపట్టి పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుతారు. గతేడాది నవంబరులో వ్యర్థాలతో ఎలక్ట్రికల్ పరికరాన్ని తయారు చేసినందుకు గాను గుజరాత్ ప్రభుత్వం 'డిజైన్ ఫర్ చేంజ్' అవార్డును అందజేసింది.

మార్చిలో పాఠశాలను సందర్శించిన గురుకులాల కార్యదర్శి ప్రవీణ్‌కుమార్.. ఇక్కడ విద్యార్థినుల ఆంగ్ల భాషా ప్రావీణ్యాన్ని పరీక్షించి శెభాష్ అన్నారు. ఇందుకు కృషిచేసిన మాజీ సైనికోద్యోగి అరుణ్ కుమార్‌ను ఆయన శాలువాతో సన్మానించారు.



ఆహ్లాద వాతావరణంలో గురుకుల భవన సముదాయం



హరితహారంలో భాగంగా మొక్కలు నాటుతున్న బాలికలు

వసతి గృహం, విశాల భోజన శాల, ఆధునిక తరగతి గదుల సముదాయాన్ని చూస్తే ఆశ్చర్యపోవడం ఖాయం. అన్నింటికి మించి క్రీడా వసతులు, ఆహ్లాదం ఈ పాఠశాల ప్రత్యేకతగా నిలుస్తున్నాయి.

డీఎస్సీలో డ్రాయింగ్ పోస్టులను భర్తీచేయాలి

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 1192 డ్రాయింగ్, క్రాఫ్ట్ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని ఆర్ట్ లెక్చరర్ భిక్షపతి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎండీ.జలాల్ ప్రభుత్వాన్ని కోరారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం మంచికంటి భవన్‌లో ఏర్పాటైన జిల్లా సదస్సులో వారు మాట్లాడారు. ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల్లో 43 డ్రాయింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ఎస్సీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో ఉన్న 933 పోస్టులను టీఎస్‌పీఎస్సీ ద్వారా, ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణం భర్తీ చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వీటి ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ చేస్తున్న ఆశాజనక ప్రకటనలకు నిరుద్యోగ యువత బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల భర్తీలో యువతను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డి.వెంకన్న, విజయ్, లక్ష్మి, అర్జున్, సాయికిరణ్, రాంబాబు, రూప్లా తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబరు 1న సామూహిక సెలవులు

భద్రాచలం, న్యూస్‌టుడే: కంట్రిబ్యూటరీ పింఛను విధానం రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.వెంకటేశ్వరరావు, బి.రవి, మండల అధ్యక్షులు కారంపూడి దశమ్‌బాబు కోరారు. స్థానిక సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ పథకంలో ఉన్న ఉపాధ్యాయులు సెప్టెంబరు 1న సామూహిక సెలవులు పెట్టనున్నారని తెలిపారు. ఆ ఉపాధ్యాయులు చేస్తున్న నిరసనకు తమ సంఘం తరపున సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. 2004 సెప్టెంబరు 1 నుంచి అమల్లోకి వచ్చిన సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణలు అందించినప్పటికీ దీనికి సంబంధించిన శిక్షణ భృతి చెల్లించకపోవడం దారుణమన్నారు. ఈ భృతిని వెంటనే చెల్లించాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖలోని సూపర్ న్యూమరీ ఉపాధ్యాయులను ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశమైన తర్వాత ఐటీడీఏలోని ఏటీవో రమణయ్యను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర అసోసియేట్ నాయకులు ఉస్మాన్‌అలీ, హరిసింగ్ రాథోడ్, నాగరాజు, నర్సయ్య, రమణ పాల్గొన్నారు.



ఏటీవో రమణయ్యను కలిసిన పీఆర్టీయూ నాయకులు

భద్రాచలం

కూరగాయల ధరలు (కిలో రూ॥ల్లో)

భద్రాచలం: ఉల్లిపాయలు 15, టమాట 60, అల్లం 60, బెండకాయలు 40, దొండకాయలు 30, పచ్చి మిరప 80, బంగాళదుంపలు 20, వంకాయలు 40, క్యారెట్ 80, క్యాబేజీ 30, మునగకాయ మూడు 10, చింతపండు 100, చేమ దుంపలు 40, ఆనప 15, కాకర 40.

మట్టి ప్రతిమలు పంపిణీ

చర్ల, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్ర తీ ఒక్కరూ కృషి చేయాలని తెరాస మండల అధ్యక్షుడు పరుచూరి రవి కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక తెరాస కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23, 24 తేదీల్లో మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తామని వెల్లడించారు.

రోడ్డు శిథిలమై ప్రమాదకరంగా...



ఎస్‌ఆర్‌ఎన్ కాలనీలో రోడ్డు శిథిలమైందిలా

ఎస్‌ఆర్‌ఎన్ కాలనీ, భగవాన్‌దాస్ కాలనీ (భద్రాచలం పట్టణం), న్యూస్‌టుడే

మాది ఎస్సారెన్ కాలనీ. మా కాలనీలో రోడ్డు శిథిలమై ప్రమాదకరంగా మారింది. అటువైపు నుంచి పెద్ద వాహనాలు వెళ్లే దారి లేకుండా మారింది. రాత్రి పూట ద్విచక్ర వాహనదారులు గోతిలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. దయచేసి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నాం.

- పంపిన వారు: చైతన్య, ఎస్‌ఆర్‌ఎన్‌కాలనీ

తాగు నీటి లీకేజీలు ఆగేదెన్నడు?

మాది పట్టణంలోని భగవాన్‌దాస్‌కాలనీ. మా కాలనీలో ప్రధాన రహదారికి వెళ్లే రోడ్డులో చాలాకాలం నుంచి తాగునీరు లీకై మడుగు లాగా నిలిచి ఉంటున్నాయి. ప్రతీరోజు ఇదే పరిస్థితి. దయచేసి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నాం.

- పంపిన వారు: రవి, భగవాన్‌దాస్‌కాలనీ

వివరణ: చాలాకాలంగా సమస్యాత్మకంగా ఉన్న మురుగు కాలువల పూడికలు పెద్ద ఎత్తున తీయిస్తున్నాం. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అనేక రకాలుగా చెత్తసేకరణ, చిన్నచిన్న మరమ్మతులు చేయిస్తున్నాం. మురుగు నీటి సమస్యను వెంటనే తీరుస్తాం.

– భూక్యా శ్వేత, సర్పంచి, భద్రాచలం



భగవాన్‌దాస్‌కాలనీలో రోడ్డుపై లీకవుతున్న నీరు

సమస్యలు పంపాల్సిన వాట్సప్ నంబర్లు

భద్రాచలం పట్టణం:	96406 32894
వాజేడు:	80085 73708
వెంకటాపురం:	80086 24242
దుమ్ముగూడెం:	80085 73706
చర్ల:	95421 23225

ప్రతిపాదనలకే పరిమితమా?

నేటికీ నోచుకోని వాగులపై వంతెనలు అవస్థలు పడుతున్న గిరిజన గ్రామాల ప్రజలు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నట్లు చెబుతోంది. ప్రభుత్వ ప్రకటనలు చూసిన ప్రజలు తమ గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆశతో ఎదురుచూస్తుంటారు. చివరికి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంతో ఆయా గ్రామాల్లో సమస్యలు మాత్రం ఏళ్లు గడుస్తున్నా అలాగే దర్శనమిస్తున్నాయి. దుమ్ముగూడెం మండలంలో వర్షాకాలం వస్తే అనేక గ్రామాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఆయా కుగ్రామాల ప్రజలు రాకపోకలకు ఎన్నో అవాంతరాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. వాగులు, వంకలపై వంతెనల నిర్మాణాలు లేక ఆయా గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. గౌరవరం-కట్టు కాలువ గ్రామాల మధ్య చినగుబ్బలమంగి వాగు, సింగవరం-ఎన్.లక్ష్మీపురం గ్రామాల మధ్య పెద్దవాగు, వైట్‌నాగారం గ్రామ శివారులో ఉన్న పెద్దవాగు, ఎన్.లక్ష్మీపురం గ్రామ శివారులో ఉన్న అల్లి వాగు, చింతగుప్ప-సుజ్ఞానపురం గ్రామాల మధ్య ఉన్న వాగు వర్షాకాలం వస్తే పొంగిపొర్లుతున్నాయి. ఈ వాగులపై వంతెనలు నిర్మించాలని ఏళ్లుగా ప్రతిపాదనలు ఉన్నా నేటికీ అవి అమలుకు మాత్రం నోచుకోవడం లేదు.

బాహ్య ప్రపంచంతో సంబంధాలు కష్టమే

వర్షాకాలం వస్తే అనేక గిరిజన గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం కొనసాగిస్తున్నారు. గౌరవరం-కట్టు కాలువ గిరిజన గ్రామాల మధ్య ఉన్న చినగుబ్బలమంగి వాగు ప్రతీ ఏడాది వర్షాలకు ఉప్పొంగుతుంది. దీంతో కొద్ది రోజుల పాటు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ వాగుల మీదుగానే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి నిత్యం రాకపోకలు జరుగుతుంటాయి. చినగుబ్బలమంగి వాగు పొంగడంతో పైడాకుల మడుగు, కట్టుకాలువ, పైదిగూడెం, చిననల్లబెల్లి, గౌరవరం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. సింగవరం-ఎన్.లక్ష్మీపురం మధ్య పెద్దవాగు కారణంగా సింగవరం, వైట్‌నాగారం, గంగవరం, పౌలూరిపేట, బండారిగూడెం తదితర గ్రామాల ప్రజలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. వైట్‌నాగారం వద్ద పెద్దవాగులో అధికంగా నీరు చేరితే గ్రామ పరిసరాలు మొత్తం నీటిమయమవుతాయి. విద్యుత్తు సరఫరా సైతం నిలిచిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. చింతగుప్ప-సుజ్ఞానపురం గ్రామాల మధ్య వాగు పొంగితే జిన్నెలగూడెం, చిననల్లబెల్లి, సుజ్ఞానపురం, చింతగుప్ప గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎన్.లక్ష్మీపురం గ్రామశివారులో ఉన్న అల్లి వాగు పొంగితే గంగవరం, సింగవరం, పౌలూరిపేట, ఆర్లగూడెం, తూరుబాక, బండారిగూడెం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ విధంగా వాగులు, వంకలు కారణంగా ప్రజాజీవనానికి తీవ్ర ఆటంకం కలుగుతుంది. గిరిజన గ్రామాల ప్రజలు వాగులపై వంతెనలు నిర్మించాలని పలు మార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించి మొరపెట్టుకున్నా బుట్టదాఖలే అవుతున్నాయి తప్ప అమలుకు మాత్రం నోచుకోవడం లేదు.



ఎన్.లక్ష్మీపురం-సింగవరం గ్రామాల మధ్య పెద్దవాగు



గౌరవరం వద్ద పొంగిన చినగుబ్బలమంగి వాగు

ప్రాణాలకు తెగించి ప్రయాణం

వాగులు పొంగిన సమయంలో దాదాపు గిరిజన గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగి అంధకారంలో ఉంటాయి. గ్రామాల్లో నుంచి బయటకు రావడానికి ప్రజలకు అవకాశం లేక కనీసం నిత్యావసర సరకులు కొనుగోలు చేయడానికి కూడా వీలు కుదరని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రమాదవశాత్తు ఏదైనా ఆపద వచ్చినా, తీవ్ర అనారోగ్యానికి గురైనా వైద్యం అందక ఇళ్లలోనే ప్రాణాలు కోల్పోవాల్సిన విషమ పరిస్థితి తలెత్తుతుంది. ఒక్కొక్కసారి అత్యవసరమైతే ప్రాణాలకు తెగించి వాగుల్లో ఈత కొడుతూ వాగులు దాటుతూ ప్రాణాలతో బయటపడుతున్నారు. గత కొద్దిరోజుల క్రితం కురిసిన వర్షాలకు గౌరవరం వాగు పొంగింది. ఆ సమయంలో ఓ గర్భిణికి పురిటినొప్పులు రావడంతో గౌరవరం చినగుబ్బలమంగి వాగులో ఉన్న చెట్లుకు పెద్దపెద్ద తాళ్ళు కట్టి వాగు దాటించాల్సిన పరిస్థితి వచ్చింది. ఇలాంటి విపత్కర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పాలకులు, అధికారులు ఇకనైనా స్పందించి గిరిజన గ్రామాల వాగులపై వంతెనలు నిర్మించాల్సిన అవసరాన్ని గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎంపీ సీతారాంనాయక్ జన్మదిన వేడుకలు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్ పుట్టిన రోజు వేడుకలను భద్రాచలంలోని తెరాస కార్యాలయంలో ఆదివారం తెరాస నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచారు. డివిజన్ ఇన్‌ఛార్జి మానె రామకృష్ణ, సీనియర్ నాయకులు సిద్దులు, నాయకులు శేషం భాస్కర్, చింతాడి చిట్టిబాబు, సర్పంచి శ్వేత, మహిళా విభాగం నాయకురాలు సీతామహలక్ష్మి, మామిడి పుల్లారావు, రామానుజాచార్యులు, తెరాస కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటాపురం, న్యూస్‌టుడే: ఎంపీ సీతారాంనాయక్ జన్మదిన వేడుకలను ఆదివారం వెంకటాపురం విద్యుత్తు ఉప కార్యాలయం సమీపంలో నిర్వహించారు. తెరాస సీనియర్ నాయకులు చిడెం రవికుమార్ ఎంపీ మాస్క్‌ను ధరించి కేక్‌ను కట్ చేశారు. ఎంపీపీ ఎట్టి ఝాన్సీలక్ష్మీబాయి, సర్పంచి జజ్జరి నారాయణమ్మల, మండల అధ్యక్షుడు అధ్యక్షుడు వి.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు ముత్తయ్య, కృష్ణమూర్తి, మురళి, వెంకట్రావ్, రామకృష్ణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

వాజేడు, న్యూస్‌టుడే: ఎంపీ జన్మదిన వేడుకలను తెరాస ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు. తెరాస మండలశాఖ అధ్యక్షుడు విక్రాంత్ ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు. తెరాస మండలశాఖ ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మండలపరిషత్ ఉపాధ్యక్షురాలు చెన్నంరాంబాయి, ఎల్లయ్య, నానిబాబు, సరబాబు, సాంబశివరావు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలం: వేడుకల్లో మాట్లాడుతున్న తెరాస నాయకులు

రైతుల మేలు కోరితే రాద్ధాంతమా?

వెంకటాపురం, న్యూస్‌టుడే: సన్న, చిన్నకారు రైతుల మేలు కోరి ఆందోళన చేపడితే అన్నదాతల మధ్య చిచ్చుపెడుతూ రాద్ధాంతం చేయడం సరైంది కాదని వివిధ పార్టీల నాయకులు పేర్కొన్నారు. బహుళ జాతి ఒప్పంద మిరప సాగును కేటాయించాలంటూ సీపీఎం, సీపీఐ, కాంగ్రెసు, తెదేపా, భాజపాల మండల కమిటీ ఆధ్వర్యంలో వెంకటాపురంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడోరోజుకు చేరుకున్నాయి. ఆదివారం దీక్షల శిబిరం వద్ద ఏర్పాటు చేసిన విలేకరర్ల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కుమ్మరి శ్రీను, తెదేపా మండల కన్వీనర్ పుల్లగుమ్మి జగన్మోహన్‌రావు, కాంగ్రెసు నాయకులు చిడెం సాంబశివరావు మాట్లాడారు. శాంతియుతంగా చేపట్టిన నిరసన దీక్షలను భగ్నం చేసేలా కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయన్నారు. మూడోరోజు దీక్షల శిబిరాన్ని వాజేడు మండలం ధర్మారానికి చెందిన రైతులు సందర్శించి సంఘీభావం తెలిపారు. వివిధ పార్టీల నాయకులు చిడెం మోహన్‌రావు, హామీద్, ఆదినారాయణ, కన్వీనర్ వంకా రాములు, పలు గ్రామాలకు చెందిన రైతులు దీక్షలో కూర్చున్నారు.



రిలే నిరాహార దీక్షల శిబిరంలో వివిధ పార్టీల నాయకులు, రైతులు

కార్మికుల సహకార సంఘాల ఎన్నికలు

భద్రాచలం అంబేడ్కర్ సెంటర్, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టరు ఉత్తర్వుల మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్మికులను అందించే (సప్లయ్) లేబర్ సహకార సంఘాల ఎన్నికలు జరుగుతాయని సహకార శాఖ అధికారి కె.సోమయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం నమోదు సంఘలైన ఆదిలక్ష్మి వడ్డెర లేబర్ కాంట్రాక్టు సహకార సంఘం, భద్రాచలం. సీతారామా బీడీ లీవ్ కలెక్షన్ లేబర్ కాంట్రాక్టు సహకార సంఘం, ఆర్లగూడెం రెండు సంఘాలకు ఈ నెల 22న ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. కనకదుర్గ హరిజన లేబర్ కాంట్రాక్టు సహకార సంఘం భూపతిరావుకాలనీ భద్రాచలం, కల్యాణి వడ్డెర సహకార సంఘం భద్రాచలం సంఘ సభ్యులకు ఈనెల 23న ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు స్థానిక అధికారులను సంప్రదించాల్సిందిగా కోరారు.

భద్రాచలం

చౌక దుకాణాల్లో నిత్యావసరాలు అందించండి

భద్రాచలం అంబేడ్కర్ సెంటర్, న్యూస్‌టుడే: చౌక దుకాణాల్లో నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యవసరాలు పూర్తిస్థాయిలో అందించాలని భద్రాద్రి డివిజన్ ప్రజా పరిరక్షణ హక్కుల సమితి ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక పాత మార్కెట్‌లో సంఘం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న సంఘం అధ్యక్షుడు నాగబాబు, ప్రధాన కార్యదర్శి పిలకా రాము మాట్లాడుతూ.. తెరాస ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలు గడిచిందని నిరుపేదలకు ఎటువంటి మేలు జరగలేదన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు పూర్తిగా నిర్లక్ష్యం చేసి నిరుపేదలను ఆందోళనలో పడేశారన్నారు. నిత్యావసర వస్తు ధరలు ఆకాశాన్ని చేరాయని అన్నారు. శివాజీ, కృష్ణ, శ్రీను, శ్రీకాంత్, రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా అభివృద్ధికి కృషి చేయాలి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధి లక్ష్మీనగరం, వర్క్‌షాపు, దుమ్ముగూడెం, గంగోలు గ్రామాల్లో ఆదివారం భాజపా నాయకులు పర్యటించారు. నియోజకవర్గ బాధ్యుడు పారేపల్లి హరీష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో భాజపా పటిష్టతపై దృష్టి సారించామని అన్ని గ్రామాల్లో పార్టీ నాయకులను, కార్యకర్తలను కల్పుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో భద్రాచలం నియోజకవర్గంలో భాజపా అభ్యర్థి ఎమ్మెల్యేగా విజయం ఖాయమని అన్నారు. భాజపా మండలశాఖ అధ్యక్షుడు జెట్టి వెంకటరాజు, నాయకులు ప్రసాద్, నర్సింహారావు, ప్రభాకర్, రామస్వామి, గోవింద్, రాము పాల్గొన్నారు

తగ్గుతున్న తాలిపేరు.. పొంగుతున్న వాగులు

చర్ల, న్యూస్‌టుడే: చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టులో వరద ఉద్ధృతి కాసింత తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టులో ఆదివారం 8 గేట్లు ఎత్తి ఉంచి 21 వేల క్యూసెక్కులకు పైగా వరద నీటిని దిగువ గోదావరికి విడుదల చేస్తున్నారు. పరోపక్క పగిడివాగు ప్రవాహం సైతం తగ్గుముఖం పట్టినా పెదమిడిసిలేరు, ప్రాజెక్టు మధ్యలోని వంతెన ఇంకా నీటమునిగే ఉంది. మారుమూల చింతగుప్ప, బోదనెల్లి, పూసుగుప్ప, బత్తినపల్లి, పులిగుండాల, కొండెవాయి మధ్యలోని వాగులు పొంగిపొర్లుతున్నాయి. మండల కేంద్రానికి మారుమూల గిరిజన గ్రామాల నుంచి రాకపోకలు స్తంభించాయి. దీంతో గిరిజనులు నానా కష్టాలు పడుతున్నారు.


చర్ల: ఆదివారం సాయంత్రం వరకు నీట మునిగి ఉన్న పగిడివాగు వంతెన


వెంకటాపురం: గేట్ల ప్రాంతం నుంచి జాలువారుతున్న నీటి వరద

పాలెంవాగుకు జలశోభ

వెంకటాపురం, న్యూస్‌టుడే: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు సాగునీటి వనరులకు జలశోభ సంతరించుకుంది. మండలంలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన పాలెంవాగు మధ్యతరహా జలాశయం నీటితో తొణికిసలాడుతోంది. మూడు రోజులుగా మండలంలో, అడవుల్లో కురుస్తున్న వర్షానికి పెద్ద ఎత్తున వరద నీరు చేరింది. 1.26 టీఎంసీల పూర్తి స్థాయి జలాశయం కాగా ఆదివారం సాయంత్రానికి 0.71 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం చేరినట్లు ఏఈ వలీమహ్మద్ తెలిపారు. 40 క్యూసెక్కుల నీటిని ప్రధాన కాలువ ద్వారా సరఫరా చేస్తున్నారు. కొద్ది కాలంగా వరుణుడు ముఖం చాటేయడంలో నిరీక్షణలో ఉన్న అన్నదాతలకు అల్పపీడన ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు జలాశయాలకు జలకళ ఏర్పడంలో హర్షం వ్యక్తమవుతోంది. నిర్మాణంలో ఉన్న క్రష్‌గేట్ల ప్రాంతం నుంచి వరద నీరు గోదావరిలోకి కలుస్తోంది. వర్షం కారణంగా ఇక్కడ పనులకు సైతం అంతరాయం జరిగింది.


మొక్కలకు ఇసుప, ప్లాస్టిక్ కవచాలు ఏర్పాటు చేస్తున్న సభ్యులు

కలిసి రండీ.. మొక్కలు నాటి కాపాడుదాం

భద్రాచలం అంబేడ్కర్ సెంటర్, న్యూస్‌టుడే: భద్రాద్రిలో మొక్కలు నాటేందుకు ప్రతీ ఒక్కరూ కలిసి రావాలని గీన్ భద్రాది సభ్యులు కోరారు. ఆదివారం స్థానిక అభయాంజనేయ పార్కులో సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. వివిధ సమస్యలతో సతమతమవుతున్న నేటి సమాజంలో పీల్చే గాలి కూడా వాతావరణ కాలుష్యంతో సమస్యగా ఉందన్నారు. కనీసం భద్రాద్రి లోనైనా వాతావరణ సమతుల్యం కాపాడాలనే సంకల్పంతోనే ఈ గ్రీన్ భద్రాద్రిని పురప్రముఖుల సహకారంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇది ఏ ఒక్కరి కార్యక్రమం కాదని అందరూ కలిసి కట్టుగా చేస్తే భద్రాద్రిని పచ్చని భద్రాద్రిగా చేయవచ్చని, సుదూర ప్రాంతాలనుంచి భద్రాద్రి విచ్చేసే భక్తులకు కూడా అహ్లాదాన్ని పంచుదామని అన్నారు. నేడు దాతలు పాకాల దుర్గాప్రసాదు సాయంతో మొక్కలకు ఇనుప, ప్లాస్టిక్ ఫైబర్ కవచాలు తెప్పించామన్నారు. సమావేశంలో అధ్యక్షుడు పల్లంటి దేశప్ప, ఉపాధ్యక్షుడు హరితమిత్ర భూపతిరావు, వెంకటరెడ్డి, రాంబాబు, కడాలి నాగరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ రహదారితో ప్రజలు బేజారు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే


అధ్వానంగా తయారైన రహదారి

మండల పరిధిలోని పెదనల్లబెల్లి ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. కొద్దిరోజుల నుంచి రోడ్డు మొత్తం గుంతలు పడి దెబ్బతింది. నాలుగు సంవత్సరాల కిందట మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన పెదనల్లబెల్లి నుంచి పైదిగూడెం వరకు పోలీసులు దగ్గరుండి రూ.కోట్లు వెచ్చించి గుత్తేదారులతో రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. ఈ రహదారి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి కేవలం 3 కిమీ దూరంలో ఉంటుంది. ఇటీవల గౌరవరం, పైదిగూడెం సరిహద్దు గ్రామ ప్రాంతాల్లో సీఆర్‌సీఎఫ్ బేస్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ఈ రహదారి మీదుగా తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన అనేకమంది ఆదివాసీ గ్రామాల ప్రజలు, పోలీసు బలగాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి అనేకచోట్ల దెబ్బతిని రంధ్రాలు పడి మరమ్మతులకు గురైంది. ప్రస్తుతం ఆనవాళ్లు లేకుండా కోల్పోయే ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్


గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

భద్రాచలం అంబేడ్కర్ సెంటర్, న్యూస్‌టుడే: సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 1న పింఛను విద్రోహ దినంగా పాటించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలంలో ఆదివారం గోడ పత్రికల ఆవిష్కరించారు. స్థానిక ఐటీడీఏ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో పలువురు ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ.. సెప్టెంబరు 1న ఉపాధ్యాయులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలపాలని, జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు చేసి ధర్నా కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పింఛను భిక్ష కాదు ఉద్యోగి హక్కు అని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పింఛను వ్యవస్థను రద్దు చేయడం దారుణమన్నారు. జిల్లా కేంద్రం భద్రాద్రి కొత్తగూడెంలో రైల్వే స్టేషన్ నుంచి ర్యాలీ ఉంటుందని అందరూ తప్పక పాల్గొనాలని తెలిపారు. ఉపాధ్యాయ నాయకులు జపాన్‌రావు, బి.రాజు, ఎం.రామాచారి, మండల బాధ్యులు కె.పాపారావు, ఎ.వెంకటేశ్వర్లు, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని 21 గ్రామ పంచాయతీల్లో సాక్షర భారత్ ఆధ్వర్యంలో ఆదివారం వయోజన విద్యా కేంద్రాల్లో 15 దశ ఎన్‌ఐఓయస్ పరీక్షలు జరిగాయి. సుమారు 322 మంది అభ్యాసకులు ఎన్‌ఐఓయస్ పరీక్షలు రాశారు. నర్సాపురం పరీక్షా కేంద్రాన్ని ఎంపీడీవో ఎస్.రమాదేవి సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. వయోజన విద్యా కేంద్రాలను నిరక్షరాస్యులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సాక్షర భారత్ మండల సమన్వయకర్త పర్శిక రవికుమార్, ఎంపీటీసీ సభ్యుడు శంకర్, సర్పంచి భానుమతి, గ్రామస్థాయి సమన్వయకర్తలు కొండలరావు, శాంతకుమారి పాల్గొన్నారు.

గణపతి సుబ్రహ్మణ్యం స్వామి విగ్రహ ప్రతిష్ఠ


దుమ్ముగూడెం: స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో అర్చకులు, భక్తులు


చర్ల: గణేశ్‌నగర్లో నవరాత్రి ఉత్సవాల కోసం అంకురార్పణ చేస్తున్న సర్పంచి జ్యోతిర్మయి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని నడికుడి మహంకాళి చాముండేశ్వరి ఆలయంలో ఆదివారం శ్రీగణపతి, సుబ్రహ్మణ్యస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తి ప్రవత్తులతో ఘనంగా జరిగింది. రామకృష్ణాపురం గ్రామానికి చెందిన భక్తురాలు అనుముల పద్మ కుటుంబ సభ్యులు శ్రీగణపతి విగ్రహాన్ని, పాల్వంచ పట్టణానికి చెందిన తంగేటి సుబ్బారావు, నాగమణి దంపతులు సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాన్ని విరాళంగా సమర్పించారు. ఆలయ అర్చకులు రాఘవశర్మ బాలాజీ శర్మ స్వామివార్లకు హోమాధి క్రతువు జరిపించారు. శ్రావణ మాసం చివరి ఆదివారం పురస్కరించుకొని ఆలయం వద్ద ఉన్న రావి చెట్టు కింద గ్రామరక్షణ నిమిత్తం స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, అలంకారాలు, అష్టోత్తరాలు నిర్వహించారు. అనేకమంది భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీస్వామివార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

చర్ల, న్యూస్‌టుడే: మండలంలో గణేశ్ నవరాత్రి మహోత్సవాలకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఈనెల 25న జరగనున్న వినాయక చవితి సందర్భంగా నవరాత్రి ఉత్సవాల కోసం గణేశ్‌నగర్లోని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంకురార్పణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచి పున్నం జ్యోతిర్మయి చేతుల మీదుగా ఆదివారం ఈ అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని లింగాపురం, ముత్యాలమ్మవీధి, సాలెబజార్, సత్యనారాయణపురం, ఆర్.కొత్తగూడెం, మొగళ్లపల్లి, తదితర గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు. పల్లెల్లో విఘ్నేశ్వర ఉత్సవాల కోసం పందిళ్ల ఏర్పాట్లల్లో ఉత్సవ కమిటీలు నిమగ్నమయ్యాయి. తోటపల్లి శ్రీనివాసరావు, గోసంగి నాగేంద్ర, సాంబ, రామగిరి అరుణ్, సంపత్, పాసికంటి సంతు, ఇరసవడ్ల సతీశ్, ప్రవీణ్, శ్రావణి, కేపరి రమణ, రంగు సుశీల తదితరులు పాల్గొన్నారు.

వయోజన అభ్యాసకులకు ఎన్‌ఐవోఎస్ పరీక్ష

వెంకటాపురం, న్యూస్‌టుడే: వయోజన విద్యా కేంద్రాలకు చెందిన అభ్యాసకులకు మూడో తరగతి స్థాయి ఎన్‌ఐవోస్ పరీక్షను మండలంలో ఆదివారం నిర్వహించినట్లు ఎంసీవో దుర్గం నాగేశ్వరరావు తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధికి చెందిన ఏడుగురు అభ్యాసకులను ఎంపిక చేసి పరీక్ష రాయించినట్లు చెప్పారు. మండల కేంద్రంలోని బుడగజంగాలకాలనీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎన్‌ఐవోఎస్ పరీక్ష రాసిన అభ్యాసకులకు మూడో తరగతి తత్సమాన అర్హత కలిగిన ధ్రువపత్రాలను త్వరలోనే అందజేస్తామని పేర్కొన్నారు. 63 మంది అభ్యాసకులు ఈ పరీక్షకు హాజరైనట్లు వివరించారు. ఉన్నత విద్యా అవకాశాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధికి ఈ విద్యాఅర్హత ధ్రువపత్రాలను సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు. గ్రామ సమన్వయ కర్త మేడి జయలక్ష్మి, స్థానికులు మోటం రాజేశ్, సంఖ్యా ఆదినారాయణ పాల్గొన్నారు.

సినిమాలు

ఏషియన్ ఉదయభాస్కర్- ఫిదా
విజయభాస్కర్
నేనే రాజు నేనే మంత్రి
గోపాలకృష్ణ
జయ జానకి నాయక

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.



ఖమ్మం అర్బన్: అల్లీపురంలో బోనాలతో మహిళలు

ఘనంగా ముగిసిన శ్రావణ మాస వేడుకలు

జాతరమ్మో.. జాతర

శ్రావణమాసం చివరి ఆదివారం సందర్భంగా జిల్లాలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పలు గ్రామాల్లో గంగమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. పాయసంతో బోనం సిద్ధం చేసుకుని ఆలయాలకు తరలివచ్చారు. అమ్మవార్లను దర్శించుకుని బోనాలను సమర్పించి, చీర, జాకెట్టు, పంచలను సమర్పించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ప్రముఖ ఆలయాల్లో బోనల సందడి నెలకొంది. – న్యూస్‌టుడే, బృందం



పాల్వంచ సాంస్కృతికం: పూనకంతో ఊగుతున్న భక్తులు



మణుగూరు సాంస్కృతికం: బోనంతో చిన్నారి



ఖానాపురం హవేలీ: వరదయ్యనగర్ వైరా రోడ్డు పై కట్టమైసమ్మ గుడి వద్ద ..



కొత్తగూడెం సాంస్కృతికం: గాజులరాజం బస్తీలో పూజలు



ఖానాపురం హవేలీ: ఇందిరానగర్ ముత్యాలమ్మగుడిలో..



ఖమ్మం గ్రామీణం: ఎంవీపాలెంలో బోనాలతో మహిళలు, చిన్నారులు



ఖమ్మం సాంస్కృతికం: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



వైరా: అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు



బోనకల్లు: బండ్లపై ప్రబలు కట్టుకొని ముత్యాలమ్మ ఆలయానికి పయనం



జూలూరుపాడు: బోనాలతో మహిళల ప్రదర్శన



ఖమ్మం చర్చికాంపౌండ్ అమ్మవారి ఆలయం వద్ద...



బయ్యారంలో బోనాలతో వెళ్తున్న భక్తులు



పాల్వంచ సాంస్కృతికం: పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

మూగ రోదన..!



సిబ్బంది కొరతతో అందని పశువైద్య సేవలు

వ్యాధులతో మృత్యువాత పడుతున్న పశుగణం

చంద్రుగొండ, న్యూస్‌టుడే...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 23 మండలాల్లో పశువైద్య శాఖలో నెలకొన్న సిబ్బంది కొరతతో మూగజీవాల వైద్యం గగనమవుతోంది. వాటి మూగ రోదనను గుర్తించేవారు కరవయ్యారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన జిల్లాలతో పాటు ఆయాశాఖల్లో ఖాళీలను భర్తీ చేస్తే బాగుండేది. అయితే ఆయా శాఖల్లో ఖాళీలు ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశువైద్య శాఖలో నెలకొన్న ఖాళీలతో పశువులకు పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదు. మారుమూల గ్రామాల్లో వైద్య సేవలు అందక పలు మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి.



చంద్రుగొండలో సిబ్బంది కొరతతో నడుస్తున్న పశువైద్యశాల

జిల్లాలో పశు గణాంకాలు

తెల్ల పశువులు	2,81,235
నల్ల పశువులు	1,61,741
గొర్రెలు	1,04,288
మేకలు	2,25,171
కోళ్లు	8,40,982
పందులు, కుక్కలు	16,975

ఇదీ పరిస్థితి..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 30 పశువైద్యశాలలు, 45 ఉపకేంద్రాలు, 6 ఏడీఏ స్థాయి ఆసుపత్రులు ఉన్నాయి. ఇక్కడి ఖాళీలను పరిశీలిస్తే.. 30 మంది పశువైద్యాధికారులకు కేవలం 21 మందే ఉన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్లు 8 మందికి 8 మంది ఉన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు 23 (అన్నీ) ఖాళీగానే ఉన్నాయి. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టులు 24కు 8 ఖాళీలున్నాయి. జూనియర్ వెటర్నరీ అధికారులు 18కి ఒకటి ఖాళీ ఉంది. వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారులు (వీఎల్‌వో) 10కి 3 ఖాళీగా ఉన్నాయి. అటెండర్లు 77 మందికి 65 మందే ఉన్నారు. ఇంకా 12 ఖాళీలున్నాయి. వెటర్నరీ వ్యాక్సినేటర్ల పోస్టులు 14కు అన్నీ ఖాళీగానే ఉన్నాయి.

భర్తీచేస్తేనే..

ఈ ఖాళీలన్ని భర్తీ చేస్తే మూగజీవాలకు మెరుగైన వైద్యం అందుతుంది. వైద్యుల సలహాలు, సేవలు అందక పాడిగేదెలు, గొర్రెలు, మేకలు మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికైనా నేతలు, ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆయా ఖాళీలను భర్తీ చేసి పశుగణాభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉంది.

పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి ఏమంటున్నారంటే...

జిల్లాలోని పశువైద్యశాఖలోని ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా పశువైద్యాధికారి వేణుగోపాలరావు అన్నారు. ఇటీవల కొన్ని పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయిందని వివరించారు. ఖాళీలన్నీ భర్తీ చేస్తే పశువులకు మెరుగైన వైద్యం అందుతుందని అన్నారు.

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలంలోని గోదావరి నదిలో గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం లభ్యమైనట్లు పట్టణ ఎస్సై కరుణాకర్ తెలిపారు. ఆదివారం ఉదయం గోదావరి నది ఒడ్డుకు చేరిన వృద్ధుని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వయసు సుమారు 70 సంవత్సరాలు ఉండవచ్చని.. ఇతడిది భద్రాచలం అయి ఉండవచ్చని ఎస్సై కరుణాకర్ తెలిపారు.



వృద్ధుని మృతదేహం

భార్యపై భర్త దాడి

సుజాతనగర్: డబ్బు వివాదంలో భార్యపై భర్త దాడి చేసి గాయపరిచిన సంఘటనపై ఆదివారం సుజాతనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. చంద్రుగొండ మండలం తిప్పనపల్లికి చెందిన గజ్జిమేకల కృష్ణవేణి సుజాతనగర్‌కు చెందిన రాములు అనే వ్యక్తితో వివాహమైంది. నాలుగేళ్లక్రితం కృష్ణవేణి భర్తనుంచి విడిపోయి తిప్పనపల్లిలోని తన తల్లి ఇంట్లో నివాసముంటోంది. రాములు, కృష్ణవేణి కలిసి ఉన్న సమయంలో తిప్పనపల్లికి చెందిన జ్యోతి ఉపేందర్ అనే వ్యక్తికి రూ.30 వేలు అప్పుగా ఇచ్చారు. సదరు అప్పు వడ్డీ డబ్బు రాములు తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సుజాతనగర్ ఉన్నత పాఠశాల సమీపంలోని రాములు నివాసానికి వచ్చిన కృష్ణవేణి వడ్డీ డబ్బు తనకివ్వాలంటూ కోరింది. ఈ విషయంపై ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో ఆవేశానికి లోనైన రాములు కర్రతో భార్య తలపై దాడి చేసి గాయపరిచాడు. ఆమె బంధువులు ఆమెను హుటాహుటిన కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. బాధితురాలు భర్త రాములుపై సుజాతనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుజాతనగర్ ఎస్‌ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేటీపీఎస్ ఏడో దశలో ప్రమాదవశాత్తు కార్మికుని మృతి

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: రోలర్‌లో పడి ఓ వ్యక్తి మృతి చెందిన దుర్ఘటన ఆదివారం కేటీపీఎస్ ఏడో దశలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన రాహుల్ కుమార్ మండల్(24) కేటీపీఎస్ ఏడో దశలో కొన్ని నెలలుగా పనిచేస్తున్నాడు. ఆదివారం బ్లాటింగ్ ప్లాంట్ ఏరియాలో శాండ్ ఆఫర్‌లో ఇసుక వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు రోలర్‌లో చేయి పడింది. ఇదే క్రమంలో అక్కడున్న రబ్బరు సైతం చేయితో పాటు మెడకు చుట్టుకోవడంతో మెడ తెగింది. స్థానికులు క్షతగాత్రున్ని హుటాహుటిన కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని విచారణ నిర్వహించారు.



మృతి చెందిన రాహుల్ కుమార్ మండల్

మన్యం బాలింతకు వరద కష్టాలు

చర్ల, న్యూస్‌టుడే: భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగుతుండటంతో అడవి బిడ్డలకు కష్టాలు తప్పడం లేదు. మండలంలోని మారుమూల కుర్నపల్లికి చెందిన ఇర్పా రమ్యకు ఆదివారం పురిటి నొప్పులు వచ్చాయి. నవమాసాలు నిండక ముందే ఏడు నెలల్లోనే రమ్యకు నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఒకపక్క వర్షాలతో వాగులు పొంగుతున్న వేళ రమ్యకు నొప్పులు రావడంతో గ్రామంలో అందుబాటులో ఉన్న ఆటోలో సత్యనారాయణపురం ఆసుపత్రికి బయలుదేరారు. కుర్నపల్లి-బోదనెల్లి మధ్యలోని వాగు పొంగడంతో ఆటో ఇవతలకు రాలేక అక్కడే ఆగాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే రమ్య ఆటోలో మగబిడ్డను ప్రసవించింది. నెలలు నిండని బిడ్డకు జన్మనిచ్చిన రమ్య ఆ పసిగుడ్డును పట్టుకొనే ఆ వాగు దాటాల్సి వచ్చింది. అక్కడి నుంచి మరో ఆటో ద్వారా చింతగుప్ప వరకు చేరుకున్నారు. అక్కడ వాగుపడి వంతెన నీట మునగడంతో 108 ఇవతల వరకే వచ్చి ఆగింది. ఆటో ద్వారా చింతగుప్ప వాగు వరకు వచ్చిన రమ్యను మళ్లీ నీటమునిగిన వంతెనపై నుంచి నడిపించి ఇవతల వైపుగా ఉన్న 108 వాహనాన్ని ఎక్కించారు. తల్లీ, బిడ్డను 108 పైలట్ రవీందర్, ఈఎంటీ అర్జున్‌లు ప్రాథమిక చికిత్సల అనంతరం నేరుగా భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.



అంబులెన్సు ఎక్కిస్తున్న సిబ్బంది



తన పసిగుడ్డును చంకలో వేసుకొని చింతగుప్ప వాగు దాటుతున్న బాలింత రమ్య

అర్హతలుంటేనే కొలువు

ప్రైవేటు పాఠశాలల్లో తప్పనిసరి చేసిన కేంద్ర ప్రభుత్వం

ఉపాధ్యాయ విద్యను పూర్తి చేయాలని ఆదేశం

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలల్లో ఇక నుంచి అన్ని అర్హతలు ఉన్న వారినే ఉపాధ్యాయులుగా నియమించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఎవరినో ఒకరిని ఉపాధ్యాయునిగా నియమించుకుని పాఠశాల నడిపించే విధానానికి ఇక తెరదించనుంది. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కచ్చితంగా వారు బోధించే తరగతులకనుగుణంగా బీఈడీ, డీఈడీ లేదా ఏదో ఒక విద్యార్హత తప్పనిసరిగా ఉండాలని నిర్ణయించింది. మార్చి 2019 లోగా ఈ ఏర్పాట్లు చేసుకోవాలని నిర్దేశించింది. కేంద్రం ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యాశాఖ సమాయత్తమవుతోంది.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలలో ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం కన్పిస్తోంది. అయితే కేంద్రం మాత్రం ఇందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవటానికి కొంత గడువు ఇవ్వటం వారికి తాత్కాలిక ఊరట కలిగించే విషయం. అదే విధంగా ఇప్పటి వరకు కూడా తగిన విద్యార్హతలు లేకుండా ఉన్న వారు ఆన్‌లైన్ ద్వారా కోర్సులు పూర్తి చేసుకునే అవకాశం కూడా కల్పించాలని నిర్ణయం తీసుకుంది. అక్టోబరు 2న 'స్వయం' పేరిట ప్రారంభించనున్న ఆన్‌లైన్ వేదిక ద్వారా కోర్సు పూర్తి చేసేందుకు కూడా సహకరించనుంది. గ్రామీణ ప్రాంతాల్లోని వారి కోసం 'స్వయం ప్రభ' పేరిట 32 డీటీహెచ్ ఛానళ్లు ప్రారంభిస్తారు. జాతీయ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2017 అక్టోబరు, 2018 జూన్, మళ్లీ 2018 అక్టోబరు నుంచి 2019 మార్చి వరకు డీఈడీ కోర్సును పూర్తి చేసుకోవచ్చు. ఇప్పటి వరకు జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తూ ఉపాధ్యాయ శిక్షణ పొందని వారికి కేంద్ర ప్రభుత్వం ఈ అవకాశం కల్పించింది.

జిల్లాలో ప్రైవేటు పాఠశాలల వివరాలిలా..

యాజమాన్యం	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	మొత్తం
ప్రైవేటు ఎయిడెడ్	15	02	11	28
ప్రైవేటు అన్ ఎయిడెడ్	34	83	174	291
గుర్తింపులేని పాఠశాలలు	01	01	03	05
ప్రైవేటు అన్‌ఎయిడెడ్(సీబీఎస్‌ఈ)	-	-	03	03

ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సంఖ్య ఇలా..

యాజమాన్యం	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	మొత్తం
ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో	86	14	72	172
ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో	227	704	2746	3686
గుర్తింపులేని పాఠశాలల్లో	07	23	51	81

జిల్లాలో అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు పాఠశాలలను నిర్వహిస్తున్నారు.

అర్బన్ ప్రాంతాల్లో....

నగర, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో 90 శాతం వరకు బీఈడీ లేదా డీఈడీ అర్హత వారు ఉన్నారు. వీరిలో 40 శాతం మంది ఉపాధ్యాయులకు అకడమిక్ సామర్థ్యం తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. బీఈడీ చేసిన వారిలో కొంతమంది రెగ్యులర్, మరికొంత మంది దూరవిద్య ద్వారా పూర్తి చేసిన వారు ఉన్నారు. డిగ్రీ అర్హతతో కొంతకాలం నుంచి ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న 40 ఏళ్ల పైబడిన ఉపాధ్యాయులు దూరవిద్య ద్వారానే బీఈడీ పూర్తి చేస్తున్నారు. వీరికి ఉన్న వెసులుబాటు ప్రకారం ఇలా అదనపు అర్హతను దూరవిద్య ద్వారా సాధిస్తున్నారు.

సెమీ అర్బన్ ప్రాంతాల్లో...

సెమీ అర్బన్ ప్రాంతాల్లోని ప్రైవేటు పాఠశాలల్లో 70 శాతం మంది మాత్రమే బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన వారున్నారు. వీరిలో ఎక్కువ మందికి శిక్షణ అనుభవం తక్కువగా ఉంటోంది. ఆంగ్లభాషపై పట్టు కూడా సరిగా ఉండడం లేదు. ఉపాధ్యాయ వృత్తి పూర్తి చేసిన వెంటనే ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉద్యోగం లభించటానికి కొంత సమయం పడుతున్నందున ఇలాంటి వారంతా సెమీ అర్బన్ ప్రాంతాల్లోని ప్రైవేటు స్కూళ్లలో చేరిపోతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో...

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రైవేటు పాఠశాలల్లో చాలా వరకు బీఈడీ, లేదా డీఈడీ అర్హతలున్న వారు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు. ఉన్న వారికి కూడా ఓ మోస్తరు అనుభవం ఉంటుంది. డిగ్రీ లేదా ఇంటర్మీయట్ అర్హత ఉన్న వారు, వారి పాఠశాలలకు సమీపంలోని గ్రామాల్లోని వారు అధిక సంఖ్యలో గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో పనిచేస్తారు. వీరికి ఫీజులు చెల్లింపులు కూడా తల్లిదండ్రుల నుంచి తక్కువగా ఉంటాయి. అందుకు అనుగుణంగానే ఉపాధ్యాయుల వేతనాలు కూడా తక్కువగానే ఉంటాయి.

ఉద్యోగ భద్రత కరవు


ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత ఉండదు. హెచ్‌ఆర్ పాలసీ ఉండదు. శ్రమ దోపిడీకి గురవుతుంటారు. బయట ఉద్యోగాలు దొరికే అవకాశాలు లేకపోవటం వల్ల అనేక మంది ప్రైవేటు పాఠశాలల్లోనే దీర్ఘకాలంగా పని చేస్తున్నారు.



అరచేతిలో ఆట 'పోటు'

క్రీడా మైదానాల్లో కనిపించని యువత
జీవితాలను ఛిద్రం చేస్తున్న వైనం
మంచి పరిణామం కాదంటున్న నిపుణులు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే



ఆటలు మైదానాలు వీడుతున్నాయి. అరచేతిలోకి వచ్చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆటలాడే వారి సంఖ్య పెరుగుతున్నా వీరిలో మైదానాలకు వచ్చే వారి సంఖ్య నానాటికీ తగ్గు ముఖం పడుతోంది. ఈ పరిణామాలు ఆటలకు ఉన్న అర్థాన్నే మార్చేస్తున్నాయి. ఆరోగ్యం, క్రమశిక్షణ కోసం ఆటలు ఆడాలి అనే నినాదం కాస్త పక్కదోవ పడుతోంది. ఆరోగ్యాన్ని పంచే ఆటలు మరుగున పడుతుండగా జీవితాలతో ఆటలాడుకునే వికృతమైన ఆటలు అరచేతిలోకి వచ్చిపడుతున్నాయి. అనారోగ్యం, మానసిక రుగ్మతలకు కారణాలవుతున్నాయి. పేర్లు ఏవైనా ఈ తరహా ఆటలు అనారోగ్యంతోపాటు, జీవితాలనే అర్ధంతరంగా ముగించేస్తున్నాయి.

90 నిమిషాలు ఫుట్‌బాల్ ఆడే ఆట 45 కి.మీ. పరుగుతో సమానం

పాశ్చాత్య దేశాల నుంచి దిగుమతి అవుతున్న అంతర్జాల ఆటలు, ఇతర ఆటలు ఇప్పుడు భారత దేశంలో విలయతాండవం చేస్తున్నాయి. ఇలాంటి ఆటలతో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్న నేపథ్యంలో అమెరికా, రష్యా లాంటి దేశాలు ఆటలపై నిషేధం విధించాయి. స్పిన్ వీల్ పేరుతో వచ్చిన ఆట వస్తువును రష్యాదేశం నిషేధించింది. చైనా దేశం ఏకాగ్రత పేరుతో తెచ్చిన ఆట వస్తువులో వారు ప్రచారం చేసిన అంశాలు పూర్తిగా అబద్ధమని పలుదేశాలు ఆక్షేపించాయి. వీటి వల్ల పిల్లలు లక్ష్యాలకు దూరం అవుతున్నారని అలాంటి వస్తువులను తమ దేశంలో అమనుతించమని నిషేధించాయి. ఇలా ఇటీవల కాలంలో పలు ఆట వస్తువులను వివిధ దేశాలు నిషేధించాయి. అలాంటి ఆటవస్తువులపై భారతదేశంలో నియంత్రణ లేకపోయింది. చిన్నారులను తొందరగా ఆకట్టుకుంటున్న ఇలాంటి ఆట వస్తువలు ఇప్పుడు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ ఉరుకులు పరుగులు పెడుతున్నాయి. కొన్ని సాధారణ ఫ్యాన్సీ దుకాణాల ఎదుట ప్రత్యేకంగా బోర్డులు వెలిశాయి. వీటిని అభివృద్ధి చెందిన దేశాలే నిషేధించాయి. భారత ప్రభుత్వం ఇలాంటి ఆటవస్తువుల అమ్మకాలపై నిషేధం విధించేందుకు సిద్ధమవుతోందనే విషయం విక్రయాదారులకు, వీటి కోకొల్లలుగా కొనుగోలు చేస్తున్న వినియోగదారులకు తెలియని విషయంగా మారింది. కొన్ని విద్యాసంస్థల్లో స్పిన్‌వీల్ లాంటి ఆట వస్తువులతో వచ్చే విద్యార్థులను తీవ్రంగా మందలించడంతోపాటు తల్లిదండ్రులను పిలిపించి హితబోధ చేస్తున్నారు.

గాయాలు లేని క్రీడగా గుర్తింపు పొందిన ఈత సాధన ఒక గంట సమయంలో శరీరంలోని అన్ని అవయవాల్లో కదలిక తేవడంతోపాటు శరీరబరువు సమతుల్యంలో ఉంటుంది. చమటోడ్చే ఆటలకన్నా అధిక సాధన కేలరీలు ఖర్చవుతాయి. ఇదే ఈత పేరుతో అనేక వికృత క్రీడలు అంతర్జాలంలో ఉన్నాయి. వీటి వల్ల సమయం వృథా. ఇలాంటి క్రీడల కోసం చాలా మంది నిద్రలు త్యాగం చేస్తున్నారు. నిద్రలేమి అలవాటుగా మారడంతో తల సంబంధమైన వ్యాధులు, మానసిక సమస్యలు, రక్తపోటు, బతుకు మీద విరక్తి ఉంటాయి. మత్తుకు అలవాటు పడుతున్న వారిలో తొంభైశాతం మంది ముందుగా బ్లూవేల్స్ లాంటి అంతర్జాల ఆటల్లోనే మునిగి తేలారని నివేదికలు వచ్చిన నేపథ్యంలో ఆ ఆటను భారత ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. అంతర్జాలంలో లేకుండా చూడాలని ఆయా సంస్థలను ఇప్పటికే హెచ్చరించింది. మరో 19 ఇలాంటి వికృత ఆటలను నిషేధించేందుకు జాబితా తనిఖీలు కొనసాగుతున్నాయి.



ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అంతర్జాల రమ్మీ గ్రూపులు.. 2700

జిల్లాలో ఇదీ లెక్క

ఉభయ జిల్లాల్లో 23 లక్షలు సెల్‌ఫోన్లు వాడుకలో ఉన్నాయి. ఇందులో 55 శాతం స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి. 13.9 లక్షల మంది రోజుకు ఒక జీబీ అంతర్జాలాన్ని వినియోగిస్తున్నారు. ఇందులో 70 శాతం మంది 13 నుంచి 19 సంవత్సరాలలోపు వారున్నారని, వారు ఆటలకే అంతర్జాలాన్ని వినియోగిస్తున్నట్లు ఒక ప్రముఖ టెలికం ఆపరేటింగ్ సంస్థ ప్రతినిధి అంచనావేశారు.

అంతర్జాల ఆటలతో పెరుగుతున్న ముప్పు

అంతర్జాలంలో లేని ఆటలు లేవనే చెప్పవచ్చు. ముఖ్యంగా ఇంగ్లాండ్, అమెరికా, ఆఫ్రికా దేశాల్లో యువతను విశేషంగా ఆకట్టుకున్న ఆటలను దేశంలోనూ జొప్పిస్తున్నారు. ఇలాంటి ఆటలు అక్రమార్కులు ఆదాయ సాధనాలుగా మార్చుకున్నారు. మైదానంలో ఆడాల్సిన క్రికెట్ క్రీడను అంతర్జాల క్రీడగా మలిచినప్పటి నుంచి బెట్టింగ్ విధానం పెరిగి పోయింది. మహానగరాలకే పరిమితమయ్యాయనుకుంటున్న క్రికెట్ బెట్టింగుల ఉదంతాలు మధిర, సత్తుపల్లి, భద్రాచలం, జిల్లాలోని పలు గ్రామాల్లోనూ వెలుగు చూడటంతో నిఘా సంస్థలు సైతం నివ్వెరపోయాయి. ఎర్రుపాలెం లాంటి మండల కేంద్రంలో బెట్టింగ్ రాకెట్ నడుపుతూ 11 మంది పట్టుబడిన సంఘటన అరచేతి అక్రమ ఆటలు గ్రామాలకూ చేరిందనే విషయం తేటతెల్లమైంది.

అంతర్జాలంలో పేకాట

పేకాట నిషేధం. చట్టరీత్యా నేరం. అదే ఆన్‌లైన్లో ఆడితే ఇందుకు సమాధానం లేదు. పేకాట క్లబ్బులు మూతపడుతున్నాయి. నిజానికి ఎవరో వచ్చి దాడులు చేసి ఆపేశారు అనేకంటే క్లబ్బులకు వచ్చే వారి సంఖ్య తగ్గడంతో క్లబ్బులు మూత పడుతున్నాయని చెప్పడం మంచిదని క్లబ్ నిర్వాహకులు చెబుతున్నారు. ఎవరి ఇంట్లో వారు స్మార్ట్ ఫోన్లను వేదికలుగా మలుచుకున్నారు. రమ్మీ గ్రూపులుగా ఏర్పడి ఆట పేరుతో లక్షల లావాదేవీలు కొనసాగిస్తున్నారు. ఖమ్మం కొత్తగూడెం జిల్లాలో 2700 రమ్మీగ్రూపులు చెలామణి ఉన్నట్టు అంచనాలు ఉన్నాయి. ఇంటిల్లిపాదిగా ఆడుకుంటున్న అలవాటు పెరగడంతో ఆన్‌లైన్ రమ్మీ విపరీతమైన ఆదరణ పెరిగింది. సామాజిక మాధ్యమాల్లో నేను ఈరోజు రమ్మీలో పదివేలు గెల్చుకున్నా, మరొకరు రు.20వేలు గెల్చుకున్నామని చెప్పేస్తుండటంతో ఆటకు అలవాటు పడిన ప్రతీ వారు ఒక్క ఛాన్స్ చూద్దామని రంగంలోకి దిగి వేలు, లక్షలు పోగొట్టుకుంటున్నారు. ఖమ్మం నగరంలో కొందరు ఇంటిల్లిపాదిగా సరదాగా స్మార్ట్‌ఫోన్లలో రమ్మీ ఆడటం అలవాటు చేసుకున్నారు. వీరిలో మహిళలూ ఉన్నారు. ఇంట్లో కుటుంబ సభ్యులే రూ.50 నుంచి వందరూపాయల వరకు పందాలు ఆడుతున్నారు. ఇక్కడి అలవాటుతోనే రమ్మీ గ్రూపుల్లో చెలగాటం ఆడి వేలు లక్షలు పోగొట్టుకుంటున్నారు. ఖమ్మం నగరంలో ఇలా చేతులు కాల్చుకున్నవారి సంఖ్య వందల్లో ఉంది. రమ్మీ ఆటలో ఆరితేరిన వారు కూడా భారీగా నష్టపోయిన సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. నగరానికి చెందిన ఇద్దరు రమ్మీ మోజులో ఒకరు రూ.1.75 లక్షలు, మరొకరు రూ.2.45 లక్షలు పోగొట్టుకున్నారు.



బాబోయ్ బ్లూవేల్



దిల్లీ నగరంలో బ్లూ వేల్ క్రీడలకు అలవాటు పడిన 18 ఏళ్ల యువకుడు బహుళ అంతస్తుల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. హైదరాబాదులోనూ ఇలాంటి ప్రయత్నం జరిగింది.

జిల్లాలోనూ బాధితులు..

బ్లూ వేల్, ఇలాంటి అంతర్జాల ఆటలకు అలవాటు పడిన వారి సంఖ్య జిల్లాలో అధికంగా ఉందని మానసిక వైద్యుల వద్దకు వస్తున్న కేసులు వివరిస్తున్నాయి.



ఖమ్మం నగరంలో శ్రీనగర్ కాలనీకి చెందిన 19 ఏళ్ల యువకుడు వింతగా ప్రవర్తించాడు. ఎన్.ఎస్.కెనాల్ క్రాసింగ్ బ్రిడ్జి రెయిలింగ్‌పై నిలబడే ప్రయత్నం చేస్తున్న సందర్భంలో అటుగా వెళ్తున్న పాదచారులు వారించారు. ఇంట్లో కరెంట్ తీగ ఇంటి గేటుపై వేసి అతడి తల్లిని స్విచ్ ఆన్‌చేయమని అడిగాడు. ఇటీవల కాలంలో అతని శరీరంపై గాయాలు కనిపించాయి. మానసిక రుగ్మతగా భావించిన తల్లిదండ్రులు చికిత్స చేయిస్తున్నారు.

ఖమ్మం నగరంలోని రోటరీ నగర్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ఉద్యోగ ప్రయత్నాల్లో విఫలమవుతూ మానసికంగా కుంగుబాటుకు గురయ్యాడు. ఇతనికి నిత్యం అంతర్జాలంలో ఆటలాడే అలవాటు ఉంది. ఇటీవల ఇతడు తలపై గాయం చూపడంతో తల్లిదండ్రులు కంగారు పడి వైద్యుడిని సంప్రదిస్తే అతను మానసిక వైద్యుడికి చూపించమని సలహాయిచ్చారు. ఈ విద్యార్థి బ్లూ వేల్ బాధితుల జాబితాలో చేరాడని మానసిక వైద్యులు అనుమానిస్తున్నారు.

గత మూడు నెలల్లో ఖమ్మం మానసిక వైద్యుల వద్దకు వైద్యం కోసం వస్తున్న వారిలో 30 మందిని వైద్యులు బ్లూవేల్, ఇతర అంతర్జాల ఆటల బాధితులుగా వైద్యులు అనుమానిస్తున్నారు.



ఆ.. ఆటల్లో ఉన్నదంతా విషపూరితం

ఆరోగ్యానికి చిహ్నంగా ఉండాల్సిన ఆటలు అనారోగ్య చిరునామాలుగా రూపాంతం చెందుతున్న పరిణామాల పట్ల క్రీడాసమాజం సైతం ఆందోళన చెందుతోంది. మైదాన ఆటల్లో ఉన్న ఆరోగ్యం, అరచేతిలో సెల్‌ఫోన్‌లో ఆడే ఆటల వల్ల కలిగే నష్టాలను నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ సంస్థ ఇలా లెక్కకట్టింది.

వాలీబాల్ ఆట ఇందులోని సాధన ఆరు కిలోమీటర్ల పరుగుతో సమానం. అదే ఆటను సెల్‌ఫోన్ ఆటగా చూసి ఆనందించేవారికి కంటి సమస్యలు, నుదురు పోటు వస్తుంది.



90 నిమిషాలు ఫుట్‌బాల్ ఆడే ఆట 45 కి.మీ. పరుగుతో సమానం. అదే ఆటను సెల్‌ఫోన్‌లో చూసే వారు కంటి సమస్యలు, 15 గ్రాముల కొవ్వును పెంచుకుంటారు. కండరాల సమస్యను ఎదుర్కొంటారు.

బెస్టాఫ్ త్రీ గేమ్స్ బ్యాడ్మింటన్ సింగిల్స్ ఒక రోజు ఆట తొమ్మిది కిలోమీటర్ల పరుగుతో సమానం. అదే ఆటను సెల్‌ఫోన్లో ఆనందించేవారికి వెన్ను సమస్య, కంటి సమస్యలు తలెత్తుతాయి.

విద్యాసంస్థల్లో జాగ్రత్తలు

చదువుల్లో ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు తల్లిదండ్రులు ఎంతగా శ్రమటోడుస్తున్నారో ఆ ఫలితాలు సాధించేందుకు జిల్లాలోని విద్యాసంస్థలూ రేయిబవళ్లు శ్రమిస్తున్నాయి. స్థాయిగల బోధనా సిబ్బంది ఒక అంశం అయితే విద్యార్థులను లక్ష్యాల దిశగా సంసిద్ధులు చేసే ప్రయత్నాలూ కొన్ని విద్యాసంస్థలు అమలు చేస్తున్నాయి. రెండేళ్లు కళాశాల వసతి గృహంలోనే ఉండి చదువుకునే విద్యార్థులకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వరాదనే నిబంధన అమలు చేస్తున్నాయి. కేవలం కీప్యాడ్ ఫోన్లు అదికూడా వసతి గృహం నిర్వాహకుడు కేటాయించిన వేళల్లోనే తల్లిదండ్రులతో మాట్లాడాలనే ఆంక్షలు విధించాయి. ఇలాంటి ప్రయోగాలు చేసిన విద్యాసంస్థలు గతం కంటే భిన్నమైన మంచి ఫలితాలు రావడంతో కళాశాలలు ఇదే పద్ధతిని పాటించే క్రమంలో ఉన్నాయి.

ఏకాగ్రత ఉండటంలేదు

భరత్‌చంద్ర, సీనియర్ క్రీడాకారుడు



బాస్కెట్‌లో రాణించాలంటే ఏకాగ్రత, చురుకుదనం చాలా అవసరం. పదేళ్ల క్రీడాకారుడు కూడా స్మార్ట్‌ఫోన్‌తో వస్తున్నాడు. వారు సాధనలో ఉండగానే ప్రతీ అయిదు నిమిషాలకోసారి ఫోన్ చూసుకొని వస్తున్నారు. ఇందులో కొందరు స్మార్ట్‌ఫోన్ల ద్వారా అమెరికాలో రాటుదేలిన క్రీడాకారులు ఆడుతున్న మెళకులను చూసి నేర్చుకుంటున్నారు. ఇంత వరకు స్మార్ట్ ఫోన్లు మేలు చేస్తున్నట్టే. చాలా మంది యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకొని ఫోన్లో ఆటకు అలవాటు పడి మైదానాలకు రావడం మానేస్తున్నారు. జిల్లాజట్ల ఎంపికలకు వస్తున్నప్పటికీ రాణించలేక పోతున్నారు. అన్ని విభాగాల క్రీడా శిక్షకులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. గట్టిగా చెబితే ఆటకే దూరం అవుతున్నారు.

చురుకుదనం కోల్పోతున్నారు...

కౌన్సిలింగ్ విద్యార్థులకంటే వారి తల్లిదండ్రులకు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఎవరు ఏం చేస్తున్నారో బహుమతుల రూపంలో ఖరీదైన స్మార్ట్‌ఫోన్లు ఇస్తున్నారు. కళాశాలలో పాఠాలు చెబుతున్నప్పుడుకూడా నిమిషానికోసారి ఫోన్‌లో తొంగి చూస్తున్న విద్యార్థులు ఉన్నారు. వారిలో కుటుంబ పరిస్థితులు బాగోలేని వారున్నారు. అలాంటి విద్యార్థుల చేతుల్లోనూ ఖరీదైన స్మార్ట్ ఫోన్లు ఉంటున్నాయి. విద్యాసంస్థల్లో గతంలా ఆటల పిరియడ్లు తప్పని సరి చేయాలి. అవి లేని కారణంగానే విద్యార్థులు మైదానాల వైపు చూడటంలేదు. విద్యాసంస్థల్లో ఆటల వ్యవస్థను పటిష్ఠం చేసే దిశగా చర్యలు ఉండాలి. మైదానాలకు విడిచి పెట్టే విధానం లేక పోవడంతో యువత అరచేతి ఆటలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అందుకు తగిన అనారోగ్యం తెచ్చుకుంటున్నారు.



సజీవంగా ఉన్నట్లున్న వన్యప్రాణులు



మింగేసేలా ఉన్న మొసలి



అందమైన నెమలి..

సజీవ జాలం

కిన్నెరసానిలో ఆకట్టుకుంటున్న మ్యూజియం

పాల్వంచగ్రామీణం, న్యూస్‌టుడే

ఆ జంతు రూపాలను చూస్తే అచ్చు నిజమైనవా అనిపిస్తుంది. ప్రతి జీవంలోనూ జీవకళ ఉట్టిపడుతుంది. ఆ కేంద్రంలో అర్ధగంటపాటు గడిపితే చాలు కిన్నెరసాని అభయారణ్యం చుట్టివచ్చామన్న భావన కలుగుతుంది. అంత అందంగా తీర్చిదిద్దారు ఆ ప్రాంగణాన్ని. రయ్‌న దూసుకెళ్లే బోట్లు... నెమళ్ల క్రేజ్.. చెంగుచెంగున ఎగిరే దుప్పుల పార్కు... సేద తీరడానికి లాన్.. ఇలా దినదినాభివృద్ధి చెందుతున్న కిన్నెరసానిలో మ్యూజియం రూపంలో మరో కలికితురాయి సిద్ధమైంది. పర్యాటకుల్ని ఆకర్షించడంతోపాటు విద్యార్థులకు అవగాహన కల్పించేలా అటవీ శాఖాధికారులు పర్యావరణ విద్యా కేంద్రం(ఈఈసీ) సిద్ధం చేశారు. అద్భుతంగా దీని నిర్మాణం చేశారు. ఇందులో వన్యప్రాణుల రూపాలు సజీవంగా ఉన్నాయా అన్న రీతిలో కళాకారులు తయారుచేశారు.


కిన్నెరసాని రిజర్వాయర్‌లో రూ.20లక్షలతో పర్యావరణ విద్యా కేంద్రం(ఈఈసీ) ఏర్పాటు చేశారు. గతంలో జంతువులు కొమ్ములు, అవశేషాలు భద్రపరిచిన మ్యూజియాన్ని మరమ్మతులు చేసి ఈఈసీ భవనం నిర్మించారు. అహ్మదాబాద్‌కు చెందిన పర్యావరణ విద్యా కేంద్రం కళాకారులు ఫైబర్‌తో ఇందులో వన్యప్రాణుల బొమ్మలు తయారుచేశారు. బొమ్మల్ని చూస్తే జీవమున్నట్లుగానే అనిపిస్తుంది. ఆ జీవుల వెనుక భాగం సైతం అచ్చం అడవుల్ని పోలినట్లు రూపొందించారు. ఏ జంతువులు ఎలాంటి ప్రాంతాల్లో సంచరిస్తాయో అదే రీతుల్లో తీర్చిదిద్దారు. అభయారణ్యంలో సంచరించే వన్యప్రాణుల్ని, వృక్షాల్ని ఇక్కడ గమనించవచ్చు.

అభయారణ్యం చూసినట్లే...

కేంద్రంలోకి వెళ్తే అభయారణ్యాన్ని పూర్తిగా చూశామన్న భావన కనిపిస్తుంది. నోరెళ్లబెట్టి మింగేయడానికి వస్తున్నట్టు మొసలి, మీదకు దూకుతాయన్నట్లు చిరుతలు, పెద్దపులుల విగ్రహాలుంటాయి. ప్రధాన గేటుకు ఎదురుగానే మొసలి ఉండటంతో ఒక్కసారిగా వెళ్తే ఒళ్లు ఝల్లుమంటుంది. చెంగుచెంగున ఎగిరే లేడిపిల్లలు, కనువిందు చేసే కొండగొర్రెలు నిజంగా చెట్ల చాటునుంచి వస్తున్నాయా.. అన్నట్టు ఉంటాయి. అభయారణ్యంలో ఏమేం వన్యప్రాణులు సంచరిస్తున్నాయో ఆ జంతువుల బొమ్మలు ఈఈసీ కేంద్రంలో ఏర్పాటు చేశారు.

అరుపులూ వినొచ్చు..

వన్యప్రాణుల బొమ్మలు ఓ గదిలో ఉంటే, పక్షులు బొమ్మలు మరో గదిలో ఉన్నాయి. పక్షుల బొమ్మల్నే కాదు వాటి అరుపుల్నీ ప్రత్యక్షంగా వినొచ్చు. పక్షుల కిందున్న స్విచ్‌లు నొక్కితే చాలు ఆ పక్షి కిలకిలరావాలు వినిపిస్తాయి. పాలపిట్ట, అడవికోడి, వడ్రంగిపిట్ట, చుప్పనాతి, రామచిలుక, నీటికోడి, గుడ్లగూబ, జుట్టుపిట్ట, కోకిల, గువ్వ, నెమళ్లు తదితర అనేక రకాల పక్షుల అరుపులు వినొచ్చు. అద్భుత సాంకేతికతతో బొమ్మల్ని ఏర్పాటుచేసి సౌండ్‌సిస్టమ్ అమర్చారు. దీంతోపాటు వన్యప్రాణులు, పక్షులు జీవిత చరిత్రలు సైతం ఏర్పాటు చేశారు. ప్రతి జంతువు/పక్షులు శాస్త్రీయ నామం? దినచర్య? తదితర అంశాల్ని పొందుపర్చారు. పర్యాటకుల సౌకర్యార్థం ఏసీలు సైతం ఏర్పాటుచేశారు. ఫిల్మ్ థియేటర్ అందుబాటులోకి తెచ్చారు.



చెట్లపై నెమలి, పక్షుల బొమ్మలు

ఏడాదికే అందిన ద్రాక్ష

ఇళ్లలో పచ్చదనం ఉండాలని, పూలచెట్లు, ఆకుకూరల పాదులు ఏర్పాటు చేసుకుంటారు. ఖమ్మం నగరంలోని వికలాంగుల కాలనీకి చెందిన మేరి అనే మహిళ తన ఇంట్లో ద్రాక్ష తీగను ఏడాదిక్రితం నాటింది. దాని తీగలు ఏపుగా పెరగడంతో డాబాపై దానికోసం ప్రత్యేక పందిరి ఏర్పాటుచేశారు. దీంతో ద్రాక్ష గుత్తులుగుత్తులు కాస్తున్నాయి. అన్ని నేలల్లో ద్రాక్ష పండే అవకాశం లేకపోయిప్పటికీ ఇక్కడ గుత్తులుగా కాయడం విశేషం. బయటి విపణిలోనే కన్పించే ద్రాక్ష ఇంటిలోనే కాస్తుండటంతో చుట్టుపక్కల వాళ్లు ఆసక్తిగా చూస్తున్నారు.

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే





తీగకు కాసిన ద్రాక్ష గుత్తులను చూపుతున్న మేరి

యువ 'ఖేల్' కబడ్డీ

క్లిక్.. క్లిక్



గ్రామీణ క్రీడ కబడ్డీ మరుగున పడిపోతున్న సమయంలో ప్రో కబడ్డీ పోటీలు తిరిగి ప్రాణం పోస్తున్నాయి. దీంతో ఈ క్రీడకు విశ్వవ్యాప్తంగా విశేష గుర్తింపు లభించింది. ఇదే స్ఫూర్తితో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, యువకులు ఈ ఆటను ఆడుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో ఖమ్మం బైపాస్ రోడ్డుకు దగ్గరలో ఉన్న వసతి గృహ విద్యార్థులు ఇలా ఉత్సాహంగా కబడ్డీ ఆడుతూ కనిపించారు.

-న్యూస్‌టుడే, ఖమ్మం గట్టయ్య సెంటర్

మృత్తికా వినాయకా..

గుండాల, న్యూస్‌టుడే

మారుమూల మన్యం ప్రాంతంలో మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం యాపలగడ్డ గ్రామంలో ఈ క్రతువు గత అయిదేళ్లుగా నిరాటంకంగా కొనసాగుతోంది. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన తుషార్ అనే యువకుడు ఇక్కడ ఏటా వినాయక చవితికి ముందు సహజసిద్ధంగా లభించే వస్తువులతో పర్యావరణ గణపతుల ప్రతిమలు తయారు చేస్తున్నారు. వెదురు కర్రతో ఆకృతి చేసి మట్టితో జీవకళ ఉట్టిపడే విగ్రహాలను తయారు చేస్తున్నారు. రసాయన రహిత రంగులనే అద్దుతున్నారు. ఈసారి తన స్నేహితులు ఒడిశా రాష్ట్రం ముల్కనగిరికి చెందిన సునాతోన్‌పాల్, కార్తీక్‌బిశ్వాస్‌లతో విగ్రహాలు రూపొందించారు.

ఇక్కడే ఎందుకు: ఇదివరకు రహదారి సౌకర్యంలేక గుట్టలు, కొండల మీదుగా పట్టణాల నుంచి విగ్రహాలను తరలిస్తున్న తరుణంలో విగ్రహాలు దెబ్బతినేవి. దాంతో ఇక్కడే విగ్రహాలు తయారు చేయాలని తుషార్ ముందుకొచ్చారు. అప్పటినుంచి ఇలా కొనసాగుతోంది. చిన్న పరిమాణం నుంచి 15 అడుగుల ఎత్తు ఉన్న విగ్రహాలను సైతం తయారు చేస్తున్నారు. ప్రస్తుతం 30 భారీ విగ్రహాలు సిద్ధం అయ్యాయి. రూ. 3వేల నుంచి రూ. 16 వేల ధర ఉన్న ప్రతిమలు తయారు చేశారు. చుట్టుపక్కల గ్రామాలతోపాటు సమీప పట్టణవాసులు సైతం మట్టి గణపతులను కొనుగోలు చేస్తూ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈసారి ఖమ్మం నుంచి ఆర్డర్‌లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం తయారైన వాటిలో ఎక్కువగా ముందస్తుగా చెల్లింపు చేసినవే కావడం విశేషం. దీన్నిబట్టి మట్టిగణపతులపై ఆదరణ పెరిగిందని చెపుతున్నారు.







సింగరేణి సమాచారం

24న దిల్లీలో వేతన కమిటీ సమావేశం

కొత్తగూడెం (సింగరేణి), న్యూస్‌టుడే: జేబీసీసీఐ పదో వేతన కమిటీ సమావేశం 24న దిల్లీలో జరగనుంది. పదో వేతన కమిటీ సమావేశాలు గురు, శుక్ర, శనివారాల్లో రాంచిలో జరిగినప్పటికీ ఒప్పందం కుదరకపోవడంతో తిరిగి 24న సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. 24న జరిగే సమావేశాల్లో దేశంలోని బొగ్గు గని కార్మికులకు మినిమం గ్యారంటీ విషయంలో ఒక అంగీకారం కుదదిరే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. శనివారం 21శాతం మినిమం గ్యారెంటీ 4శాతం ప్రత్యేక అలవెన్సులకు అంగీకరించి యాజమాన్యం చివరి దశలో ఒప్పందానికి విరుద్ధంగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. 24న కూడా ఈ ప్రతిపాదనకు అంగీకరిస్తేనే ఒప్పందం చేసుకోవాలని యోచిస్తున్నట్లు జాతీయ కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. ఒప్పందంపై యాజమాన్యాలు సానుకూలంగా ఉంటే పదో వేతన కమిటీ చివరి సమావేశం ఇదే కానుంది. ఒప్పందం కూడా కుదిర్చేందుకు అటు యాజమాన్యాలు, ఇటు జాతీయ కార్మిక సంఘాలు సంసిద్ధతను వ్యక్తం చేస్తున్నాయి.

సింగరేణిలో ఎన్నికలపై నేడు సమావేశం

కొత్తగూడెం(సింగరేణి), న్యూస్‌టుడే: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణ విషయంపై సోమవారం హైదరాబాద్‌లోని డిప్యూటీ కమిషనర్ లేబర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటుకానుంది. ఈ మేరకు 17 కార్మిక సంఘాలకు ఆహ్వానం పలుకుతూ ఆయన ఇప్పటికే ఆయా కార్మిక సంఘాలకు లేఖలు పంపారు. సోమవారం డిప్యూటీ సీఎల్‌సీ శ్యాంసుందర్ కార్మిక సంఘాలతో సమావేశాన్ని నిర్వహించనున్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో ఈ సమావేశం జరగనుంది. గుర్తింపు సంఘ ఎన్నికల తేదీని నిర్ణయించే అవకాశాలున్నాయి. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే ఈ నెల 14న సమావేశం జరిగిన విషయం తెలిసిందే. కాగా ఈ సమావేశంలో బీఎంఎస్, సీఐటీయూ ఎన్నికలకు ముందుగా రెండు ఓట్ల విధానాన్ని ప్రవేశపెట్టాలని పట్టుబట్టాయి. ఏరియాల్లో గుర్తింపు సంఘంగా ఒక ఓటును కంపెనీ వ్యాప్తంగా గుర్తింపు కోసం మరో ఓటును వేసే అవకాశాన్ని కల్పించాల్సిందిగా పట్టుబట్టాయి. ఈ ప్రతిపాదనను అంతగా పట్టించుకోకుండా కూడా ఎన్నికల నోటిఫికేషన్‌ను జారీచేసే అవకాశం ఉంది. ఎన్నికలకు సంబంధించిన తుది నిర్ణయం సోమవార వెలువడే అవకాశాలు కన్పిస్తున్నాయి.

'ఒప్పంద కార్మికులకూ ప్రసూతి సెలవులివ్వాలి'

కొత్తగూడెం(సింగరేణి), న్యూస్‌టుడే: సింగరేణి మహిళా కార్మికులకు మంజూరు చేసినట్టు మహిళా ఒప్పందకార్మికులకు కూడా ప్రసూతి సెలవులను ఇవ్వాలని ఒప్పంద కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు హైదరాబాద్‌లో కేంద్రం మంత్రి బండారు దత్తాత్రేయను కలిసి వారికి ఆదివారం ఓ వినతి పత్రాన్ని సమర్పించారు. ఒప్పంద కార్మికులకు బోనస్‌ను, ఇతర సౌకర్యాలను కూడా అందించాల్సిందిగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐకాస నాయకులు గుత్తుల సత్యనారాయణ, వెంకన్న, శంకర్, రఘు తదితరులు పాల్గొన్నారు.


ఏకలవ్య పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దమ్మపేట, న్యూస్‌టుడే: గండుగులపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏకలవ్య గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఆర్సీవో బురాన్, ప్రిన్సిపల్ గిరిరాజు సీతాకుమారి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పాఠశాలలో 5, 6 తరగుతుల ప్రవేశాలకు గాను, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని వివరించారు. గురుకుల పరీక్షలు రాసినవారు, రాయని వారు దీనికి అర్హులని తెలిపారు. గతంలో గురుకుల కౌన్సెలింగ్‌లో సీటు రాని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి తరగతిలో ఎస్టీలకు 64, ఎస్సీలకు 10, బీసీలకు 4, జనరల్ కేటగిరిలో 2 సీట్లు కేటాయించినట్లు వివరించారు. ఈనెల 23న గండుగులపల్లిలో జరిగే కౌన్సెలింగ్ కార్యక్రమానికి దరఖాస్తుదారులు ఉదయం 10గంటలకు అన్ని అర్హత పత్రాలతో హాజరుకావాలని వారు కోరారు.

తెలుగు మాధ్యమంలోనూ సత్తా చాటొచ్చు

మాతృభాషలో చదివితే ఉద్యోగాలు రావని ఎవరన్నారు? పోటీ పరీక్షల శిక్షణ నిపుణులు ద్వా.నా. శాస్త్రి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ఉద్యోగాలు రావు అనడం సమంజసం కాదని సివిల్స్, ఇతర పోటీ పరీక్షల శిక్షణ నిపుణులు ద్వా.నా.శాస్త్రి అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమావేశం హాలులో తెలుగు మాధ్యమంలో సివిల్స్‌ను సాధించటం ఎలా? అనే అంశంపై ద్వా.నా.శాస్త్రి ప్రసంగించారు. ఉపనిషత్తులు-ప్రయోజనాలు అనే అంశంపై ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు విభాగం పూర్వపు విభాగ అధిపతి డాక్టర్ మసన చెన్నప్ప మాట్లాడారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో పాటు ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు. తెలుగు భాషాభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపుగా స్థానిక సృజన సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వీరిద్దరికీ 'జీవన సాఫల్య పురస్కారాలు' అందజేశారు. నగదు, శాలువ, సన్మాన పత్రాలతో ప్రశంసించారు. ఈ సందర్భంగా వీరు తెలుగు భాష ఔన్నత్యాన్ని, ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో సృజన సాహితీ సంస్థ బాధ్యులు మధుసూదనరాజు, జి.రామకృష్ణ, గట్టే వాసు, కవి నియోగి, ఆడమ్స్, ప్రిన్సిపల్ నరసింహారావు, ఎంపీడీవో రవి, విద్యా ప్రవీణ, గాదిరెడ్డి రాంబాబురెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మసన చెన్నప్ప, ద్వా.నా.శాస్త్రిలను సత్కరిస్తున్న నిర్వాహకులు

మాతృభాషపై పట్టు సాధిస్తే ప్రయోజనాలు ఎన్నో : ద్వా.నా. శాస్త్రి



ప్రస్తుతం రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పలు పోస్టులు, తెలుగు ఉపాధ్యాయుల ఖాళీలు వేల సంఖ్యలో ఉన్నాయి. ఈ భాషపై పట్టు సాధిస్తే పోటీ పరీక్షల్లో ఎక్కువగా మార్కులు సాధించటం ద్వారా ఉన్నత ఉద్యోగాలు పొందవచ్చు. అనేక సంవత్సరాలుగా నేను ఇది గమనించా. అనేక మంది ఆంగ్లం మోజులో పడి తెలుగు నేర్చుకోవడాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే ఆంగ్లంతో పాటు తెలుగుపైనా పట్టు సాధించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దృష్టి సారించాలి. తెలుగు మాధ్యమంలో చదివి సివిల్స్ సాధ్యమేనని ఇటీవలే శ్రీకాకుళం జిల్లాకు చెందిన రోణంకి గోపాలకృష్ణ ఐఏఎస్-3వ ర్యాంకు సాధించటం ద్వారా నిరూపించారు. మాతృభాష గొప్పతనాన్ని చాటారు. ఆంగ్లమాధ్యమంలో చదివిన అనేక మంది ప్రస్తుతం తెలుగు మాధ్యమంలో పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. తెలుగు సాహిత్యంలో కథ, కవిత్వం, నాటకం, నవల మమేకమై ఉన్నాయి. వీటిని సమగ్రంగా అధ్యయనం చేయాలి.

ఉపనిషత్తులు వ్యక్తిత్వ వికాస గ్రంథాలు : చెన్నప్ప



ఉపనిషత్తుల సారాంశమే భగవద్గీత. మనిషి మనిషిగా జీవించటం, ప్రపంచానికి జ్ఞానాన్ని అందించగల సారం ఉపనిషత్తులు, వేదాల్లో ఉంది. ఇతరులను కొట్టి, తిట్టి తినటం కాదు. వారికి పెట్టిన తరువాత నీవు తిను అని ఉపనిషత్తులు చెబుతున్నాయి. ప్రపంచ మానవాళి సుఖశాంతులు, త్యాగబుద్ధితో జీవించాలని అవి తెలియజేస్తున్నాయి. జీవితంలోని అన్ని దశలనూ అర్థవంతంగా నిర్వహించటం నేర్పేవి ఉపనిషత్తులు.



చిన్నారులకు పురస్కారం అందిస్తున్న దృశ్యం

పాల్వంచ చిన్నారులకు అన్నమయ్య పురస్కారాలు

పాల్వంచ సాంస్కృతికం, న్యూస్‌టుడే: పాల్వంచ పట్టణ పరిధిలోని సంజయ్‌నగర్‌కాలనీకి చెందిన కృష్ణకుమార్, వాణిశ్రీలత కుమార్తెలు యశస్విని, తపస్వి అన్నమయ్య పురస్కారాలు అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో త్యాగరాయ గానసభ వేదికపై శ్రీలహరి క్లాసికల్ అకాడమీ ఈ పురస్కారాన్ని అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చిన్నారులు ప్రత్యేకంగా నృత్య ప్రదర్శన చేశారు. సంస్థ అధికారులు వారిని అభినందించారు.

పద్మశాలి సంఘం భవనంలో ఫొటోగ్రఫీ దినోత్సవం

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం రాత్రి కొత్తగూడెంలోని పద్మశాలి సంఘం భవనంలో ఘనంగా నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్, పట్టణ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఛైర్‌పర్సన్ పులి గీత హాజరై ప్రారంభించారు. ఫొటోగ్రాఫర్స్ ఏర్పాటు చేసిన కెమెరాలు, పరికాలను ప్రదర్శించారు. ఛాయాచిత్రకారులు తీసిన అద్భుతమైన చిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో తెరాస నాయకులు జీవీకే మనోహర్‌రావు, కౌన్సిలర్ లక్ష్మీబాయి, ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్కే షరీఫ్, జిల్లా అధ్యక్షులు మైలవరపు రామకృష్ణ, జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు, కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు చావా పాపారావు, కార్యదర్శి గడ్డం ప్రభాకర్, కోశాధికారి రవికుమార్ నాయకులు, సభ్యులు పలువురు పాల్గొన్నారు.



చిత్రాలను పరిశీలిస్తున్న అతిథులు

కోడి పందేలకు తరలుతున్న తొమ్మిది మంది అరెస్టు

దమ్మపేట, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి మండలం నుంచి చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి కోడిపందేలకు తరలుతున్న 9మంది వ్యక్తులను ఆదివారం దమ్మపేట పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. చింతలపూడి మండలం రంగాపురం, ప్రగడవరం గ్రామాలకు చెందిన తొమ్మిది మంది వ్యక్తులు కోడిపందేలకు తరలుతున్నారన్న సమాచారంతో ఎస్సై జె.ప్రవీణ్ వాహన తనిఖీలు నిర్వహించారు. పందేలకు తరలుతున్న 9మందిని అదుపులోకి తీసుకొన్నారు. వారి నుండి రూ. 1.02 లక్షల నగదును, మూడు పందెం కోళ్లను స్వాధీనం చేసుకొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల నిరసనకు తెఉస మద్దతు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం) రద్దు చేయాలని కోరుతూ సీపీఎస్ ఉద్యోగులు సెప్టెంబరు 1వ తేదీన తలపెట్టిన నిరసన కార్యక్రమానికి తెలంగాణ ఉద్యోగుల సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగులపాటి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులు సెప్టెంబరు 1 తేదీన సామూహిక సెలవు పెడుతున్నట్లు ప్రకటించారని, వారి నిర్ణయాన్ని సమర్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు తమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్ణయించినట్లు తెలిపారు. ఖమ్మంలో ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో నాగరాజు, మీరా, రాధిక, నవీన్ కుమార్, రమణ, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుదిరినట్టే కుదిరి..

వేతన ఒప్పందంపై తేల్చని పదో వేతన కమిటీ సమావేశం

కొత్తగూడెం(సింగరేణి), న్యూస్‌టుడే: దేశంలోని బొగ్గు పరిశ్రమలో పనిచేసే కార్మికుల వేతన ఒప్పందం కొలిక్కి వచ్చినట్లే వచ్చి బెడిసికొట్టడం అందరినీ కలవపర్చింది. మూడు రోజులపాటు రాంచీలో జరిగిన సమావేశం చివరి రోజైన శనివారం రాత్రి జాతీయ కార్మిక సంఘాలు యాజమాన్యంతో ఒక అవగాహనకు వచ్చాయి. కానీ చివరి నిమిషంలో బెడిసికొట్టడంతో ఒప్పందం కుదరలేదు. శనివారం జరిగిన ఒప్పందం దాదాపు ఖాయం అనుకోగా సమీకరణాలు మారాయి. సాయంత్రం దేశంలోని బొగ్గు గని కార్మికులకు 21శాతం మూలవేతనాన్ని, 4శాతం ప్రత్యేక అలవెన్సును పెంచుతూ జేబీసీసీఐ సమావేశం నిర్ణయించింది. రెండు రోజులపాటు జరిగిన చర్చలు మూడో రోజు ఫలితానికి వచ్చాయి. మొదటి కేటగిరీకి గతంలో రూ. 3,519 మినిమం గ్యారంటీ ఇవ్వగా, ఈసారి రూ. 5,148 ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. 4శాతం ప్రత్యేక అలవెన్సు కొనసాగుతుంది. భూగర్భగని అలవెన్సు బేసిక్‌పై గతంలో 12.5శాతం ఉండేది, ఇప్పుడు కూడా 12.5 శాతం పెంచి దానికి 21శాతం కలపనున్నారు. మిగిలిన అలవెన్సులు ప్రస్తుతం ఎలా ఉన్నాయో అదేవిధంగా కొనసాగుతాయి. ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్, హెచ్‌ఎంఎస్(నాలుగు జాతీయ కార్మిక సంఘాలు) ఈ చర్చల్లో పాల్గొన్నాయి. ఒప్పందం కోసం జరిగిన చర్చల్లో పాల్గొన్న నాయకులు ఈ మేరకు ఒప్పంద పత్రాలను తయారుచేస్తుండగా ఇక ఒప్పందం కుదిరినట్లుగా భావించిన జాతీయ కార్మిక సంఘం నాయకులు తిరుగు ప్రయాణ సమయం మించిపోతుండడంతో విమానాశ్రయానికి వెళ్లారు. కొద్దిసేపటికి చర్చలు బెడిసికొట్టడంతో ఒప్పందపత్రాన్ని రాసుకోవడాన్ని నిలిపేశారు. దీంతో ఒప్పందం కుదురుతుందని అనుకొన్న రాజకీయ పార్టీలకు చుక్కెదురైంది. పదోవేతన కమిటీ సమావేశం ఎలాంటి ఒప్పందం లేకుండాలే ముగిసింది.

విద్యార్థులకు మట్టి విగ్రహాల తయారీ పోటీ

కొత్తగూడెం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పర్యావరణంపై అవగాహనను పెంపొందించే ఉద్దేశంతో పాఠశాల విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి హయగ్రీవాచార్య తెలిపారు. ఈ నెల 23న ఉదయం పది గంటలకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో పాల్వంచ ఆశ్రమ పాఠశాలలో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కొత్తగూడెం, పాల్వంచ, ములకలపల్లి, బూర్గంపాడు మండలాల్లోని పాఠశాల విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చన్నారు. విద్యార్థులు తాము సొంతంగా తయారుచేసిన విగ్రహాలను కూడా తీసుకువచ్చి ప్రదర్శనలో పెట్టొచ్చని, పోటీల నిర్వహణ కేంద్రం వద్ద కూడా తయారుచేయవచ్చన్నారు. తయారీకి మట్టి, సహజ రంగులు మాత్రమే వినియోగించాల్సి ఉంటుందని సూచించారు. విజేతలకు బహుమతులతోపాటు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. విద్యార్థులు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9247296012 చరవాణిలో సంప్రదించాలన్నారు.


మణుగూరు మండలం అంజనాపురంలో పునరుద్ధరించిన ఎత్తిపోతల పథకం నుంచి వస్తున్న సాగునీటిని మళ్లిస్తున్న ఆయకట్టు రైతు


సింగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకం నుంచి విడుదల అవుతున్న సాగునీరు


సాగర్ కాలువపై వేంసూరు ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులు

ఆయకట్టుకు ఆసరా అన్నదాతకు భరోసా

ఎత్తిపోతల పథకాలకు పునరుజ్జీవం

కొత్తగా మరికొన్ని..

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే

నిధులు లేక నిర్వహణ కొరవడి మూలన పడిన జల వనరులకు జవజీవాలు అందాయి. ఉభయ జిల్లాల్లో వేల ఆయకట్టుకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకాలకు మహర్దశ చేకూరుతోంది. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో అన్నదాతలకు అవి కల్పతరువులు అయ్యాయి. ఇప్పటికే కొన్ని పథకాలు పూర్తవగా మరికొన్నింటి పనులు వేగిరంగా సాగుతున్నాయి. రెండు జిల్లాల్లో ఎత్తిపోతల పథకాలు, నిధుల మంజూరు, పునరుద్ధరణ, ఒనగూరే ఫలితాలపై 'న్యూస్‌టుడే' కథనం..

మంత్రి తుమ్మల చొరవతో భారీగా నిధులు

నిధులు.. నీళ్లు.. నియామకాల కోసం సాగిన తెలంగాణ ఉద్యమంలో విజయం సాధించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అవతరించిన వెంటనే ఏర్పడిన కేసీఆర్ ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తోంది. ప్రధానంగా సాగునీటి రంగంలో గతంలో ఎదుర్కొన్న అనేక సమస్యలను అధిగమించి ఆకుపచ్చని తెలంగాణ రూపుదిద్దుకునేందుకు సాగునీటి రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మూతపడిన ఎత్తిపోతల పథకాల పునరుజ్జీవనానికి ప్రభుత్వం చేయూత అందించింది. మిషన్ కాకతీయ పథకంలో చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టిన ప్రభుత్వం అదే సమయంలో ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు నిధులు భారీగా కేటాయించింది. టీఎస్ ఐడీసీ (తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ) పరిధిలోని ఎత్తిపోతల పథకాల పునురుద్ధరణకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో భారీగా నిధులు మంజూరు అయ్యాయి.

మూలన పడిన వాటికి మహర్దశ

సుమారు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఎత్తిపోతల పథకాలు గత కొన్నేళ్లుగా పనిచేయక మూత పడ్డాయి. పైపులైన్లు, పంపులు దెబ్బతినటం, మోటార్లు మరమ్మతులకు గురవటం, వాల్వ్‌లు పనిచేయకపోవటం వంటి పలు సాంకేతిక సమస్యల వల్ల పూర్వ ఖమ్మం జిల్లాలోని అనేక ఎత్తిపోతల పథకాలు మూతపడ్డాయి. దీంతో వేలాది ఎకరాల ఆయకట్టుకు నీరందక రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొంది. కొద్దిపాటి మరమ్మతులు అయితే ఆయకట్టు రైతులు సొంత ఖర్చులతో మరమ్మతులు చేసుకుంటారు. కానీ ఇతరత్రా సాంకేతిక సమస్యలను రైతులు పరిష్కరించుకోలేని పరిస్థితి ఉంటుంది. జిల్లాలోని ఎత్తిపోతల పథకాలపై అవగాహన కలిగిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఐడీసీ అధికారులతో సమీక్షించి నివేదిక తెప్పించుకుని వాటి మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. ప్రధానంగా జిల్లాలోని సాగర్ కాలువపై 17 ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.40.46 కోట్లు మంజూరు అయ్యాయి. వీటితోపాటు కొత్తగా మరికొన్ని ఎత్తిపోతల పథకాలు గత మూడేళ్లలో నిర్మించి కొత్త ఆయకట్టును సాగులోకి తెచ్చారు. కొన్ని ఎత్తిపోతల పథకాలు ప్రారంభించగా.. మరికొన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు మారుమూల అటవీ ప్రాంతంలోని ఆళ్లపల్లి, సింగిరెడ్డిపల్లి, మోతె, పాములపల్లి ఎత్తిపోతల పథకాలు సిద్ధం అయ్యాయి. టీఎస్ ఐడీసీ ఖమ్మం కార్యాలయం పరిధిలో పూర్వ ఖమ్మం జిల్లాలో కేవలం నలుగురే ఇంజినీరింగ్ అధికారులున్నారు. అయినా అవిభక్త ఖమ్మం జిల్లాలో ఎత్తిపోతల పథకాల నిర్మాణం, పునరుద్ధరణ పనులు నిర్దేశిత లక్ష్యం మేరకు చేయిస్తున్నారు.

వ్యవసాయానికి ప్రభుత్వం ఉచిత విద్యుత్తు రైతులకు అందిస్తోంది. అయితే రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్తుకు అయిన ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు పంపిణీ సంస్థలకు ప్రతి ఏటా జమ చేయాల్సి ఉంటుంది. వ్యవసాయ విద్యుత్తు వాడకంలో 1 నుంచి 70 అశ్వశక్తి మోటార్ల సామర్థ్యం వరకు ఎల్‌టీ (లో టెన్షన్) తీగలపై సరఫరా చేస్తారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర స్థాయిలోనే విద్యుత్తు వినియోగం లెక్కించి అందుకు తగిన సొమ్ము విద్యుత్తు పంపిణీ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుంది.

ఎత్తిపోతల పథకాల్లోనూ 70 అశ్వశక్తి నుంచి ఆపైన సామర్థ్యం కలిగిన మోటార్లు వినియోగించే పథకాలున్నాయి. ఈపథకాలకు హెచ్‌టీ(హై టెన్షన్) లైన్లు ప్రత్యేకంగా వేసి విద్యుత్తు సరఫరా చేస్తారు. హెచ్‌టీ విద్యుత్తు కనెక్షన్లు కలిగిన పథకాలకు మీటర్లు బిగించి ప్రతి నెల విద్యుత్తు వినియోగాన్ని లెక్కించి బిల్లులు పంపుతారు. ఇలా వచ్చే విద్యుత్తు బిల్లులు టీఎస్ ఐడీసీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు పంపిణీ సంస్థలకు చెల్లిస్తుంది. ఇలాంటి పథకాలకు విద్యుత్తు బిల్లుల చెల్లింపులు ఇలా ఉన్నాయి...

ఖమ్మం జిల్లాలో 21 ఎత్తిపోతల పథకాలకు సంబంధించి గతేడాది రబీ సీజన్‌లో రూ.1.02 కోట్లు, గతేడాది ఖరీఫ్ సీజన్‌లో రూ.51 లక్షలు విద్యుత్తు బిల్లులు చెల్లించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 16 ఎత్తిపోతల పథకాలకు సంబంధించి గతేడాది రబీ సీజన్‌లో రూ. 35 లక్షలు, అంతకు ముందు ఖరీఫ్ సీజన్‌లో రూ.38 లక్షలు విద్యుత్తు బిల్లులు చెల్లించారు.

గత ఆర్థిక సంవత్సరంలో రెండు జిల్లాల్లో 37 ఎత్తిపోతల పథకాలకు సంబంధించి విద్యుత్తు బిల్లులు రూ.2.47 కోట్లు చెల్లించారు.

టీఎస్ ఐడీసీ పరిధిలో ఎత్తిపోతల పథకాల వివరాలు...

	ఖమ్మం జిల్లాలో		భద్రాద్రి కొత్తగూడెం	
పథకాలు	సంఖ్య	ఆయకట్టు	సంఖ్య	ఆయకట్టు
మొత్తం	133	46,721	103	18,686
పనిచేస్తున్నవి	40	23,423	66	9,990
పాక్షికంగా పనిచేస్తున్నవి	41	16,321	14	6,550
పనిచేయనివి	52	6,977	23	2,146
	వీటి మరమ్మతులకు రూ.32.41 కోట్లు అవసరం		ఈ పథకాల మరమ్మతులకు రూ.6.50 కోట్లు అవసరం	

2014లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఖమ్మం జిల్లాలో కొత్తగా నిర్మించిన ఎత్తిపోతల పథకాల వివరాలు

మండలం	పథకంపేరు	వ్యయం (రూ.కోట్లలో)	ఆయకట్టు (ఎకరాల్లో)
మధిర	జాలిముడి	3.11	330
పెనుబల్లి	గొల్లగూడెం	0.32	59
మధిర	రామచంద్రాపురం	10.10	1300
మధిర	వంగవీడు-2	1.18	152
చింతకాని	కొదుమూరు-వందనం	28.85	2500
కల్లూరు	కొత్తబోడుమల్లేల	1.13	130
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..			
భద్రాచలం	రాయన్నపేట	5.80	1212
భద్రాచలం	నెల్లిపాక	12.18	1315
పాల్వంచ	గుడిపాడు	8.27	1000
టేకులపల్లి	గొల్లపల్లి	4.73	531
బూర్గంపాడు	మోరంపల్లి బంజర-4	3.19	328
పినపాక	సింగిరెడ్డిపల్లి	19.05	2054
ఆళ్లపల్లి	ఆళ్లపల్లి	10.92	1050
మణుగూరు	పాములపల్లి	11.35	1120
పినపాక	మోతె	10.44	1032
కామేపల్లి	పొన్నేకల్లు	2.40	270
బయ్యారం	చోక్లాతండా	1.42	150
ముల్కలపలి	తిమ్మంపేట	8.94	884

(విభజన అనంతరం రాయన్నపేట, నెల్లిపాక ఎత్తిపోతల పథకాలను ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించారు. బయ్యారం మండలం చోక్లాతండా పథకం మహబూబాబాద్ జిల్లా పరిధిలోకి వెళ్లినా పథకం నిర్మాణం, నిర్వహణ ఖమ్మంలోని ఐడీసీ అధికారులే చూస్తున్నారు.)

ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు నీరందించేందుకు ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఎత్తిపోతల పథకాలు: **సింగిరెడ్డిపల్లి, ఆళ్లపల్లి, పాములపల్లి, మోతె, చోక్లాతండా, తిమ్మంపేట.**

మూలన పడిన పథకాల పునరుద్ధరణకు మంజూరైన నిధుల వివరాలు..

ఖమ్మం జిల్లాలో 26 ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు గత ఏడాది రూ. 46.29 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టిన మరమ్మతు పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ పథకాలు పనిచేయటం వల్ల 12,270 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతుంది. ఇందులో ఖమ్మం జిల్లాలోని నాగార్జునసాగర్ కాలువలపై నిర్మించిన 17 ఎత్తిపోతల పథకాల పూర్తి స్థాయి మరమ్మతులకు రూ. 40.46 కోట్లు కేటాయించారు. ఈ 17 ఎత్తిపోతల పథకాల కింద 16,405 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ పథకాల మరమ్మతు పనులు పూర్తి కావస్తున్నాయి. సాగర్ కాలువలకు నీరు విడుదల అయితే ఈపథకాల ద్వారా ఆయకట్టు రైతులకు సాగు నీరు అందుతుంది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 68 ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు గత ఏడాది రూ.5.03 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈపథకాలు పనిచేయటం వల్ల 5,332 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

పూర్తిస్థాయిలో మరమ్మతులు: విద్యాసాగర్, టీఎస్ ఐడీసీ ఖమ్మం ఈఈ



మూతపడిన పథకాలు మళ్లీ తెరుచుకునేందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం మంజూరు చేయటంతో వాటికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి ఆయకట్టుకు సాగునీటిని అందిస్తున్నాం. అటవీ ప్రాంతాలైన ఆళ్లపల్లి, సింగిరెడ్డిపల్లి, మోతె, పాములపల్లిలో కొత్తగా ఎత్తిపోతల పథకాల నిర్మాణం పూర్తి చేశాం. ఈ సీజన్ నుంచే సాగునీరు అందిస్తాం. ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక సాగర్ కాలువలపై 17 సహా మిగతా ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ పనులు చివరి దశకు చేరుకున్నాయి.



వరద నీటిలో ఉల్లాసం.. ఉత్సాహం

వాజేడు, న్యూస్‌టుడే: వరద నీటితో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న బొగత జలపాతాన్ని తిలకించిన సందర్శకులు ఆనందంతో తన్మయత్వం చెందుతున్నారు. హోరుమనే శబ్దంతో హొయలొలుకుతున్న జలపాతాన్ని తిలకించిన సందర్శకులు పరవశం చెందుతున్నారు. జలపాతంలో ఎగిసిపడుతున్న నీటి తుంపర పర్యాటకులకు కనువిందు చేస్తోంది. మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బొగత జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తోంది. అటవీ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటితో జలపాతం నిండుగా నీటి గుండంలో దూకుతోంది. జలపాతాన్ని తిలకించిన పర్యాటకులు అబ్బురం చెందుతున్నారు. వరద నీటిలో పర్యాటకులు కోలాహలంగా గడుపుతున్నారు. పాల నురుగులా ప్రవహిస్తున్న వరద నీటిలో చిన్నారులు, మహిళలు కేరింతలతో ఉల్లాసంగా గడిపారు. జలపాతం నుంచి వస్తున్న వరదనీటి ఉద్ధృతి ఎక్కువగా ఉండడంతో సమీపంలో ప్రవహిస్తున్న వరద నీటిలోనే పర్యాటకులు గడిపారు.


జలపాతాన్ని తిలకిస్తున్న పర్యాటకులు



TENTH English

PREPOSITIONS

It goes without saying that language is the dress of thought. As such, we express our feelings and thoughts through words. The words we use in a sentence need to be precise, accurate and forceful. So to say, prepositions are such forceful, nay powerful words which govern the entire sentence. Therefore, a thorough practice of using correct prepositions is needed for the learner.



ప్రతిభ

Nithin is fond *of* eating..

A Preposition is a word such as in, on, at or beside that is used before a noun or a noun phrase or a pronoun to show a link with another word or phrase.

★ Study the prepositions under lined in the following sentences:

1. Vaccination protects us <u>from</u> many diseases.
2. A man is known <u>by</u> the company the keeps.
3. Foundation of a house lies <u>below</u> the ground level.
4. Srinidhi has no appetite <u>for</u> sweets.

The words from, by, below and for are prepositions.

Kinds Of Prepositions

Prepositions have different functions: to indicate time, place, movement, direction, means, manner, purpose, source, concession, etc.

Examples: 1. The train arrived <u>on</u> time. (Time)
2. I met Sahithi <u>at</u> the theatre. (Place)
3. Shirisha went to the market <u>for</u> fruits. (Purpose)
4. Rishita drove <u>along</u> the main road in a hurry. (Direction)

A. Simple Prepositions: in ★ on ★ at ★ to ★ for ★ from ★ of ★ off out ★ by ★ till ★ with ★ through, etc.

Study the following sentences and observe the prepositions used in each sentence and note the function of the prepositions given in the brackets.

1. Vaishnavi waited for the doctor <u>till</u> he returned. (Time)
2. Naveen left Boath <u>for</u> Dubai. (Place)
3. <u>Inspite of</u> the hurdles, Kavya succeeded in her efforts. (Concession)

B. Compound Prepositions

about ★ above ★ across ★ along ★ amidst ★ among ★ around ★ before ★ behind ★ below ★ beneath ★ beside ★ between ★ beyond ★ inside ★ out side ★ within ★ with out

Examples: 1. A narrow path ran in <u>between</u> the two houses.
2. The moon moves <u>around</u> the Earth.
3. <u>Inside</u> the box was a diamond studded watch.
4. I cannot allow the work to continue <u>beyond</u> the end of December.

Exercise - 1

✪ *Fill in the blanks with suitable Simple Prepositions.*

1. Nithin is fond .... eating sweets.
2. English is quite different .... Telugu.
3. Malavika fell ... her bicycle and broke her leg.
4. Ashwini drove her car .... the side gate.
5. I'll return your book .... a week.

Exercise - 2

✪ *Fill in the blanks with suitable Compound prepositions.*

1. Apple and banana are .... the most popular fruits.
2. Moiz usually sits .... Saikumar in the class.
3. There is something special .... our Headmaster.
4. A new bridge is being built .... the river.
5. She looks nice .... make-up.

C. Compound Prepositional Phrases

Compound Prepositional Phrases consist of two or more words, such as due to, because of, together with, etc,

Examples:

1. The rowdy was arrested <u>according to</u> IPC 420.
2. I cannot see the film because a tall man is sitting <u>infront of</u> me.
3. Vijayendra Prasad goes to school <u>along with</u> Vamsi Krishna daily.
4. Ring the alarm bell <u>in case of</u> emergency.

✪ *Study the following compound Prepositional Phrases and note the meanings given to each of them*

Comp.Prep.Phrases	Meanings
along with	together with
on account of	because of
by means of	through the agency of
apart from	separate from
ahead of	earlier than something/ somebody
in front of	located before
in place of	as a substitute for
inspite of	disregarding the difficulty
in case of	in the event of
by way of	via
due to	on account of
for the sake of	for the good of
in addition to	added to
in accordance with	in agreement with

Examples: The thief entered the house <u>by means of</u> a broken window.
2. Shruthi attends special classes on Sundays <u>in addition to</u> regular practice.
3. We postponed our trip to Ramoji Film City <u>due to</u> bad weather.
4. <u>Inspite of</u> being rich, my neighbour is not happy.

Exercise - 3

✪ *Fill in each blank with the correct Compound Prepositional Phrases from those given under each sentence.*

1. .... his injury, Umesh will play in Sunday's match.
   a) Due to b) For the sake of c) In spite of
2. He sent me some flowers .... an apology.
   a) by way of b) in case of c) apart from
3. Is there parking space .... the hotel?
   a) ahead of b) in front of c) along with
4. She lost her way when she went into the jungle .... firewood.
   a) for the sake of b) in addition to c) in search of

Answers

Ex-1: 1) of 2) from 3) off 4) through 5) in
Ex-2: 1) among 2) beside 3) about 4) across 5) without
Ex-3: 1-c 2-a 3-b 4-c.



రచయిత
డి.నారాయణ,
విషయ నిపుణులు

జనరల్ స్టడీస్
ఫిజిక్స్

గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?

1. ఒక వాహనం తన ప్రయాణ దూరంలోని మూడు సమ దూరాలను వరుసగా 80, 60, 30 కి.మీ. / గంట వేగంతో ప్రయాణిస్తే దాని సగటు వేగం ఎంత? (కి.మీ./గంటల్లో)
1) 60 2) 50 3) 48 4) 24

2. ఖగోళశాస్త్రంలో 'పార్‌సెక్' దేనికి ప్రమాణం?
1) దూరం 2) కాలం 3) వేగం 4) పౌనఃపున్యం

3. ట్రాన్స్‌ఫార్మర్ మార్చలేని AC విద్యుత్‌కి సంబంధించిన అంశం?
1) వోల్టేజీ 2) కరెంట్ 3) పౌనఃపున్యం 4) పైవన్నీ

4. భూస్థావర (జియోస్టేషనరీ) ఉపగ్రహం భూమి కేంద్రం నుంచి సుమారు ఎంత ఎత్తులో ఉంటుంది?
1) 36000 కి.మీ. 2) 6,400 కి.మీ.
3) 21,000 కి.మీ. 4) 42,400 కి.మీ.

5. రేడియో రిసీవర్లలో ఉపయోగించే వలయం ఏది?
1) శుద్ధ నిరోధ వలయం 2) LC - ట్యాంక్ వలయం
3) శుద్ధ ప్రేరక వలయం
4) శుద్ధ కెపాసిటర్ వలయం

6. టెఫ్లాన్ పూత పూసిన లోహ పరికరాలను ఉపయోగించి అధిక వోల్టేజీ విద్యుత్ ప్రసారాలను నిలిపివేయకుండానే వాటిని తీసుకుని వెళ్లే తీగలను ముట్టుకుంటారు. ఎందుకంటే టెఫ్లాన్ ఒక...
1) విద్యుత్ బంధకం 2) అర్ధ వాహకం
3) విద్యుత్ వాహకం 4) అతివాహకం

7. గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?
1) పీడనం 2) ఆర్ద్రత
3) గాలి (పవన) వేగం 4) ఉష్ణోగ్రత

8. ప్రతిపాదన **(A):** పాలీవినైల్ క్లోరైడ్‌తో తయారైన రెయిన్ కోట్లను వర్షం నీరు తడపదు.
కారణం **(R):** పాలీవినైల్ క్లోరైడ్, నీటి మధ్య స్పర్శ కోణం 90° కంటే ఎక్కువ.
1) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ.
2) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ కాదు.
3) A, R రెండూ సరైనవి కావు.
4) A సరైంది. కానీ, R సరైంది కాదు.

9. శక్తి నిత్యత్వ నియమానికి ప్రతిరూపం -
1) లెంజ్ నియమం
2) ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం
3) కిర్కాఫ్ రెండో నియమం 4) పైవన్నీ

10. శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
1) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు ఘన పరిమాణం శూన్యం అవుతుంది.
2) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు పీడనం శూన్యం అవుతుంది.
3) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను పొందడం అసాధ్యం.
4) పైవన్నీ సరైనవే

11. కేంద్రక బలాలు....
1) ఆకర్షణ బలాలు 2) స్వల్ప అవధి బలాలు
3) అత్యంత బలమైన బలాలు 4) పైవన్నీ

12. రాకెట్ ఏ సూత్రం ఆధారంగా పని చేస్తుంది?
1) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
2) శక్తి నిత్యత్వ నియమం
3) ద్రవ్యవేగ నిత్యత్వ నియమం 4) పైవన్నీ

13. ఉష్ణశక్తిని విద్యుత్‌శక్తిగా మార్చేది ఏది?
1) థర్మోకపుల్ 2) ఎలక్ట్రిక్ హీటర్
3) ఎలక్ట్రిక్ బల్బు 4) ఫొటో సెల్

14. స్వేచ్ఛగా కిందపడే వస్తువు...
1) మొత్తం యాంత్రిక శక్తి స్థిరం
2) స్థితిజ శక్తి క్రమంగా పెరుగుతుంది



రచయిత
డి. అనంత రామకృష్ణ
విషయ నిపుణులు

3) గతిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
4) 1, 3

15. ఎత్తయిన ప్రదేశం (విమానం) నుంచి చూస్తే ఇంద్రధనస్సు ఏ ఆకారంలో కనిపిస్తుంది?
1) అర్ధ వృత్తం 2) వృత్తం
3) పరావలయం 4) ఏదీకాదు

16. 40°C వద్ద ఉన్న 500 మి.లీ. నీటిని అంతే పరిమాణంలో, 70°C వద్ద ఉన్న నీటికి కలిపితే ఫలిత ఉష్ణోగ్రత విలువ ఎంత?
1) 110° C 2) 55°C 3) 40°C 4) 65°C

17. ఒక వ్యక్తికి సరైన దృష్టి కోసం డాక్టర్ +2D కటకం వాడమని సలహా ఇచ్చారు. అది ఏ రకమైన కటకం? దాని నాభ్యాంతరం ఎంత?
1) కుంభాకార, 100 సెం.మీ.
2) పుటాకార, 10 సెం.మీ.
3) కుంభాకార, 50 సెం.మీ.
4) పుటాకార, 50 సెం.మీ.

18. కాంతి విరళ యానకం నుంచి సాంద్రతర యానకంలోకి ప్రసరిస్తే, దాని తరంగదైర్ఘ్యం (λ), పౌనఃపున్యం (υ) విలువలు ఏ విధంగా ఉంటాయి?
1) λ, υ రెండూ పెరుగుతాయి
2) λ పెరుగుతుంది, υ స్థిరం
3) λ తగ్గుతుంది, υ స్థిరం
4) λ, υ రెండూ తగ్గుతాయి

19. వస్తువు గతిజ శక్తి వేటిపై ఆధారపడుతుంది?
1) ద్రవ్యరాశి, ఎత్తు 2) వేగం, కాలం
3) ఎత్తు, త్వరణం 4) ద్రవ్యరాశి, వేగం

20. సమ వేగంతో వెళ్లే వస్తువు ....
1) చలన దిశ స్థిరం, వడి అస్థిరం
2) వడి స్థిరం, చలన దిశ అస్థిరం
3) వడి, చలన దిశ రెండూ అస్థిరం
4) వడి, చలన దిశ రెండూ స్థిరం

21. మానవుడి గుండె సగటున నిమిషానికి 75 సార్లు కొట్టుకుంటుంది. అయితే దాని స్పందన పౌనఃపున్యం ఎంత? (హెర్ట్జ్‌లలో)
1) 1.25 2) 3.25 3) 4.25 4) 2.25

22. R నిరోధం ఉన్న n నిరోధాలను సమాంతరంగా కలిపితే, ఫలిత నిరోధం...
1) nR 2) n^2 R 3) $\frac{R}{n^2}$ 4) $\frac{R}{n}$

23. వర్షాకాలంలో రోడ్లపై నూనె పొరలు రంగుల్లో కనిపించడానికి కారణం?
1) ధ్రువణం 2) వ్యతికరణం
3) పరిక్షేపణం 4) విక్షేపణం

24. పౌనఃపున్య మాడ్యులేషన్‌లో (FM) వాహక తరంగం పౌనఃపున్యం దేనికి అనుగుణంగా మారుతుంది?
1) సంకేత తరంగ తక్షణ పౌనఃపున్యం
2) సంకేత తరంగ తక్షణ దశ
3) సంకేత తరంగ తక్షణ కంపన పరిమితి
4) సంకేత తరంగ తక్షణ వేగం

25. నక్షత్రం నుంచి వెలువడే కాంతి క్రమంగా ఎరుపు రంగుకి మారితే, అది దేన్ని సూచిస్తుంది?
1) నక్షత్రం భూమి వైపు రావడాన్ని
2) నక్షత్రం విరామ స్థితిలో ఉండటాన్ని
3) నక్షత్రం భూమికి దూరంగా వెళ్లడాన్ని
4) నక్షత్రం ఉష్ణోగ్రత క్రమంగా తగ్గడాన్ని

జవాబులు

1-3	5-2	9-4	13-1	17-3	21-1	25-3
2-1	6-1	10-4	14-4	18-3	22-4	
3-3	7-1	11-4	15-2	19-4	23-2	
4-4	8-1	12-3	16-2	20-4	24-1	

కరెంట్ అఫైర్స్

ప్రతిభ



క్రీడలు టెస్ట్ సిరీస్ నెగ్గిన భారత్ ఆగస్టు 14

శ్రీలంకలో శ్రీలంకతో జరిగిన మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 3-0 తో క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లి సేన ఘనత సాధించింది. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా శిఖర్ ధావన్ నిలిచాడు.

జీవించదగిన అత్యుత్తమ నగరం ఏది..?

జాతీయం

ఆగస్టు 13: కీలక బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బాధ్యతలు చేపట్టిన మూడు వారాల్లో ఆరు కీలక బిల్లులపై సంతకాలు చేశారు. ఆయన ఆమోదం లభించడంతో ఇకపై అవి చట్టాలుగా రూపుదాల్చనున్నాయి.

★ బ్రిటిష్ కాలంనాటి రెండు చట్టాల స్థానంలో రూపొందించిన ది అడ్మిరాలిటీ (పరిధి, మారిటైమ్ క్లెయిమ్‌ల చెల్లింపు) బిల్లు; బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు (సవరణ) బిల్లు; జమ్మూ-కశ్మీర్‌కు వర్తించే గణాంకాల సేకరణ (సవరణ) బిల్లు; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) బిల్లు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (సవరణ) బిల్లు; ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ బిల్లులపై రామ్‌నాథ్ సంతకాలు చేశారు.

ఆగస్టు 14: భారతీయ భాషల్లో గూగుల్ వాయిస్ సెర్చ్

టెక్నాలజీ దిగ్గజ సంస్థ గూగుల్ తన వాయిస్ సెర్చ్ ఫీచర్‌కు కొత్తగా 8 భారతీయ భాషలను జోడించింది. ఇప్పటి వరకు హిందీ, ఇంగ్లిష్ భాషల్లోనే గూగుల్ వాయిస్ సెర్చ్ సౌలభ్యం అందుబాటులో ఉంది. ఇప్పుడు తెలుగు, బెంగాలీ, మలయాళం, తమిళం, గుజరాతీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ భాషల్లోనూ దీన్ని అందించనున్నామని సంస్థ తెలిపింది.

★ గూగుల్ యాప్‌లో వాయిస్ సెట్టింగ్స్‌లో కావాల్సిన భాషను ఎంచుకోవాలని సూచించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 149 భాషలకు ఈ వెసులుబాటు ఉంది.

ఆగస్టు 15: 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

దేశవ్యాప్తంగా 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆధార్ నుంచి అంతరిక్షం దాకా అన్ని అంశాలను స్పృశించారు.

★ 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2022 నాటికి ప్రతి పేద వ్యక్తికి పక్కా ఇల్లు నిర్మించేలా పని చేయాలని పిలుపునిచ్చారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, నల్లధనంపై కొరడా సహా తన ప్రభుత్వం చేపట్టిన అనేక సంస్కరణలు, పథకాలను ప్రస్తావించారు. స్వాతంత్ర్య సాధన కోసం 'భారత్ ఛోడో' అని నినదించినట్లు ఇప్పుడు 'భారత్ జోడో' నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

★ సమష్టి సంకల్ప శక్తి ద్వారా 2022 నాటికి స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేసే దిశగా నవభారతాన్ని ఆవిష్కరించాలని మోదీ పేర్కొన్నారు.

★ ప్రధాని హోదాలో మోదీ చేసిన నాలుగు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల్లో ఇదే అత్యంత చిన్న ప్రసంగం (సుమారు 56 నిమిషాలు) కావడం విశేషం.

ఆగస్టు 16: రికార్డు స్థాయిలో ఆహారధాన్యాల ఉత్పత్తి

గత జూన్‌తో ముగిసిన 2016-17 పంట సంవత్సరంలో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 27.56 కోట్ల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అంచనా వేసిన దానికంటే 20.30 లక్షల టన్నులు అధిక దిగుబడి వచ్చినట్లు పేర్కొంది.

★ 2015-16 (జులై - జూన్)లో 25.17 కోట్ల టన్నుల దిగుబడి వచ్చింది. 2013-14 లో వచ్చిన 26.50 కోట్ల టన్నుల దిగుబడే ఇంతవరకు రికార్డు.

★ వరి దిగుబడులు 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు, గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, తృణధాన్యాలు 3.85 కోట్ల టన్నుల నుంచి 4.41 కోట్ల టన్నులకు, పప్పుధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగాయి.

★ కంది, మినపప్పుల దిగుబడులు చాలా బాగుండటం గమనార్హం. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది.



ఆగస్టు 17: అమెరికా నుంచి అపాచీ హెలికాప్టర్లు

సైన్యం కోసం అమెరికా నుంచి ఆరు అధునాతన అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన దిల్లీలో సమావేశమైన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. రూ.4,168 కోట్ల విలువైన ఈ ప్రతిపాదన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. దీనికి తోడు అధునాతన గ్రిగోరివిచ్ శ్రేణి స్టైల్త్ యుద్ధనౌకలకు రూ.490 కోట్లతో రెండు జోర్యా గ్యాస్ టర్బైన్ ఇంజిన్లు కొనుగోలు చేయడానికి కూడా డీఏసీ ఆమోదం తెలిపింది

అంతర్జాతీయం

ఆగస్టు 12: కెన్యా అధ్యక్షుడిగా మళ్లీ ఉహురు కెన్యట్టా



ఆఫ్రికా దేశమైన కెన్యా అధ్యక్షుడిగా ఉహురు కెన్యట్టా రెండోసారి ఎన్నికయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో 54.27 శాతం ఓట్లు దక్కించుకున్న కెన్యట్టా విజయం సాధించినట్లు కెన్యా ఎన్నికల సంఘం ప్రకటించింది.

★ ప్రతిపక్ష నేత రైలా ఓడింగా 44.74 శాతం ఓట్లు పొందారు. అయితే ఎన్నికలు సక్రమంగా జరగలేదని, రిగ్గింగ్, ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందని ఓడింగా ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులు నిర్వహించిన ఆందోళనలు హింసాత్మకంగా మారి, 11 మంది మరణించారు.

ఆగస్టు 14: కలరా బారిన యెమన్

యెమన్‌లో కలరా విజృంభిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. 2017 ఏప్రిల్ నుంచి 5 లక్షలకుపైగా ప్రజలు దీని బారినపడగా 1975 మంది మృతి చెందినట్లు పేర్కొంది.

వార్తల్లో ప్రదేశాలు

ఆగస్టు 14:

హైదరాబాద్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు

ప్రపంచ పారిశ్రామికవేత్తల (వ్యవస్థాపకుల) వార్షిక శిఖరాగ్ర సదస్సును 2017 నవంబరు 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ హాజరుకానున్నారు. అగ్ర రాజ్యమైన అమెరికా ఈ సదస్సును నిర్వహిస్తుండటం విశేషం.


ఆగస్టు 16: అత్యుత్తమ నగరంగా మెల్‌బోర్న్

ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ రూపొందించిన గ్లోబల్ లివబిలిటీ నివేదిక ప్రకారం ప్రపంచంలో జీవించదగిన అత్యుత్తమ నగరంగా ఆస్ట్రేలియా రాజధాని మెల్‌బోర్న్ ప్రథమస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో వియన్నా (ఆస్ట్రియా), వాంకోవర్ (కెనడా) ఉన్నాయి.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

ఆగస్టు 17:

స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలు



తెలుగు రాష్ట్రాల్లోని 35 ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు ఎంపికయ్యాయి. దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల నుంచి 172 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికకాగా వీటిలో 35 పాఠశాలలు తెలుగు రాష్ట్రాలకు చెందినవి కావడం విశేషం (ఏపీ నుంచి 21, తెలంగాణ నుంచి 14 ప్రభుత్వ పాఠశాలలు).

★ స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్రం ఈ పురస్కారాలను అందిస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు ఉన్న సౌకర్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం వీటిని ప్రకటించింది.

★ తమిళనాడు నుంచి అత్యధికంగా 25 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికయ్యాయి. అత్యుత్తమ ఆరోగ్య-పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్న ఒక్కో పాఠశాలకు రూ.50 వేల చొప్పున నగదు బహుమతి అందిస్తారు.

రాష్ట్రీయం - తెలంగాణ

ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

తెలంగాణ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించి, అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఏడాది కొత్తగా 84,876 ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు కేసీఆర్ చెప్పారు.

★ 1936 లో నిజాం కాలంలో భూసర్వే జరిగిందని, ఆ తర్వాత మళ్లీ తమ ప్రభుత్వమే సమగ్ర భూ సర్వేను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బడ్జెట్‌లో సింహభాగాన్ని సంక్షేమానికే వెచ్చిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేందుకు నడుం బిగించినట్లు చెప్పారు.

★ 2016-17 ఆర్థిక సంవత్సరంలో 21.7 శాతం ఆదాయ వృద్ధి రేటుతో తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్

ఆగస్టు 15: తిరుపతిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిరుపతిలోని తారకరామ మైదానంలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టుల కోసం రూ.43 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల పింఛనును రూ. 7 వేల నుంచి రూ. 15 వేలకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. 2019 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ప్రకటించారు.

పురుషోత్త పట్నం ఎత్తిపోతల ప్రారంభం

✪ గోదావరి నదిని ఏలేరుతో అనుసంధానించే పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

ఆగస్టు 16: ఐయూఐహెచ్ శంకుస్థాపన

రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మక ఇండో-యూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఐయూఐహెచ్), అమరావతి మెడిసిటీ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుపై ఐయూఐహెచ్ రూ.1600 కోట్లు వెచ్చించనుంది.

సిద్దిపేటకు ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రం

✪ అభివృద్ధి, సంస్కరణలతో దూసుకెళ్తున్న సిద్దిపేట పురపాలిక మరో ఘనత సాధించింది. ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రానికి ఎంపికై, రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి పురపాలికగా నిలిచింది.

ఆగస్టు 16: తెలంగాణ పదాలతో నిఘంటువు

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణ ప్రజల భాష, యాస చిరకాలం ఉండేలా లక్ష పదాలతో నిఘంటువు తయారీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అరుదైన పదాలన్నింటినీ సేకరించి అక్షరబద్ధం చేయాలనేది ప్రణాళిక. పదాల అన్వేషణకు ఆచార్య రాజేశ్వర్ శర్మ, కట్టా శేఖర్ రెడ్డి, రవ్వా శ్రీహరి, మంటా చక్రపాణి, డాక్టర్ నలిమెల భాస్కర్‌లతో కమిటీ ఏర్పాటు చేశారు.

'ఓడీఎఫ్'గా హైదరాబాద్

✪ హైదరాబాద్ మహా నగరాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా (ఓడీఎఫ్) ప్రకటిస్తూ జీహెచ్ఎంసీ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది.

వార్తల్లో వ్యక్తులు

ఆగస్టు 11:

సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్ ప్రసూన్ జోషి



సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్‌గా కవి, పద్మశ్రీ ప్రసూన్ జోషి నియమితులయ్యారు. వచ్చే మూడేళ్ల కాలానికి ప్రసూన్ ఈ పదవిలో కొనసాగుతారు. పహ్లాజ్ నిహ్లానీ స్థానంలో ప్రసూన్ నియమితులయ్యారు. సెన్సార్ బోర్డు సభ్యులుగా విద్యాబాలన్, గౌతమి, జీవిత తదితరులు నియమితులయ్యారు.

✪ నాటి తరం పరుగుల వీరుడు మిల్కాసింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సౌహార్ద రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి డబ్ల్యూహెచ్ఓ ఆయన్ను ఎంపిక చేసింది.

ఆగస్టు 14:

ఎంతోమంది పేదలకు ఉచిత వైద్య సేవలు అందించి, డాక్టర్ 'దీదీ'గా ప్రఖ్యాతిగాంచిన భక్తియాదవ్ (91) ఇండోర్‌లో మరణించారు. మధ్యప్రదేశ్ తొలి మహిళా వైద్యురాలిగా గుర్తింపు పొందిన భక్తియాదవ్ గైనకాలజిస్టుగా అందించిన సేవలకు కేంద్రం పద్మశ్రీతో సత్కరించింది.

అవార్డులు

ఆగస్టు 14:

శంకర్‌రావుకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

కేంద్ర ప్రభుత్వం 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల్లో ప్రతిభావంతమైన సేవలు అందించిన 990 మందికి అత్యున్నత పోలీసు పతకాలు ప్రకటించింది. వామపక్ష తీవ్రవాదులతో జరిగిన పోరులో ప్రాణాలర్పించిన ఛత్తీస్‌గఢ్ పోలీసు జవాను కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకాన్ని ప్రకటించారు. కీర్తిచక్ర పురస్కారాన్ని ఐదుగురికి ప్రకటించారు. హవల్దార్ గిరిష్ గురుంగ్, మేజర్ డేవిడ్ మన్లుం, కమాండెంట్ ప్రమోద్ కుమార్ మరణానంతరం కీర్తిచక్రకు ఎంపికయ్యారు. మిగిలిన ఇద్దరిలో మేజర్ ప్రీతం సింగ్ కున్వార్, చేతన్ కుమార్ చీతా ఉన్నారు.



రచయిత
- సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు



ఎదుటివారిని చూసి ప్రేమ పూర్వకంగా నవ్వగలిగితే అదే మనం వారికిచ్చే అందమైన బహుమతి

– మదర్ థెరెసా

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Produce = ఉత్పత్తిచేయు
- మధుకరం = తుమ్మెద


సరదా పదాలు

ఆధారాలతో తెలుగు పదాలు రాయండి

1. Summer	వే	☐☐
2. Flute	వే	☐☐
3. Speed	వే	☐☐
4. Heat	వే	☐☐
5. Pay	వే	☐☐
6. God	వే	☐☐
7. Function	వే	☐☐
8. Dawn	వే	☐☐


- డీ దయామతి, హన్మకొండ

దారేది?



చుట్టూ జంతువులు... మధ్యలో మనం!

హాయ్ నేస్తాలూ! బాగున్నారా? నేనీమధ్య ఓ జూ కాని జూకెళ్లొచ్చా. ఊపిరి బిగబట్టుకుని కాలం గడిపొచ్చా. తలుచుకుంటేనే ఈ పర్యటన ఎంతో వింతగా.. గమ్మత్తుగా.. అనిపిస్తోంది. ఆ భలే భలే విశేషాలన్నీ మీతో పంచుకోకుంటే ఎలా? అందుకే ఇలా వచ్చేశా.







చుట్టూ పులులు తిరుగుతుంటే మధ్యలో కూర్చుని భోజనం చేశా. సింహం దగ్గరగా వస్తుంటే కాలు మీద కాలేసుకుని ఐస్‌క్రీంలు తింటూ ఆనందించేశా. జంతువులన్నీ భయంకరంగా అరుస్తుంటే రాత్రివేళ మెత్తని పక్కపై పడుకుని ఓ కునుకేసేశా. 'కోతల రాయుడు కోతలు కోస్తున్నాడు. అన్నీ అబద్ధాలే' అనుకుంటున్నారా? అదేం కాదు. ఇదంతా నిజంగా నిజమే.

* మామూలుగా మనం ఎప్పుడైనా జూకి వెళ్లామనుకోండి. జంతువులన్నీ బోనుల్లో ఉంటాయి. మనం బయట స్వేచ్ఛగా తిరుగుతూ వాటిని చూస్తుంటాం. అంతేకదూ!

* మరి నేనెళ్లిన చోటు మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. యూకేలోని కెంట్ దగ్గరుందిది.

* ఓ అద్దాల ఇంట్లో తలుపులేసుకుని నేనుంటే ఆ బయట అంతా పులులు, బోలెడు అడవి జంతువులూ తిరుగుతున్నాయి. లోపల నుంచి దగ్గరగా వాటిని చూస్తూ నేను ఆనందించేసానన్నమాట. ఒక్కసారైతే నేనున్న అద్దం దగ్గరకి పెద్ద పులి వచ్చేసింది. అప్పుడు చాలా భయమేసి పక్క గదిలో ఉన్న అమ్మ దగ్గరికి పరిగెట్టేశా.

* అసలు ఈ చోటు ఏంటంటే..? ఇదో సఫారీ. మొత్తం 600 ఎకరాల్లో చిక్కగా చెట్లుంటాయి. వాటిలో రకరకాల జంతువులు స్వేచ్ఛగా తిరుగుతుంటాయి.

* మామూలుగా సఫారీల్లో వీటిని చూసేందుకు మనల్ని జీపుల్లాంటివాటిపై ఎక్కించుకుని తిప్పి తీసుకొస్తారంతే. ఇక్కడ అదొక్కటే కాకుండా అద్దాలతో ఉన్న ఓ చక్కని ఇల్లుంది. దాంట్లో రెండు పడకగదులు, వంటిల్లు, హాలూ ఉన్నాయి. ఎవరైనా అద్దెకు తీసుకుని కొన్ని రోజులక్కడ బస చేయొచ్చు. నాలా వింత అనుభవాల్ని ఆస్వాదించొచ్చు. కావాలంటే మీరూ ఓసారి వెళ్లిరండి మరి. బైబై.

నవ్వుల జల్లులు!

టీచర్: రాముా! ఎన్ని సార్లు పిలుస్తున్నా పలకవేంటి?

రాము: మీరే కదా టీచర్ అనవసరమైన విషయాలు పట్టించుకోవద్దన్నారు!

టీచర్: 30 + 30 ఎంత అవుతుంది?

రఘు: ఆరు టీచర్...

టీచర్: కాస్త బుర్ర పెట్టి చెప్పు!

రఘు: నా జవాబు సరైనదే టీచర్. 0కి విలువ లేదని మీరే కదా చెప్పారు!

- బరాటం రామారావు, నిజామాబాద్

చిలిపి ప్రశ్న


నీళ్లు ఎందుకు తాగుతాం?

- జీ రమేష్, పెనుబర్తి

ఏది భిన్నం?







పరివర్తన

కథ

'నాన్నా! రేపు మా తరగతిలోని పిల్లలంతా పరీక్ష ఫీజు చెల్లించాలని హెడ్మాస్టారు చెప్పారు.' ఇంట్లోకి అడుగు పెడుతూనే అన్నాడు రఘు.

అప్పుడే కూలి పని ముగించుకుని ఇంటికి వచ్చిన కేశవులు కొడుకు మాటలు విని 'అలాగా! ఫీజు ఎంతేమిటి?' అని అడిగాడు.

రెండు వందలని మెల్లగా చెప్పాడు రఘు.

'అవునా! రెండు వందలా? ఈ సారి బాగా పెంచేశారే! సర్లే. రేపు బడికి వెళ్లేప్పుడు ఇస్తాలే' అంటూ పెరట్లోకి నడిచాడు కేశవులు.

మరుసటి రోజు ఉదయం రఘు బడికి వెళ్లేందుకు తయారవుతుండగా కేశవులు అతని వద్దకి వచ్చి 'ఇదిగోరా రెండు వందలు. జాగ్రత్త మరి. వెళ్లగానే టీచరుకి ఇవ్వు'. అంటూ జేబులో డబ్బులు పెట్టాడు. 'సరే నాన్నా!' అంటూ బయటకు నడిచాడు రఘు. రఘు కాస్తంత దూరం నడవగానే అతని స్నేహితుడు అమర్ ఎదురయ్యాడు.


'ఏరా మీ నాన్న ఫీజు డబ్బులిచ్చారా?' ఆత్రుతగా అడిగాడు అమర్.

'ఇచ్చార్రా. మరి మీ నాన్నా?' అమర్ కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగాడు రఘు.

'నేను ఫీజు రెండు వందల యాభై రూపాయలని చెబితే మారు మాట్లాడకుండా ఇచ్చేశార్రా మానాన్న' గొప్పగా చెప్పాడు అమర్.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే వాళ్లు చెల్లించవలసిన ఫీజు వంద రూపాయలే. తమ తల్లిదండ్రుల నుంచి ఎక్కువ డబ్బు తీసుకుని, వాటితో సినిమాకి వెళ్లాలని పథకం వేసుకున్నారు రఘు, అమర్. ఇద్దరిదీ ఒకే తరగతి. ఒకే బెంచీలో కూర్చుంటారు. కలసి తిరుగుతుంటారు. తల్లిదండ్రుల్ని నమ్మించి భలేగా డబ్బులు తీసుకున్నామని ఇద్దరూ మురిసిపోయారు. చెరో వంద వారి తరగతి ఉపాధ్యాయుడికి ఫీజు చెల్లించారు.

మరునాడు ఆదివారం కావడంతో ఇద్దరూ ఆడుకోవడానికి వెళుతున్నామని చెప్పి టౌనుకు బయలుదేరారు. సినిమా చూసి, ఆ తర్వాత మిఠాయి దుకాణానికి వెళ్లి తమకు ఇష్టమైన తినుబండారాలెన్నో కొనుక్కుని తిన్నారు. ఆనందంగా గడిపారు. చీకటి పడే వేళకు ఇంటికి చేరుకున్నారు. రఘు ఆట నుంచి ఇంటికి వస్తున్నట్లుగా నమ్మించేందుకు ఒక క్రికెట్ బ్యాటు చేతిలో పట్టుకుని



మెల్లగా ఇంట్లోకి అడుగు పెట్టాడు. అదే సమయంలో పక్క గదిలో తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్న మాటలు విని ఆగిపోయాడు. కిటికీలోంచి లోపలికి చూశాడు. మంచం మీద కేశవులు జ్వరంతో వణికిపోతూ ఉన్నాడు. అతని భార్య సపర్యలు చేస్తూ 'వచ్చిన కూలి డబ్బులన్నీ పిల్లాడి ఫీజు కోసం ఇచ్చేశావు. మందులు తెద్దామంటే ఇంట్లో రూపాయి కూడా లేదు' అంది. అందుకు కేశవులు 'సమయానికి ఫీజు కట్టకపోతే రఘును పరీక్షలకు అనుమతించరు. నాకు మామూలు జ్వరమేగా వచ్చింది. రేపటికి తగ్గిపోతుందిలే' అన్నాడు మూలుగుతూ.

'అలా అంటే ఎలా? నేను పక్కింటి వాళ్ల దగ్గరకెళ్లి ఓ యాభై రూపాయలు అడిగి మందులు కొని తెస్తాను' అంటూ లేవబోయిన ప్రమీల చేయి పట్టుకుని ఆపి 'నా మాట విను రేపు చూద్దాంలే. ఇప్పుడు అప్పు చేయడం ఎందుకు?' అన్నాడు కేశవులు.

అదంతా చూస్తున్న రఘుకు బాధగా అనిపించింది. తన విలాసాల కోసం ఖర్చు చేసిన ఆ వంద రూపాయలు ఎంత విలువైనవో తెలిసి వచ్చింది. అదీగాక రోజు వారీ కూలికి వెళ్లి డబ్బు సంపాదించే తన తండ్రి శ్రమ విలువను అర్థం చేసుకోలేకపోయానని బాధపడ్డాడు. తన ఫీజు కోసం ఉన్న డబ్బులన్నీ ఇచ్చిన తండ్రి మంచితనాన్ని తలుచుకోగానే దుఃఖం తన్నుకు వచ్చింది. గదిలోకి పరుగున వెళ్లి తండ్రిని అమాంతం కౌగిలించుకున్నాడు. వెక్కివెక్కి ఏడుస్తూ జరిగిన సంగతంతా చెప్పాడు. తన తప్పును క్షమించమని విలపించాడు. వాస్తవాన్ని చెప్పినందుకు రఘును తల్లిదండ్రులు కోపగించుకోలేదు. పైగా 'చూడు రఘూ! నువ్వే మా సర్వస్వం. నీ కోసం, నీ చదువు కోసం ఏమైనా చేస్తాం. నువ్వు మాలా కూలి బతుకు బతక కూడదన్నదే మా కోరిక. జరిగింది మరిచిపో. చేసిన తప్పు తెలుసుకున్నావు కదా. అదే చాలు. ఇక మీదట నీకేం కావాలన్నా సంకోచం లేకుండా మమ్మల్ని అడుగు. మేం తెచ్చిపెడతాం. మళ్లీ ఇలాంటి పొరపాటు చేయకు' అంటూ అక్కున చేర్చుకున్నారు. ఆ ఘటన రఘులో గొప్ప మార్పు తెచ్చింది. ఎప్పుడూ మంచి ప్రవర్తనతో మెలుగుతూ, తన మిత్రుడిలోనూ అలాంటి పరివర్తన తీసుకొచ్చాడు.

- పెండెం జగదీశ్వర్

జవాబులు: **ఏది భిన్నం:** a **చిలిపిప్రశ్న:** తినలేం కాబట్టి! **సరదా పదాలు:** 1.వేసవి 2.వేణువు 3.వేగము 4.వేడిమి 5.వేతనం 6.వేలుపు 7.వేడుక 8. వేకువ

ఆయిల్‌పాం గెలలకు మద్దతు ధర కల్పించాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఆయిల్‌పాం రాష్ట్ర కమిటీ సభ్యులు, ట్రైకార్ ఛైర్మన్ తాటి వెంకటేశ్వర్లు

దమ్మపేట, న్యూస్‌టుడే: ఆయిల్‌పాం గెలలకు టన్నుకు రూ. 10,500 మద్దతు ధర కల్పించాలని ఆయిల్‌పాం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ఆలపాటి రామ చంద్రప్రసాద్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. హైదరాబాద్‌లోని మంత్రి స్వగృహంలో ఆదివారం ట్రైకార్ ఛైర్మన్ తాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆయిల్‌పాం సంఘ సభ్యులు, ఆయిల్‌ఫెడ్ అధికారులు మంత్రిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయిల్‌పాం రైతులు మాట్లాడుతూ ఆయిల్‌పాం పంటకు మద్దతు కల్పించాలని రైతులు ఎప్పటినుండో పోరాడుతున్నారని వివరించారు. 15 కిలోమీటర్ల లోపు గెలలు తోలిన వారికి టన్నుకు రూ. 350 రవాణా చార్జి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయిల్‌ఫెడ్ అధికారులు కర్మాగారంలో క్రూడ్ ఆయిల్‌ను విక్రయించిన ప్రతిసారీ, రైతు కమిటీకి సంక్షిప్త సమాచారం ద్వారా ధర తెలియజేయాలని మంత్రిని కోరారు. ఈ సమస్యలపై కేంద్రంతో, ఆయిల్‌ఫెడ్ అధికారులతో మాట్లాడతానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర కమిటీ సభ్యుడు చీమకుర్తి వెంకటేశ్వరరావు, ఆయిల్‌ఫెడ్ అధికారులు సుధాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: స్పెషల్ ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం పోలాల అమావాస్యరోజు ఏం చేయాలి? ఇంట్లో పూజించే విగ్రహాల ఎత్తు ఎంత ఉండాలి? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆమె (శ్రీకాంత్, ఊహ).

మధ్యాహ్నం

12-00: స్పెషల్ అభి'రుచి': ఘుమఘుమలు 'పుదీనా వాంగీబాత్', మీచేతివంట 'మునగాకు జీడిపప్పువేపుడు', 'పాలకూరపచ్చడి', జస్ట్ ఎమినిట్ 'ఉప్మాబోండా' తయారు చేసే విధానం. ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00:వసంతం(డైలీ సీరియల్), 04-30: ఢీ 10 (సుప్రీండాన్స్‌షో) (రిపీట్), 06-00: శ్రీభాగవతం (భక్తిరసాత్మక దృశ్యకావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఆలీతో సరదాగా: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో.., 10-30: సినీవారం: (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00జబర్దస్త్ రిమిక్స్
01:00 మైకేల్ మదన్ కామరాజు రిపీట్
01:15 ది బ్రేకప్ కన్సల్టెంట్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యో రామ రిపీట్
03:30 హంగామా రిపీట్
సాయంత్రం
04:30 నా షో నా ఇష్టం
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 ఈ-జంక్షన్
09:00 పటాస్
09:30 అల్లరే అల్లరి
10:00 సరదాగా కాసేపు
10:30 తారక్ మామా అయ్యో రామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
డా.ఈటీవీ – (ఉ.6:30, 11:00, మ. 3:30, సా. 7:30)
యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా. 5:00, రా. 10:30)
అమృతం (ఉ.8:00, మ. 12:30, రా. 8:00)
హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ. 01:00, రా. 8:30)
ఆరోగ్యమస్తు (ఉ.9:00, మ. 03:00, సా. 4:00, రా. 9:00)
ఆయుష్ (ఉ.9:30)
లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (ఉ.10:00)
అందరికి ఆరోగ్యం (ఉ.10:30)
విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
హెల్దీ డయాబెటిక్ - (మ. 1:30)
జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (మ. 2:00, రా. 7:00)
బాడీ మైండ్ & సోల్– అంతరంగం (మ. 2:30, రా. 9:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: బందీ (కృష్ణంరాజు విజయశాంతి), 10-00: మార్నింగ్ షో: గృహప్రవేశం (ఎల్.వి.ప్రసాద్, భానుమతి), **మధ్యాహ్నం:** 1-00: మాట్నీ: సందడే సందడి (జగపతిబాబు, శ్రీకాంత్), **సాయంత్రం:** 4-00: ఈవినింగ్ షో: ఇందు (ప్రభుదేవా, రోజా), **రాత్రి:** 7-00: ఫస్ట్‌షో: పెద్దక్కయ్య (హరనాథ్, కృష్ణకుమారి), 10-00: సెకండ్‌షో: అసెంబ్లీ గూండా (దేవరాజ్, అరుంధతినాగ్).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - చికెన్ మసాలా ఇడ్లీ సాండ్విచ్ & హార్స్‌గ్రామ్ ఫ్రైడ్ రైస్, **ఉ.8.00, రా.9:00:** బ్రేక్ ఫాస్ట్ షో – స్పినాచ్ & చీజ్ స్టఫ్డ్ క్రిప్స్ & తెలగపిండి రవ్వ పులిహోర, **ఉ.9:30: వావ్ ఏమి రుచి** – అఖిడీ టుకో అఫ్యక్ & బోహేమనియన్ డ్రెస్సింగ్, **ఉ.10.00:** పిండివంటలు, ప్రసాదాలు – జీలు & చిలకడదుంప గులాబ్ జామ్, **ఉ.11.00: గోరు ముద్దలు** – ఆప్రికాట్ చికెన్ బ్రౌన్ రైస్, **ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ** – ఫ్రూటీ ఓట్స్, **ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్** - పెసరట్టు ఉప్మా & అల్లం పచ్చడి, **మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా** - సార్సో బాత్ ఇర్హాన్ మచ్ (బెంగాలీ క్యూసైన్), **మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్** – ఓట్స్ మసాల పూరీ, **మ.12.30, రా.8.45: "కొ అండ్ కాఫ్" సూపర్ చెఫ్** - ఫీ ఆనియన్ ఎగ్ ఫ్రైడ్ రైస్, **మ.12.45, సా.6.15: సూప్స్ & స్టార్టర్స్** - డ్రమ్ స్టిక్ లీఫ్ & హార్స్ గ్రామ్ సూప్, **మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి** – గ్రిల్డ్ ప్రాన్స్ విత్ యుజు సాస్ (జపాన్ క్యూసైన్), **మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్)** - ఆ కాకరకాయ పుల్ల బెల్లం పెట్టిన కూర, **మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్** – చాక్లెట్ కప్ కేక్ & ఫిష్ ఫింగర్స్, **మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్** – బీన్స్ ఉసిలి, **మ.2.30, సా.6.00: చోటా షెఫ్** – సాబూదాన చుడ్వా, **మ.2.45, రా.10.45: జిల్** – నట్టీ క్యారెట్ స్మూతీ & సిట్రస్ మింట్ ఫిజ్, **మ.3.00: ఛాయ్ బిస్కెట్** – కాల్ జోన్స్ & చాక్లెట్ ఆల్మాండ్ కాఫీ, **మ.3.15: సూప్స్ & స్టార్టర్స్** - ఎగ్ డ్రాప్ సూప్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: **శ్రీ భోగేశ్వర స్వామి ఆలయం, పామిడి, అనంతపురం జిల్లా,** 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: **శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, కందూరు మహబూబ్‌నగర్ జిల్లా,** **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం,10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 21-08-2017

SVBC — ఉదయం: 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామ స్తోత్రం, 07-30 శ్రీవారిసేవలు (తోమాలసేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయే - శివుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 పంచభూత లింగాలు, 03-30 విష్ణుపురాణం, **సాయంత్రం:** 04-30 క్షేత్ర దర్శిని, 05-00 లైవ్ ఎస్.డి. సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 భక్తిచైతన్యం, 08-30 ధర్మసోపానాలు - శ్రీ చాగంటి, 09-00 ఆలయ దర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవిసప్తసతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనికపర్వం.

భక్తి TV — ఉదయం: 06-00 శ్రీ శివ సహస్రం, 06-30 నమకంచమకం, 07-00 అర్చన, 07-30 శ్రావణలక్ష్మి నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 శ్రావణసోమవార వైభవం (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శివస్తోత్రం, 05-30 శ్రీశివసహస్రం, 06-00 నమకంచమకం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు — ఉదయం: 07-30 ఓంకారం, 08-00 సినిమా: కృష్ణ, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: రాక్షసుడు.

మా — ఉదయం: 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: బన్ని, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్‌బాస్, 02-30 బిగ్‌బాస్ రిపీట్, **సాయంత్రం:** 04-00 బిగ్‌బాస్ రిపీట్, 05-30 ఒకే జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్‌బాస్, 10-30 బిగ్‌బాస్ రిపీట్.

GEMINI — ఉదయం: 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: **రాజాబాబు, మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావు (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: రైడ్, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వునాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు. 10-00 సినిమా: కితకితలు.

HBO — ఉదయం: 06-00 ఆల్మోస్ట్ హీరోస్, 07-21 10,000 బీసీ, 09-20 ద గాడ్‌ఫాదర్, **మధ్యాహ్నం:** 12-29 ద హ్యాంగోవర్ పార్ట్-2, 2-15 ట్యాక్సీ 4, **సాయంత్రం:** 04-15 ద డార్క్ నైట్ రైజెస్, **రాత్రి:** 07-16 ఫైనల్ డెస్టినేషన్ 5, 9-00 టీనేజ్ మ్యూటెంట్ నింజ టర్టిల్స్: ఔట్ ఆఫ్ ది షాడోస్, 11-03 పారానార్మల్ ఆక్టివిటి 4.

పుదీనా సాగు వివరాలు



పుదీనా సాగు గురించి కంపసాగర్ కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త హారిక సూచించారు. పుదీనా ఔషధ మొక్క. దీని ఆకులను ఎక్కువగా వంటలలో సువాసన కోసం సుగంధ ద్రవ్యం గాను వివిధ రకాల పచ్చళ్ల తయారి లోను, సలాడ్‌ల లోను వాడతారు. ఈ మొక్క 40 సె.మీ. ఎత్తు వరకు పెరుగుతుంది. ఆకులు గుండ్రంగా ఆకుల పైభాగం మందంగా ముదురాకుపచ్చ రంగులో ఉంటాయి. ఇందులో మెంథాల్ అనే సుగంధ నూనే చాలా తక్కువ పరిమాణంలో ఉంటుంది. కానీ కార్వోన్ అనే సుగంధ పదార్థం ఎక్కువగా ఉండి సువాసనను, ప్రత్యేకమైన రుచిని కలిగిస్తుంది. పుదీనా ఆకుల కాండం నుండి తీసే నూనెను మెంథాల్ అంటారు. మెంథాల్‌ను ఎక్కువగా ఔషధాల తయారిలో, షేవింగ్, టూత్‌పేస్ట్ తయారిలోను వాడుతుంటారు. మెంథాల్ నూనె శాతం ఆకుల్లో 0.3.నుండి 0.8 వరకు, కాండంలో 0.1 శాతం వరకు ఉంటుంది. అయితే ఈ మెంథాల్ నూనె కోసం సాగు చేసే పుదీనా జాతులు ప్రధానంగా నాలుగు రకాలుంటాయి.

జపనీస్ మెంట్, పిప్పర్ మెంట్, స్పేయర్ మెంట్, బెర్గా మెంట్. వీటిలో గుర్తింపు పొందిన శివాలిక్, హిమాలయ, కోసి, సిక్షమ్ రకాలు మాత్రమే నూనె కోసం సాగు చేస్తారు.

వాతావరణం: ఆకుకూరగా సాగుకు సమశీతోష్ణ, ఉష్ణ ప్రాంతాలు అనువైనవి. ఉష్ణోగ్రత 20-25 డిగ్రీలు ఉంటే ఆకు పెరుగుదల ఉంటుంది. నూనె కోసం అయితే ఎత్తైన చల్లని ప్రాంతాలు సాగుకు అనుకూలం.

నేలలు: సారవంతమైన అధిక సేంద్రియ పదార్థాలు గల తేలికపాటి ఇసుక నేలలు, మురుగునీరు పోయే వసతి గల తేలికపాటి ఒండ్రు నేలలు అనుకూలం నీరు నిలిచే నల్లరేగడి నేలలు పనికిరావు.

విత్తనం: పుదీనాను కాండం ముక్కలు నాటుకోవడం ద్వారా సాగు చేయవచ్చు. 2-3 కణుపులు కలిగిన ముక్కలు ఎన్నుకోవాలి. ఎకరాకు 3-4 క్వింటాళ్ల తీగ ముక్కలు అవసరం అవుతాయి.

విత్తనశుద్ధి: కాండం ముక్కలను లీటర్ నీటికి కార్బండిజమ్ 1 గ్రా. లేదా కాప్టాన్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. కలిపిన ద్రావణంలో పది నిమిషాలు ముంచి నాటుకోవడం వల్ల వేరుకుళ్లను అరికట్టవచ్చు.

నాటే విధానం: వరుసల మధ్య 30 లేదా 45 సె.మీ. వరుసల్లో మొక్కల మధ్య 10 సెం.మీ. ఎడంతో 1-2 సెం.మీ. లోతులో ఒక కణుపు తప్పనిసరిగా భూమిలో ఉండేలా నాటాలి.

నాటే సమయం: ఆకుకూర కోసం సంవత్సరం పొడవునా నాటుకోవచ్చు. నూనె కోసం సాగు చేస్తే నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 లోపు నాటుకోవాలి. లేదా నూనె దిగుబడి తగ్గుతుంది.

ఎరువులు: ఆఖరి దుక్కిలో 5 టన్నుల పశువుల ఎరువు, 50 కిలోల నత్రజని, 85 కిలోల భాస్వరం, 15 కిలోల పొటాష్ వేయాలి. నత్రజని 3 దఫాలుగా అనగా ఆఖరి దుక్కిలో సగం, మిగతా సగం 40 రోజులకు, 80-90 రోజులకు వేసుకోవాలి.

–న్యూస్‌టుడే, త్రిపురారం.

పంటమార్పిడి-అంతరపంటలు



కందిలో అంతరపంటగా పెసర

ఒకే పంటను ఒకే పొలంలో వరుసగా పండించడం వల్ల చీడపీడల ఉధృతికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతాయని, తద్వారా దిగుబడులపై ప్రభావం పడుతుందని కనుక పంటల మార్పిడి పాటించాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి శ్యాం సూచించారు. పురుగు జీవిత చక్రం ముగించుకొని హాని కల్గించే స్థితికి చేరుకుంటుంది. ఒక పంటపై ఆశించే పురుగులు మరో పంటను ఆశించడం తక్కువ. పంట మార్పిడి చేస్తే పురుగు జీవితచక్రం ఛేదింపపడుతుంది. అవి వృద్ధి చెందడానికి ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతాయి.

సాధారణంగా పాటించే పంటల సరళి అంతరపంటలు: పప్పుధాన్యపు పంట ఆహారపంట-పప్పుధాన్యపు పైరు, చిరుధాన్యాలు ఆహారపంట-చిక్కుడు జాతి పచ్చిరొట్ట పైరు, వరి-పప్పుధాన్యపు పంట/వేరుశనగ/మొక్కజొన్న, పత్తి-జొన్న/మొక్కజొన్న, పొగాకు-మిరప/కూరగాయలు, చెరకు వరి/వేరుశనగ/కంది/ఆముదం/సజ్జ/జొన్న/

పంట మార్పిడి క్రమం: ఆహార వాణిజ్యపంటలు ఒకసారి, పప్పుజాతి పంటలు మరోసారి మార్పిడి చేయాలి. అవసరమైతే గడ్డిజాతి పైర్లు వేసుకోవాలి. భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట పైర్లు వేయాలి. పప్పుజాతి పంటల వేర్ల బుడిపెల్లో రైజోబియం సూక్ష్మజీవులు గాలి లోని నత్రజనిని స్థిరీకరించి మొక్కలకు అందిస్తాయి.

–న్యూస్‌టుడే, ఖానాపురం.

అట్టహాసంగా రామయ్యకు పట్టాభిషేకం


సీతారాములవారికి పట్టాభిషేకం చేస్తున్న ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు


పూజల్లో పాల్గొన్న భక్తులు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు భక్తిశ్రద్ధలతో సుప్రభాతం నిర్వహించి ఆరాధించి నామార్చనలు చేశారు. అభిషేకాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించి బంగారు పుష్పార్చన జరిపారు. ఈ సంబరంలో పాల్గొనేందుకు భక్తులు అమితాసక్తి కనబర్చి తమ భక్తిని చాటారు. వైదిక పెద్దలు చేసిన క్షేత్ర విశిష్టత ప్రవచనం భక్తులను మంత్రముగ్ధులను చేయగా వైష్ణవ సంప్రదాయంలో జరిగిన విష్వక్సేన పూజ పుణ్యాహ వాచనం పారవశ్యంలో నింపింది. నిత్యకల్యాణ ఘట్టం గురించి వివరిస్తుండగా దీనికి అనుగుణంగా క్రతువు సాగడంతో ఆద్యంతం తన్మయత్వంలో నింపింది. మాంగళ్య ధారణ పరమానందభరితులను చేయగా తలంబ్రాల వేడుక కన్నులకు పండుగ చేసింది. పుష్యమిని పురస్కరించుని సీతారామచంద్రులవారికి పట్టాభిషేక వేడుకను ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు నేతృత్వంలో కడు రమణీయంగా నిర్వహించారు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన రామయ్య తండ్రిని పట్టాభిషిక్తుడిగా తిలకించిన భక్తజనం పాహిమాం శ్రీరామ చంద్ర ప్రభో అంటూ మొక్కుకున్నారు. రెండు చేతులు జోడించి తనివితీరా ప్రణామం చేసి మురిసిపోయారు. దర్బారు సేవలో హరిదాసులు ఆలపించిన కీర్తనలు భక్తులను మైమరపింపజేశాయి. సెలవుదినం కావడంతో ఉదయం నుంచి విశేష సంఖ్యలో దర్శనాలు చేసుకుని కానుకలు సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

భద్రాచలం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరానికి చెందిన శ్రీరంగం వకులభాష్యం అనే భక్తుడు కుటుంబ సభ్యులతో ఆదివారం భద్రాచలం రామాలయాన్ని దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంలోని మూలమూర్తులను దర్శించి పూజలు చేసిన వీరు అనుబంధంగా ఉన్న ఆంజనేయస్వామివారిని లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నదానం నిమిత్తం రూ.లక్ష విరాళాన్ని ఏఈ నరసింహరాజు చేతుల మీదుగా స్వామివారికి సమర్పించారు. ఆలయం తరఫున తీర్థప్రసాదాలను స్వీకరించారు.


విరాళం అందిస్తున్న భక్తులు

కార్పొరేట్ వైద్యులు సామాజిక కార్యక్రమాల్లో ముందుండాలి: ఎస్పీ


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎస్పీ అంబర్ కిషోర్ ఝా

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: సామాజిక కార్యక్రమాలు నిర్వహించడానికి కార్పొరేట్ వైద్యులు ముందుకు రావాలని ఎస్పీ అంబర్ కిషోర్ ఝా కోరారు. పేదలకు వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వారి అవసరాలను తీర్చడం అనివార్యమన్నారు. భద్రాద్రి జిల్లాలో మెరుగైన వైద్యసేవలందించడంలో సైతం వారు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. వినికిడి సమస్యతో బాధపడుతున్న వారికి ఆదివారం సురక్ష ఆసుపత్రిలో డాక్టర్ రవిబాబు నేతృత్వంలో ఉచితంగా వైద్యశిబిరాన్ని ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉచితంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. డీఎంహెచ్‌ఓ కె.దయానంద్ మాట్లాడుతూ కొత్తగూడెంలో స్పెషలిస్టు వైద్యుల కొరత ఉందన్నారు. ఫలితంగా మెరుగైన సేవలందించడంలో కొంత వరకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అనంతరం వినికిడి సమస్యలతో బాధపడుతున్న వారికి స్క్రీన్ టెస్టులు కొనసాగించారు. పూర్తిస్థాయిలో వినికిడి సమస్య ఉన్న వారిని గుర్తించిన అనంతరం అక్టోబరు 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని వినికిడి పరికరాలను అందచేయనున్నట్లు ఈఎన్‌టీ స్పెషలిస్టు డాక్టర్ రవిబాబు పేర్కొన్నారు. హైదరాబాద్ హియరింగ్ సొల్యూషన్స్ నుంచి ప్రభాకర్, కిరణ్, సందీప్, శ్యామ్‌వినాయక హియరింగ్ సొల్యూషన్స్ నుంచి వీరన్న, కస్తూరి హియరింగ్ సొల్యూషన్ నుంచి శ్రీనివాస్, సురక్ష ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి వరద

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం వద్ద గోదావరి నిలకడగా మారినట్లు సీడబ్ల్యూసీ అధికారులు భావిస్తున్నారు. శనివారం 20 అడుగుల వరద ప్రవాహం ఉండగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు 23 అడుగులకు పెరిగింది. సాయంత్రం 5 గంటలకు మరో అర అడుగు పెరిగింది. ఆ తర్వాత ఎగువ నుంచి వరద రాకపోవడంతో నిలకడగా మారినట్లు భావిస్తున్నారు. నేడు వరద తగ్గుముఖం పట్టే వీలుందని అంచనా వేస్తున్నారు. స్నానఘట్టాల వద్ద వరద తగ్గితే బురద మేటలు వేసే వీలున్నందున అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతానికి ఎలాంటి ప్రమాదం లేనప్పటికీ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ నెలలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.



స్నానఘట్టాల వద్దకు చేరిన వరద (ఇన్‌సెట్‌లో 23 అడుగులు దాటిన వరద ప్రవాహం)

పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలి

సెప్టెంబరు 1న పింఛను విద్రోహ దినంగా నిరసన కార్యక్రమాలు


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీఎస్) పిలుపు మేరకు సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహదినంగా పాటిస్తున్నట్లు టీపీటీఎఫ్ నాయకులు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలను ధరించి జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాలో పాల్గొనాలని సంఘ నాయకులు కోరారు. ఆదివారం కొత్తగూడెం ప్రధాన తపాలా కార్యాలయం వద్ద సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి వివిధ సంఘాల జిల్లా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాలు తమ బాధ్యత నుంచి తప్పించుకోవడానికి నూతన పింఛన్ విధానాన్ని తీసుకురావడం సరికాదన్నారు. పాత విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పింఛన్ పొందటం ప్రతి ఉద్యోగి హక్కని, దశాబ్దాల పాటు సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించడం ముమ్మాటికీ ప్రభుత్వ బాధ్యతేనన్నారు. అనంతరం కార్యాచరణకు ఉద్దేశించిన గోడపత్రికను ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ బి.ముత్తయ్య, టీఎస్‌యూటీఎఫ్ ఎన్.వెంకటేశ్వరరావు, ఎస్‌టీఎఫ్ శ్యాంప్రసాద్, టీపీటీఎఫ్ రాంబాబు, నాయకులు బి.రమేశ్, మాధవరావు, కృష్ణ, నటరాజ్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్‌లో రుత్విక ప్రతిభ

ఖమ్మంక్రీడలు, న్యూస్‌టుడే: పుణెలో ఆదివారం ముగిసిన జాతీయ సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఖమ్మంకు చెందిన రుత్విక శివాని విజయం సాధించింది. జిల్లాకు చెందిన రుత్విక శివాని ఇటీవల కాలంలో జాతీయ, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ రంగంలో సంచలన విజయాలు సాధిస్తోంది. ఆదివారం జరిగిన జాతీయ మహిళల సింగిల్స్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన రుత్విక శివాని 21-10, 21-13 స్కోర్‌తో గోవాకు చెందిన ప్రభుదేశాయ్‌పై గెలుపొంది టోర్నీలో విజేతగా నిలిచింది. ప్రాథమికంగా ఖమ్మం బ్యాడ్మింటన్ రంగంలో ఓనమాలు దిద్దుకున్న రుత్వికశివాని గత కొన్నేళ్లుగా హైదరాబాదు గోపిచంద్ అకాడమిలో శిక్షణలో ఉంది. రుత్వికశివాణి విజయం పట్ల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

డబుల్స్ విజేతలకు అభినందన

హైదరాబాదులో ఈనెల 13,14 తేదీల్లో జరిగిన వెటరన్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఖమ్మంజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన చావా వెంకటేశ్వరరావు, సైదయ్య జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం సీక్వెల్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఖమ్మంగ్రామీణ ఏసీపీ సురేష్‌కుమార్, సీనియర్ న్యాయవాది కొల్లి సత్యనారాయణరావు అభినందించారు.


బహుమతి అందుకుంటున్న రుత్విక శివాని


డబుల్స్ జట్టును అభినందిస్తున్న ఏసీపీ సురేష్‌కుమార్, కొల్లి సత్యనారాయణరావు